




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY    నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada    ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 01 శుక్రవారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 317

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## సిగాచి పేలుడు ఘటనపై హైకోర్టులో పిల్

- భద్రతా లోపాలపై బాబూరావు ఆరోపణ
- ప్రభుత్వానికి నోటీసులు జారీ
- 3 వారాల్లో కౌంటర్ ఆదేశం
- ఫిర్యాదులో 8 మంది గల్లంతు ప్రస్తావన
- 163 కార్మికుల హాజరు ఆధారాలతో నిరూపణ
- పరిహారం ఇంకా చెల్లించలేదని ఆరోపణ
- యజమాని అరెస్ట్ కావలసిందే: పిల్



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన సిగాచి పరిశ్రమ ఘోర పేలుడు ప్రమాదంపై తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలు అయ్యింది. సిగాచి పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించలేదని న్యాయవాది కె.బాబూరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీంతో సిగాచి పరిశ్రమ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది.

పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ లభించలేదని ఫిటిషన్‌లో పేర్కొన్నారు బాబూరావు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని స్పష్టం చేశారు. సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకూ అరెస్టు

## ధర్మస్థల లోపల దాగిన రహస్యాలు

### దేశాన్ని షాక్‌కు గురిచేసిన శవాల ఫిర్యాదు

- గుర్తుతెలియని వ్యక్తి సంచలన ఆరోపణలు
- వివస్త్ర శవాల పేర్కొనడం కలకలం
- ప్రభుత్వం స్పందన - సిట్ దర్యాప్తు
- 15 ప్రాంతాల్లో తవ్వకాలు ప్రారంభం
- తొలి 2 రోజులు లభ్యంకాని ఆధారాలు
- మూడో రోజున అస్థిపంజరాలు లభ్యం
- భారీ భద్రత మధ్య తవ్వకాలు కొనసాగు
- డాగ్ స్క్వాడ్, యంత్రాలతో సహకారం



**బెంగళూరు-నవభూమి:**

కర్ణాటకలోని ధర్మస్థలలో ఏం బయటపడతాయో అనే దాని గురించే యావత్ దేశం ఆసక్తిగా చూస్తోంది. దీనిపై సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) దర్యాప్తు ముమ్మరం చేసింది. జులై 3వ తేదీన మంగళూరు దగ్గరలోని ధర్మస్థల పోలీస్ స్టేషన్లో గుర్తుతెలియని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు భారతదేశాన్ని ఉలిక్కి పడేలా చేసిన సంగతి తెలిసిందే. అంతలా అతనిచ్చిన ఫిర్యాదులో ఏముంది అంటే..నా చేతులతో నేను కొన్ని వందల శవాలను ధర్మస్థలలో అనేక చోట్ల పూడ్చిపెట్టాను. అందులో వివస్త్రలైన మహిళలు, బడికి వెళ్లే అమ్మాయిల శవాలు కూడా ఉన్నాయి. ప్రాణభయంతో ఆ పని చేశాను' అంటూ ఆ వ్యక్తి తన ఫిర్యాదులో పేర్కొనడమే దీనికి కారణం.

**అందరి చూపు ఒకే చోట!**

దీంతో బెంగళూరు ప్రభుత్వం ధర్మస్థల ఘటనలపై సిట్ ను ఏర్పాటు చేసి దర్యాప్తుకుఆదేశించింది. ఈ నేపథ్యంలో సిట్ విచారణ ధర్మస్థలలో మొన్నటి నుంచి కొనసాగుతోంది. మూడో రోజైన ఇవాళ(గురువారం) మృతదేహాలు పాతిపెట్టినట్లు చెప్పిన ప్రాంతాల్లో, ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిని దగ్గర పెట్టుకుని తవ్వకాలు సాగిస్తున్నారు. ఫిర్యాదుదారుడు చెప్పిన 15 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. నేడు నాలుగు ప్రాంతాల్లో సిట్ తవ్వకాలు జరుపుతోంది. మొదటి రోజు ఓ ప్రాంతంలో, రెండో రోజు నాలుగు ప్రాంతాల్లో ఇప్పటికే తవ్వకాలు జరిపారు.

నుంచి ఏడు అడుగుల మేర తవ్వకాలు చేపట్టామని సిట్ అధికారులు చెబుతున్నారు. 5 ప్రాంతాల్లో ఇప్పటివరకూ తవ్వకాలు జరిపినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. అయితే, ఇవాళ ఈ కేసులో బ్రేక్ త్రూ వచ్చింది. ఇవాళ ధర్మస్థలలో 6వ

## తుది నిర్ణయం స్పీకర్‌దే

- 3నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం
- తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు, స్పీకర్‌కు డెడ్‌లైన్
- స్వాగతించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ-నవభూమి బ్యూరో**

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. ఏళ్ల తరబడి పిటిషన్లను పెండింగ్‌లో పెట్టడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. తాజా తీర్పుతో స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## అమెరికా సుంకాలకు భారత్ స్పందన

- సుంకాల ప్రభావంపై కేంద్రం అధ్యయనం
- జాతీయ ప్రయోజనాలకు ప్రాధానం: కేంద్రం
- రైతులు, ఎంఎస్ఎంఇలపై ప్రత్యేక శ్రద్ధలి
- పాక్‌తో వాణిజ్య ఒప్పందం ప్రకటించిన ట్రంప్
- భారత్‌పై 25% సుంకాల అమలు ఆగస్టు 1 నుంచి
- రష్యా నుంచి ఆయుధాల కొనుగోలుపై ట్రంప్ విమర్శలు
- ఇరాన్ చమురుపై భారత్‌ను ఉద్దేశించిన వ్యాఖ్యలు
- ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ప్రకటనలు
- అమెరికా సుంకాలపై భారత్ కౌంటర్
- చైనా, భారత్‌పై యుద్ధ కాలపు ప్రమాణాల ఆరోపణ



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

అమెరికా సుంకాలపై భారత్ స్పందించింది. అమెరికా విధించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుం దనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేం దుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం చెప్పుకొచ్చింది.

కొద్దిసేపటికే పాకిస్థాన్‌తో..భారత్‌పై సుంకాలు విధించిన కాసేపటికే డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు శత్రుదేశామైన పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పాక్‌లో భారీ చమురు నిల్వల అభివృద్ధికి ఒప్పందం కుదిరినట్టు ప్రకటనలో చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో పాకిస్థాన్ నుంచి కూడా భారత దేశం చమురును కొనుకునే అవకాశం ఉంటుందని ట్రంప్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

భారత్‌పై మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వక్రబుద్ధి ప్రదర్శించారు. భారత్‌పై 25 శాతం సుంకాలు విధింస్తూ.. ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్ భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. రష్యా నుంచి భారత్ భారీగా ఆయుధాలు కొనుగోలు చేసిందని ఆరోపించారు. ఇరాన్ చమురు ఉత్పత్తులను భారత కంపెనీలు మార్కెటింగ్ చేస్తున్నాయని తెలిపారు.

రష్యాతో భారత్ ఏ వ్యాపారం చేసుకున్నా తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలని రష్యాకు అన్ని దేశాలు చెబుతుంటే.. యుద్ధ సమయంలో కూడా భారత్, చైనా మాత్రం రష్యా నుంచి చమురు కొంటున్నాయని విమర్శించారు. భారత్‌పై ప్రకటించిన 25 శాతం సుంకాలు రేపటి(ఆగస్టు 1) నుంచి అమల్లోకి రానున్నాయి అని ట్రూత్ సోషల్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ..

## కాళేశ్వరం విచారణ నివేదిక

### ప్రభుత్వానికి సమర్పించిన పీసీ ఘోష్ కమిషన్

- తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసిన పీసీ ఘోష్
- 15 నెలల పాటు సాగిన లోతైన విచారణ
- మొత్తం 115 మందిని విచారించిన కమిషన్
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణాల్లో లోపాలపై దృష్టి
- విజిలెన్స్, డ్యాం సేఫ్టీ నివేదికల సమీక్ష
- నాణ్యతపై తక్కువ, కాంట్రాక్టులకే ప్రాధాన్యత అన్న విమర్శ
- బీఆర్‌ఎస్ పాలనలో నిర్మాణ గందరగోళంపై ఆరోపణలు
- బ్యారేజీలు కుంగిపోవడం తర్వాత విచారణ ప్రారంభం
- సీఎం రేవంత్ ఆదేశాలతో కమిషన్ ఏర్పాటు
- నివేదిక ఆధారంగా తీసుకోబోయే చర్యలపై ఉత్కంఠ





**హైదరాబాద్-నవభూమి ప్రతినిధి**

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై తన నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్ అయిన జస్టిస్ ఘోష్ ఈ నివేదికను జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందించారు. 2023లో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు తలెత్తిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం కాంట్రాక్టుల కోసం ఈ ప్రాజెక్టును కట్టిందని.. నాణ్యతను గాలికొదిలేసి అడ్డగోలుగా ప్రాజెక్టులను నిర్మించారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. ఆ తర్వాత విజిలెన్స్, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ల ప్రాథమిక నివేదికల్లోనూ కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, అవకతకవకలపై న్యాయ

## తిరుమల శ్రీవారి బంగారు డాలర్ల కేసు

### 15మంది టీటీడీ అధికారులకు ఊరట

- ఇదిగో, "తిరుమల శ్రీవారి బంగారు డాలర్ల కేసు"
- బంగారు డాలర్ల కేసులో కీలక మలుపు
- 2006లో ప్రారంభమైన కేసుకు 2025లో ఊరట
- 15 మంది అధికారులపై చర్యలు నిలిపివేత
- విజిలెన్స్, సీబీసీఐడీ నివేదికల ఆధారంగా విచారణ
- అభియోగాలు రుజువుకాకపోవడంతో నిర్ణయం
- కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ తుది నివేదిక కీలకం
- ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు ఊరట



**తిరుపతి-నవభూమి ప్రతినిధి**

టీటీడీలో బంగారు డాలర్ల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 15 మంది అధికారులపై తదుపరి చర్యలను ప్రభుత్వం నిలిపివేసింది. 2006లో 5 గ్రాముల బరువున్న 300 బంగారు నాణేలు (డాలర్లు) దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి 2008లో నివేదిక సమర్పించారు. ఈ నివేదికలో రూ.15.40 లక్షల విలువైన డాలర్ల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.. ఆ తర్వాత సంబంధిత అధికారులపై అభియోగాలు నమోదు చేశారు. ప్రభుత్వం కేసును సీబీసీఐడీకి అప్పగించింది.. వారు కూడా దర్యాప్తు చేసి నివేదికను సమర్పించారు. విజిలెన్స్, సీబీసీఐడీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంబంధిత టీటీడీ ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఈ బాధ్యతను కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించింది. మొదట ఈ కేసును సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సుబ్రేంద్రు భట్టాచార్యకు అప్పగించారు. ఆ తర్వాత రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణకు అప్పగించారు. కేసు విచారణను కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించారు. అయితే విచారణలో అభియోగాలు రుజువు కాలేదని తేలింది.. తాజాగా తదుపరి చర్యలు నిలిపివేస్తూ దేవాదాయ శాఖ

## సైకిల్‌పై బాలయ్య సందడి

- పార్లమెంట్ ఆవరణలో బాలకృష్ణ సందడి
- సైకిల్‌పై కూర్చొని టీడీపీ స్టైల్ చూపించిన బాలయ్య
- హిందూపురం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో భేటీలు
- కేంద్ర నిధుల కోసం వినతులు సమర్పించిన బాలయ్య
- బసవతారకం పేరుతో మోసపూరిత విరాళాలపై హెచ్చరిక
- అశ్విన్ అట్లూరి పేరిట జరుగుతున్న మోసాలపై స్పందన
- పెమ్మసాని, ఖట్టర్, బిర్లా సహా పలువురు నేతలతో సమావేశం
- సినిమాలు-సర్వీస్ రెండింటిలోనూ ముందున్న బాలకృష్ణ





**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను నందమూరి బాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హిందూపురం నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించి పలు వినతులు సమర్పించారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, హరిదీప్ సింగ్ పురీ, మన్ సుఖ్ మండవీయలతో కూడా ఆయన అపాయింట్‌మెంట్ తీసుకున్నారు.కేంద్ర మంత్రులను కలిసే ముందు పార్లమెంట్ ఆవరణలో ఉన్న నందమూరి బాలకృష్ణకు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన సైకిల్ చూయించారు. పార్లమెంట్ సమావేశాలకు తాను రోజూ ఇదే సైకిల్‌పై వెళ్తున్నట్లు ఆయన చెప్పారు. దాంతో తమ పార్టీ సింబల్ అయిన సైకిల్‌పై బాలయ్య సరదాగా కూర్చొని ఫొటోకి పోజిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.


హిందూపురం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ నిలిచారు. 2014లో తొలిసారి రాజకీయాల్లో అడుగుపెట్టిన బాలయ్య.. 2019, 2024లో అక్కడ నుంచి గెలిచారు. ఒకవైపు సినిమాల్లో రాణిస్తూనే, మరోవైపు తన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. హిందూపురాన్ని అభివృద్ధి చేయాలంటూ ముఖ్యమంత్రిని కోరిన బాలయ్య.. ఇప్పుడు కేంద్రమంత్రులను కలిసి నిధులు విడుదల చేయాలని విన్నవించారు.

తాజాగా బంగారు బాలయ్య - బసవతారకం ఈవెంట్ పేరుతో తనకు తెలియకుండానే విరాళాలు సేకరించబోతున్నారనే సమాచారం రావడంతో నందమూరి బాలకృష్ణ స్పందించారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఛైర్మన్‌గా ఉన్న ఆయన ఈ ఈవెంట్‌కు ఎలాంటి అధికారిక అనుమతి లేదంటూ స్పష్టం చేశారు. అశ్విన్ అట్లూరి పేరిట వచ్చిన మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు తెలియజేశారు.

## ప్రపంచంలో అత్యధిక వలసదారులు భారత్ నుంచే

### ఐక్యరాజ్యసమితి వెల్లడి

- 2024 నాటికి వరల్డ్‌వైడ్‌గా 1.85 కోట్ల మంది ప్రవాస
- ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అన్న ఐక్యరాజ్యసమితి
- 2020లో ఈ సంఖ్య 27.5 కోట్లుగా ఉన్నట్లు వెల్లడి
- అత్యధికంగా యూఏఈలో 32.5 లక్షల మంది భారతీయులు
- ప్రపంచవ్యాప్తంగా 30.4 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులు



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వలసదారుల్లో అత్యధికం భారతీయులే అని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 2024 నాటికి వరల్డ్‌వైడ్‌గా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్టు, ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అని పేర్కొంది. ఇక, ప్రపంచవ్యాప్తంగా 30.4 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులు ఉన్నారని తెలిపింది. 2020లో ఈ సంఖ్య 27.5 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది.ఒకప్పుడు సౌదీ అరేబియా, పాకిస్థాన్ దేశాలకే పరిమితమైన భారతీయ వలస సముదాయం ఇప్పుడు పశ్చిమ దేశాలకు బదిలీ అయింది. పశ్చిమాసియాలోని ఇండియన్ డయాస్పోరాను తీసుకుంటే యూఏఈలోని మొత్తం జనాభాలో 40 శాతం భారతీయ వలసదారులే ఉన్నారు. ఇక, అమెరికాలో ఇండో అమెరికన్లు రెండో అతిపెద్ద ఆసియన్ గ్రూప్‌గా ఉన్నారు. మొదటి స్థానంలో చైనీస్ అమెరికన్లు ఉన్నారు.

యూఏఈలో 32.5 లక్షల మంది భారతీయులు ఉంటే.. అమెరికాలో 31.7లక్షలు, సౌదీ అరేబియాలో 19.5 లక్షలు, కెనడాలో 10.2 లక్షల మంది ఉన్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి డేటా ప్రకారం, పెద్ద సంఖ్యలో భారతీయ వలసదారులకు ఆతిథ్యం ఇస్తున్న ఇతర దేశాలలో ఆస్ట్రేలియా, కువైట్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, యూకే ఉన్నాయి.

## సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

- 2 కేసుల్లో కోర్టు ఉపసంహరణ
- నిరసనల సమయంలో నమోదైన కేసులు
- నల్గొండ, కొడిపల్లి కేసులకు ముగింపు
- కోర్టులో స్వయంగా హాజరైన సీఎం
- పాత కేసులపై త్వరిత తీర్పు
- 'ఓటుకు నోటు' ఇంకా విచారణలోనే



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



హైదరాబాద్
శుక్రవారం
01 । ఆగస్టు । 2025

## నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం..

నవ వార్త






**నల్లగొండ-నవభూమిబ్యూరో:** నాగార్జునసాగర్ జలాశయానికివరద ప్రవాహం కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువ నుంచి 2,56,453 క్యూసెక్కుల వరద వస్తుంగా, 2,96,522 క్యూసెక్కులు బయటకు వెళ్తున్నది. స్పిల్‌వే గేట్ల ద్వారా 2,78,520 క్యూసెక్కులు వెళ్తున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అందుగులు కాగా, ప్రస్తుతం 585.40 అదుగుల వద్ద ఉన్నది. మొత్తం నీటి నిల్వ 312.04 టీఎంసీలకుగాను 298.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.కాగా, సాగర్ నుంచి భారీగా వరద వస్తుండటంతో సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు నిండు కుండలా మారింది. దీంతో అధికారుల ప్రాజెక్టు పది గేట్లను మూడు మీటర్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు 2,51,259 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175.00 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 171.028 అడుగులు. జలాశయం గరిష్ఠ నీటి నిలువ సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను 42.160 టీఎంసీలు ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకేజీ ద్వారా 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## ఉపఎన్నికలు ఖాయం, సిద్ధంగా ఉండండి..!!



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:**ఎమ్మెల్యేల అనర్హత అంశం పైన సుప్రీం కోర్టు తీర్పు కీలకంగా మారుతోంది. అనర్హత పిటీషన్ ల పై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అనర్హత పిటీషన్ల పైన సుదీర్ఘ విచారణ జరిగింది. తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం.. ఈ రోజు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం నేడు తీర్పు వెలువరించారు. ఈ తీర్పు పైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కీలక వ్యాఖ్యలు చేసారు.బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఇది ఓ చారిత్రాత్మక తీర్పుగా అభివర్ణించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి ధన్యవాదాలు తెలిపారు. కొంత మంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీంకోర్టు నిరూపించిందని కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికల సందర్భంగా పాంచ్ న్యాయం పేరుతో పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు.రాహుల్ గాంధీకి నిజాయితీ ఉంటే తాను చెప్పిన నీతులకు కట్టుబడి ఉండాలని కేటీఆర్ సవాల్ విసిరారు. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదన్నారు. 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికకు 3 నెలల సమయం ఉందని, పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ఈ కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏళ్ల తరబడి పిటిషన్లను పెండింగ్‌లో పెట్టడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. సుప్రీం తాజా తీర్పుతో స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు కీలకంగా మారుతోంది.

## భార్య,అత్తను చంపి అరటి చెట్టుకింద పూడ్చిన యువకుడు



**మయుర్‌భంజ్-నవభూమిబ్యూరో:** సైకోగా మారిన దెబసిస్ పాత్ర ఓ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. జులై 19వ తేదీ రాత్రి సోనాలి, సుమతి నిద్రపోతూ ఉన్నారు. దెబసిస్ పాత్ర పెద్ద బండరాయితో వారి దగ్గరకు వచ్చాడు. ఆ రాయితో కొట్టి ఇద్దర్నీ చంపేశాడు.భార్యాభర్తల మధ్య గొడవలు దారుణాలకు తెరతీస్తున్నాయి. గొడవలు తారాస్థాయికి చేరినపుడు విడిపోయి సంతోషంగా బతకటం నేర్చుకోవాలన్న ఆలోచన లేకుండా హత్యలు చేసేస్తున్నారు కొందరు. తాజాగా, ఓ వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలోనే భార్య, అత్తను చంపేశాడు. నిద్రపోతున్న వారిని బండరాయితో కొట్టి ప్రాణం తీశాడు. తర్వాత రెండు శవాలను అరటి చెట్టుకింద పాతేశాడు. ఈ సంఘటన ఒరిస్సాలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే..మయుర్‌భంజ్‌కు చెందిన దెబసిస్ పాత్ర, సోనాలి దలాల్‌లకు కొన్నేళ్ల క్రితం పెళ్లయింది. పెళ్లైన మొదటి నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లేదు. ఎప్పుడూ గొడవపడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం సోనాలి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక, అప్పటినుంచి అక్కడే ఉంటోంది. సోనాలి తల్లిదండ్రులు కూతుర్ని భర్తతో కలపడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. జులై 12వ తేదీన సోనాలి తల్లి సుమతి దలాల్ .. సోనాలిని భర్త దగ్గరకు తీసుకు వచ్చింది.

తిరిగి వచ్చిన తర్వాత కూడా గొడవలు ఆగలేదు. దీంతో సైకోగా మారిన దెబసిస్ పాత్ర ఓ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. జులై 19వ తేదీ రాత్రి సోనాలి, సుమతి నిద్రపోతూ ఉన్నారు. దెబసిస్ పాత్ర పెద్ద బండరాయితో వారి దగ్గరకు వచ్చాడు. ఆ రాయితో కొట్టి ఇద్దర్నీ చంపేశాడు. తర్వాత రెండు శవాలను అరటి చెట్టు కింద గొయ్యి తీసి పూడ్చేశాడు. తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భార్య, అత్త కనిపించటం లేదని కంప్లైంట్ ఇచ్చాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎవ్వరికీ అతడిపై అనుమానం రాలేదు.

అతడు కొన్ని రోజులు కాలర్ ఎగరేసుకు తిరిగాడు. అయితే, నిమ్మ తోటలో భూమి తవ్వినట్లు ఉండటం.. కొత్త అరటి చెట్లు నాటి ఉండటం చూసి గ్రామస్తులకు అనుమానం వచ్చింది. ఇదే విషయాన్ని పోలీసులకు చెప్పారు. పోలీసులు పాత్రను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన మర్డర్ల గురించి బయటపెట్టాడు. పోలీసులు అరటి చెట్టు కింద ఉన్న శవాలను బయటకు తీశారు.

## కొత్త రూల్.. ఇకపై హెల్మెట్ లేకపోతే పెట్రోల్ కొట్టరు..



**భోపాల్-నవభూమి:** ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చాలా రోడ్డు ప్రమాదాల్లో రైడర్లు హెల్మెట్ వాడటం వల్ల ప్రాణాలతో బయటపడుతున్నారు. అయితే, ప్రమాదం జరిగితే ప్రాణాలు పోతాయని తెలిసినా కొంతమంది హెల్మెట్‌లు వాడటం లేదు. ఫైన్లు వేసినా, కౌన్సిలింగ్‌లు ఇచ్చినా జనాల్లో మార్పు రావటం లేదు. ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారే తప్ప.. హెల్మెట్‌లు మాత్రం వాడటం లేదు. ఈ నేపథ్యంలోనే భోపాల్ జిల్లా కలెక్టర్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారికి.. ఏ పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్ కొట్టకుండా కఠినమైన రూల్ తెచ్చారు. భోపాల్ జిల్లాలోని అన్ని పెట్రోల్, సీఎన్‌జీ పంపుల్లో ఈ రూల్ అమలుకానుంది. జిల్లా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకోవటం వెనుక ఓ బలమైన కారణం ఉంది. ఈ మధ్య కాలంలో ప్రమాదాలకు గురై.. హెల్మెట్ లేకుండా ప్రాణాలు పోగొట్టుకున్న వారి సంఖ్య బాగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ 'నో హెల్మెట్, నో పెట్రోల్ రూల్'ను తెరపైకి తెచ్చారు.

## గిరిజనులకు ములుగు జిల్లాలో మెగా జాబ్ మేళా



**ములుగు-నవభూమిబ్యూరో:**గిరిజన యువతను ఉద్యోగ రంగంలోకి తీసుకువచ్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) నిరంతరం కృషి చేస్తోంది. గిరిజన సంక్షేమానికి సంబంధించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ఉపాధి అవకాశాలను అందించేందుకు ఐటీడీఏ ప్రతి ఏడాదీ ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. తాజాగా ఈ నేపథ్యంలో, ఆగస్టు 6వ తేదీన ములుగు జిల్లా ఏటూరు నాగారం పట్టణంలోని గిరిజన భవన్ వేదికగా మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళా ద్వారా గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలను అందించడమే కాకుండా, వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి వాటిని సరైన దిశలో మలిచే ప్రయత్నం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) చిత్రా మిశ్రా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఎంతో సీరియస్‌గా తీసుకుంటున్నారు.

ఈ మెగా జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, మానుఫాక్చరింగ్ తదితర రంగాల నుంచి 20కి పైగా ప్రైవేట్ కంపెనీలు పాల్గొననున్నాయి. వీటిలో కొన్నిప్రముఖ కంపెనీలు కాగా, మరికొన్ని మల్టీనేషనల్ కంపెనీలు కావడం గమనార్హం. ఆయా సంస్థలు తమలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు రూ.15,000 నుండి రూ.30,000 వరకు నెలవేతనం అందించే అవకాశముందని సమాచారం.

ఈ జాబ్ మేళాలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు కనీసం పదవ తరగతి పాసై ఉండాలి. అదనంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఏఎన్ఎం, జీఎన్ఎం వంటి కోర్సులు పూర్తి చేసిన గిరిజన నిరుద్యోగులు అర్హులు. ఈ అవకాశాన్ని ములుగు జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువత కూడా వినియోగించుకోవచ్చు. గిరిజన యువతకు ప్రత్యేకంగా ఈ అవకాశాన్ని కల్పించడమే కాకుండా, వారిలో ఉద్యోగ ధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఐటీడీఏ ముందుకు సాగుతోంది.

ఇదే సమయంలో, గత సంవత్సరాల్లో నిర్వహించిన జాబ్ మేళాలు ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. తమ జీవితాలను సుస్థిరంగా మార్చుకోవడానికి బలమైన ఆధారంగా నిలిచాయి. ఆ విజయాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి మరింత విస్తృతంగా, మరింత ప్రణాళికాత్మకంగా ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. కేవలం ఉద్యోగ అవకాశాలకే పరిమితమవకుండా, కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలను ఇస్తున్నాయన్న దానిపై స్పష్టత ఇచ్చి, అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం కూడా ఇవ్వనున్నారు. అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరవ్వే సమయంలో తమ బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 94903 41911, 79816 33716, 80089 32159 నెంబర్లను సంప్రదించవచ్చు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఊరట.. ఆ 2 కేసులు కొట్టివేత



**(1వపేజీ తరువాయి)**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి న్యాయస్థానం నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన రెండు కేసులను ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. నల్గొండలోని 2 టౌన్ పోలీస్ స్టేషన్, కొడిపల్లి పీఎస్‌లలో ఆయనపై గతంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పు రేవంత్ రెడ్డికి రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎంతో ఉపశమనం కలిగించింది.

గతంలో నమోదైన కేసులు..

ఈ కేసులు రేవంత్ రెడ్డి టీపీసీసీ (తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో నమోదయ్యాయి. ముఖ్యంగా... 2021లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాల సమయంలో ఆయనపై ఈ అభియోగాలు మోపారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేస్తూ ర్యాలీలు నిర్వహించడం, అనుమతులు లేకుండా బహిరంగ సభలు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి ఆరోపణలతో అప్పటి పాలక పక్షం ఫిర్యాదులు దాఖలు చేసింది. ఈ కేసులకు సంబంధించి.. జులై 26న నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించగా.. రేవంత్ రెడ్డి తరపు న్యాయవాదులు తమ క్లయింట్ నిర్దోషిత్వాన్ని రుజువు చేయడానికి బలమైన వాదనలు, ఆధారాలను సమర్పించారు. ఇరు పక్షాల వాదనలను విన్న అనంతరం, న్యాయస్థానం కేసును జులై 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ రోజు.. సమర్పించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, రెండు కేసులను కొట్టివేస్తూ కీలక తీర్పును వెలువరించింది.

ఇతర కేసులు, న్యాయ పోరాటాలు..

రేవంత్ రెడ్డిపై గతంలో కూడా పలు కేసులు నమోదయ్యాయి. వీటిలో కొన్ని రాజకీయ ఉద్దేశాలతో పెట్టినవిగా ఆయన వర్గం వాదించింది. ముఖ్యంగా.. 'ఓటుకు నోటు' కేసు ఆయన రాజకీయ జీవితంలో ఒక పెద్ద సవాలుగా నిలిచింది. 2015లో నాటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక నామినేటెడ్ ఎమ్మెల్యేను ప్రలోభపెట్టారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఈ కేసులో ఆయన అరెస్టై, కొంతకాలం జైలులో కూడా ఉన్నారు. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది.

అంతేకాకుండా.. వివిధ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు, నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నందుకు గాను ఆయనపై పలు జిల్లాల్లో మరికొన్ని చిన్నపాటి కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిలో చాలావరకు పెద్దగా ప్రాధాన్యత లేనివిగా చెప్పుకోవచ్చు. తాజాగా కొట్టివేసిన ఈ రెండు కేసులు.. ఆయనపై నమోదైన రాజకీయ నేపథ్యం ఉన్న కేసులలో కొన్నింటికి ముగింపు పలికాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఆయనపై ఉన్న పాత కేసుల విచారణ వేగవంతమైంది. న్యాయస్థానం ఇచ్చిన ఈ తాజా తీర్పు, రేవంత్ రెడ్డికి ఊరటతో పాటు.. పరిపాలనపై మరింత దృష్టి సారించడానికి అవకాశం కల్పిస్తుంది.

## తుది నిర్ణయం స్పీకర్‌దే

**(1వపేజీ తరువాయి)**తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటిషన్‌పై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదని జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. న్యాయస్థానమే వేటు వేయాలని పిటిషనర్ల విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.

2023 నవంబర్‌లో తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత కొద్ది రోజులకే బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికపూడి గాంధీ, కాలె యాదయ్య, బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, డాక్టర్ సంజయ్‌పై కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్ స్పీకర్‌కు పిటిషన్లు ఇచ్చారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోటవంతో తెలంగాణ హైకోర్టు ఆ తర్వాత సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. వీరితో పాటు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం రిట్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు గతంలో మొత్తం తొమ్మిది సార్లు విచారణ చేపట్టింది. జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్ ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వ్ చేసింది. పార్టీ ఫిరా యింపుల నిరోధక చట్టం కింద ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలని స్పీకర్‌ను కోరడమే ఈ పిటిషన్ల ప్రధాన ఉద్దేశ్యం. స్పీకర్ ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని పిటిషనర్లు ఆరోపించారు. కేసులో ప్రతివాదులుగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చారు. ఈ మేరకు ఇరు పక్షాల వాదనల అనంతరం నేడు సుప్రీం ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతల పిటిషన్లపై 3 నెలల్లోగా అంటే అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు డెడ్‌లైన్ విధించింది. దీంతో స్పీకర్ ఏ రకమైన చర్యలు తీసుకుంటారనేది ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.

## నోయల్‌కు ఇండియాలో చేదు అనుభవం

**బెంగళూరు-నవభూమిబ్యూరో**

నోయల్ ఇండియాకు వచ్చాడు. బెంగళూరులో పర్యటించాడు. సాంప్రదాయ దుస్తులు ధరించి రోడ్డుపైకి వచ్చాడు. వీధుల్లో తిరుగుతూ డ్యాన్సులు చేశాడు. పర్మీషన్ లేకుండా పబ్లిక్‌లో డ్యాన్స్ చేసినందుకు బెంగళూరు పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు.సోషల్ మీడియాలో బాగా యాక్టీవ్‌గా ఉండే వాళ్లకు జర్మన్ టిక్‌టాకర్ నోయల్ రాబిన్‌సన్ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. పేరు తెలియని వాళ్లు కూడా అతడి జుట్టు చూస్తే ఇట్టే గుర్తుపట్టేస్తారు. నోయల్ 'బేబీ కామ్ డౌన్' పాటకు డ్యాన్స్ చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. నోయల్ దేశ దేశాలు తిరుగుతూ పబ్లిక్‌లో డ్యాన్స్ చేస్తూ ఉంటాడు. దొంగతనం చేస్తున్నట్లు బిల్డప్ ఇచ్చి.. జనాల్ని అదరగొడతాడు. ఆ వెంటనే బేబీ కామ్ డౌన్ అని డ్యాన్స్ చేస్తాడు. ఇతడి వీడియోలు కేవలం టిక్‌టాక్‌లోనే కాదు.. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రా మ్, ఫేస్‌బుక్‌లలో కూడా చాలా ఫేమస్.నో యల్‌ను యూట్యూబ్‌లో 19 మిలియన్ల మంది.. ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్ల మంది ఫాలో అవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంత ఫాలోయింగ్ ఉన్న ఇతడు తాజాగా ఇండియాకు వచ్చాడు. బెంగళూరులో పర్యటించాడు. సంప్రదాయ దుస్తులు ధరించి రోడ్డుపైకి వచ్చాడు. వీధుల్లో తిరుగుతూ డ్యాన్సులు చేశాడు. పర్మీషన్ లేకుండా పబ్లిక్‌లో డ్యాన్స్ చేసినందుకు బెంగళూరు పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. స్టేషన్‌కు తీసుకెళ్లారు. కొన్ని గంటల తర్వాత వదిలేశారు. నోయల్ ఇందుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశాడు.

'నన్ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లటం ఇదే మొదటి సారి. వాళ్లు నన్ను జైలుకు పంపిస్తారేమోనని భయపడ్డా. కానీ, అంతా మంచిగానే నడిచింది. నేను ఇప్పుడు బాగానే ఉన్నా. ఐ లవ్ ఇండియా' అని పేర్కొన్నాడు. ఆ వీడియో వైరల్‌గా మారింది. వైరల్‌గా మారిన వీడియోపై స్పందించిన ఓ నెటిజన్.. 'విదేశీయుడు ఇండియాను ఎక్స్‌ప్లోర్ చేయాలని వచ్చిన ప్రతిసారీ దేశ ప్రతిష్టను కర్ణాటక పాడు చేస్తోంది' అని కామెంట్ పెట్టాడు. ఈ కామెంట్‌పై నోయల్ స్పందిస్తూ.. 'మీరు క్షమాపణ కోరాల్సిన అవసరం లేదు. ప్రతీ దేశంలో ఇలానే జరుగుతుంటుంది. కేవలం ఇండియాలో మాత్రమే కాదు. ఓ చిన్న అనుభవం కారణంగా ఇండియాపై నాకున్న ప్రేమ చావదు' అని హుందాగా బదులిచ్చాడు.

## ధర్మస్థల లోపల దాగిన రహస్యాలు

**(1వపేజీ తరువాయి)** వద్ద అస్థిపంజరం లభ్యం కావడంతోపాటు, కొన్ని మానవ అవశేషాలు లభ్యం కావడంతో మరింత లోతుకు తవ్వేందుకు నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతున్నారు.

భారీ భద్రత మధ్య మూడో రోజు తవ్వకాలు కొనసాగుతున్నాయి. చిన్నపాటి యంత్రాలు, డాగ్ స్క్వాడ్ సాయంతో తవ్వకాలు నిర్వహిస్తున్నారు. అధికారుల సమక్షంలో 30 మంది కూలీలతో తవ్వకాలు జరుపుతున్నారు.

## అమెరికా సుంకాలకు భారత్ స్పందన

**(1వపేజీ తరువాయి)** నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. దేశీయ పరిశ్రమల భద్రతకు, భారతీయ రైతులు, ఎంఎస్ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు), పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. "అమెరికాతో నాలుగు రౌండ్ల ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. ఈ వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అనేక కీలక సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఆ చర్చలన్నింటిలోనూ దిగుమతులపై 10 నుండి 15 శాతం టారిఫ్ విధించడంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై ఇరు దేశాలు సానుకూలంగానే ఉన్నాయి. పలు వర్చువల్ సమావేశాలు కూడా జరిగాయి. అయినప్పటికీ, తాజా ప్రకటన అంచనాలకు విరుద్ధంగా ఉంది. అయినప్పటికీ, మేము మా దేశీయ పరిశ్రమలను పటిష్టంగా రక్షిస్తాం. దేశ ప్రయోజనాల కోసం అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటాం" అని పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో తెలిపారు.

## సిగాచి పేలుడు ఘటనపై హైకోర్టులో పిల్

**(1వపేజీ తరువాయి)**చేయలేదని.. ప్రమాదంపై సీఎం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జూన్ 30న సంభవించిన ఘోర పేలుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి న్యాయం చేయాలని పిటిషనర్ కోరారు.

ప్రమాద సమయంలో పరిశ్రమలో 143మంది కార్మికులు ఉన్నారని సిగాచి పరిశ్రమ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొందని ఆయన తెలిపారు. అయితే, వాస్తవానికి 163 మంది కార్మికులు ఉన్నారని సెక్యూరిటీ గేటు వద్ద ఉన్న రిజిస్టర్లు, సీసీటీవీ రికార్డులు ధృవీకరిస్తున్నాయని వెల్లడించారు. గల్లంతైన 8 మంది కార్మికులకు సంబంధించి వారి మృతదేహాలు లభ్యం కానప్పటికీ వారిని మరణించిన వారి కిందనే ప్రకటించి పరిహారం అందించాలని కోరారు.

ఈ దుర్ఘటనలో బాధితులకు పూర్తి సత్వర న్యాయం జరగాలని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ట భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని కోర్టుకు కె.బాబూరావు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి పరిహారం విషయంలో క్లారిటీ లేదని, విచారణ వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని పిల్‌లో పేర్కొన్నారు. కాగా, సిగాచి పరిశ్రమ ఘటన తెలంగాణ రాష్ట్రం వారికే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికుల కుటుంబాలకు కన్నీటి కథలను మిగిల్చింది.

## తిరుమల శ్రీవారి బంగారు డాలర్ల కేసు

**(1వపేజీ తరువాయి)**కార్యదర్శి వి.వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నిర్ణయంతో ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ ఈవోలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు సహా పలువురికి ఊరట దక్కింది. ఊరట దక్కిన వారిలో ఆర్ ఉమాపతి, ఆర్ రఘునాథాచారి, ఎన్ చెంచులక్ష్మి, కె చిత్తరంజన్, ఎస్ గజపతి, కె గోవర్ధన్, ఇ రామచంద్రారెడ్డి, ఏ రఘురామిరెడ్డి, ఎం చంద్రశేఖరరెడ్డి, ఏవీ రమణమూర్తి, ఎం వెంగన్న, పీ ఆంజనేయులు, బి మల్లికార్జునమూర్తి, బీఆర్ గురురాజారావు, రావినూతల శ్రీరామ్‌లు ఉన్నారు. ఈ డాలర్ల కేసులో టీటీడీ ఆలయ ఓఎస్డీగా పనిచేసిన డాలర్ శేషాద్రిపై కూడా అభియోగాలు నమోదయ్యాయి.. అయితే ఆయన 2021లో చనిపోయారు. మొత్తం మీద డాలర్ల కేసులో 15మందికి ఊరట దక్కింది.

## కాళేశ్వరం విచారణ నివేదిక

**(1వపేజీ తరువాయి)**ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తర్వాత 2024 మార్చిలో జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఈ కమిషన్ ఏర్పాటైంది. కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను క్షుణ్ణంగా పరిశీలించింది. 115 మందిని విచారించి సాక్ష్యాలను నమోదు చేసింది. విజిలెన్స్, %చీణూా% నివేదికలను కూడా విశ్లేషించింది. ఈ వ్యవహారంలో అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ముఖ్యమంత్రి కేసీఆర్ సహా.. నీటి పారుదలశాఖలో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను విచారించి నివేదక తయారు చేశారు.మొదట జూన్ నెలాఖరులోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, కమిషన్ కార్యకలాపాలు మేలో ప్రారంభమయ్యాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన, 115 మంది సాక్షుల విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, నివేదికల పరిశీలన వంటి వివిధ కారణాల వల్ల గడువును పొడిగిస్తూ వచ్చిన ప్రభుత్వం ఇవాళ నివేదికను స్వీకరించింది. దీనిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు అందించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చేపట్టే చర్యలు, బాధ్యులపై ఎలాంటి చర్యలు ఉంటాయనే విషయంపై ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠ నెలకొంది.


## విజయ్ దేవరకొండ ఫిటిషన్‌పై తీర్పు వాయిదా..

**హైదరాబాద్-నవభూమి:** సినీ హీరో విజయ్ దేవరకొండ దాఖలు చేసిన ఫిటిషన్‌పై ఇవాళ(గురువారం) తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్ పై తీర్పు వాయిదా వేసింది. గతంలో విజయ్ దేవరకొండ ఓ మూవీ ఈవెంట్‌లో గిరిజనులను కించపరిచేలా, వారి ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ గిరిజన సంఘాల నాయకులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని విజయ్ దేవరకొండ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విజయ్ తరఫు న్యాయవాది కోర్టులో ఇవాళ తన వాదనలు వినిపించారు. విజయ్ వ్యాఖ్యలు చేసిన రెండు నెలలు తరువాత గిరిజన నాయకులు ఫిర్యాదు చేశారని, ఇందులో దురుద్దేశం ఉందని ఆయన కోర్టుకు తెలిపారు. విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమాల్లో క్షమాపణ కూడా చెప్పారని హైకోర్టుకు వివరించారు. అయితే సోషల్ మీడియాలో చెప్పిన క్షమాపణలు పరిగణలోకి తీసుకోకూడదని ప్రతివాదుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరువురి వాదనలు ముగియడంతో హైకోర్ట్ తీర్పును వాయిదా వేసింది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ శుక్రవారం 01 । ఆగస్టు । 2025

## రాష్ట్రంలో.. ఇప్పటివరకు 20 పరువు హత్యలు




**చెన్నై-నవభూమి:** డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతల కారణంగా ఇప్పటివరకు 20 పరువు హత్యలు జరిగాయని, ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి




ఆరోపించారు. శివగంగ జిల్లాలో రెండో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఈపీఎస్ బుధవారం ఉదయం శివగంగ జిల్లా మడపురం ఆలయ వాచ్‌మన్‌గా పనిచేస్తూ లాక్‌పడెత్‌కు గురైన అజిత్‌కుమార్ నివాసానికి వెళ్ళారు. అక్కడ అజిత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం అజిత్‌కుమార్ తల్లి, సోదరుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, ఏ నేరం చేయని అజిత్‌కుమార్‌ను అన్యాయంగా లాక్‌పడెత్ చేసిన పోలీసుల వైఖరిని ఖండిస్తూ అన్నాడీఎంకే తరుపున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు రక్షణ కరువైందని, శాంతిభద్రలను కాపాడటంలో పోలీసుశాఖ విఫలమైందన్నారు.

## బాలిక కడుపులో అర కేజీ జుట్టు



**ముంబై- నవభూమి:** మహారాష్ట్రలోని అమరావతికి చెందిన పదేళ్ల బాలికకు శస్త్ర చికిత్స చేసి అర కేజీ జుట్టును తొలగించారు. ఈ బాలిక 5-6 నెలల నుంచి వాంతులు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్నది. ఆమెను 20 రోజుల క్రితం ఈ ప్రైవేట్ దవాఖానకు తీసుకొచ్చారు. ఆమెకు డాక్టర్ ఉష గబ్బియే వైద్య పరీక్షలు చేసి, కౌన్సెలింగ్ చేశారు. అప్పుడు ఆ బాలిక తనకు జుట్టును తినే అలవాటు ఉందని తెలిపింది. ఆ జుట్టు కడుపులో ఓ బంతి మాదిరిగా చుట్టుకుని ఉందని పరీక్షల్లో తేలింది. సర్జరీతో దానిని తొలగించాక బాధితురాలు ఇప్పుడు ఆహారం సక్రమంగా తింటున్నది.

## స్మార్ట్‌ఫోన్ సాయంతో క్షయను గుర్తించే పరికరం



**గువాహటి-నవభూమి:** స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి క్షయ వ్యాధిని గుర్తించగలిగే ఓ పోర్టబుల్ డివైజ్‌ను అస్సాంలోని తేజ్‌పూర్ విశ్వవిద్యాలయం పరిశోధకులు అభివృద్ధిపరిచారు. ఈ డివైజ్ పని చేయడానికి రసాయనాలు లేదా రంగులు అక్కర్లేదు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పవిత్ర నాథ్ నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది. పవిత్ర మాట్లాడుతూ, టీబీ బ్యాక్టీరియాకు ఉండే సహజ ప్రకాశం (ఆటోఫ్లోరసెన్స్) ఆధారంగా ఈ డివైజ్ క్షయ వ్యాధిని గుర్తిస్తుందని తెలిపారు. దీని బరువు 300 గ్రాముల కన్నా తక్కువ అని, ధర సుమారు రూ.25,000 అని చెప్పారు. ఎక్కడికి కావాలంటే అక్కడికి సులువుగా తీసుకెళ్లవచ్చునని తెలిపారు.

## వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంచి జనాదరణ.. ఆక్యుపెన్సీ రేషియో ఎంతంటే..



**ముంబై- నవభూమి:** భారతీయులకు అత్యాధునిక, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం అందించేందుకు ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంచి జనాదరణ దక్కుతోంది. ప్రస్తుతం అన్ని రూట్‌లల్లో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ రేషియో 100 శాతానికి పైగానే ఉంటోంది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం వెల్లడించారు. రైళ్లల్లో ఉన్న మొత్తం సీట్లకు గాను సగటున ఎందరు ప్రయాణికులు జర్నీ చేశారనే దాన్ని ఆక్యుపెన్సీ రేషియోగా వ్యవహరిస్తారన్న విషయం తెలిసిందే.

కేంద్ర మంత్రి ప్రకటన ప్రకారం, 2024-25 సంవత్సరానికి గాను వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో స్థూల ఆక్యుపెన్సీ రేషియో 102.01 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకూ ఆక్యుపెన్సీ రేషియో 105.03 శాతానికి చేరుకుంది. సెమీ హైస్పీడ్ వేగంతో ప్రయాణించే వందే భారత్ రైళ్ల కోచ్‌లను ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 144 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వివిధ రూట్‌లల్లో నడుస్తున్నాయి. మహారాష్ట్రలో 22 రైళ్లు, మధ్యప్రదేశ్‌లో 8 వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయి. ప్రయాణికులకు భద్రమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం అందించేందుకు రైల్వే శాఖ ఈ రైళ్లల్లో పలు అధునాత ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. రైలు ప్రమాదాలకు తావు లేకుండా కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. గంటకు గరిష్ఠంగా 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా వీటిని డిజైన్ చేశారు. యూవీ-సీ డిస్‌ఇన్‌ఫెక్షన్ వ్యవస్థ, ఏసీ, కుదుపులు లేని ప్రయాణం కోసం సెమీ పర్మనెంట్ కప్లర్స్, సెంట్రల్లీ కంట్రోల్డ్ ఆటోమేటెడ్ డోర్స్ వంటివి ఫీచర్లు ఈ రైళ్లల్లో ఉన్నాయి. ఈ రైళ్లల్లోని కోచ్‌లల్లో సీసీటీవీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ అలార్మ్ బటన్, టాక్ బ్యాక్ యూనిట్స్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎయిరోసాల్ ఆధారిత ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రెషన్ సిస్టమ్, దివ్యాంగుల కోసం ప్రత్యేక లావెటరీల వంటివి కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వందే భారత్ రైళ్లల్లో కోచ్‌ల సంఖ్య 8, 16, లేదా 20గా ఉంది. చైర్ కార్ కోచ్‌లో ఒక రకమైన సీటింగ్, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌లో మరో వర్షన్ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే, కొన్ని రూట్‌లల్లో కోచ్‌ల సంఖ్యను పెంచాలని కూడా ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## ధర్మం కోసమే కాషాయ శాలువా.. మూడేళ్ల తర్వాత కాంగ్రెసో.. బీజేపీనో చూద్దాం



**న్యూఢిల్లీ-నవభూమి:** హిందువుగా దళిత సమాజంలో మూడగెరెలో జన్మించానని, భవిష్యత్తులో బీజేపీకి వెళ్తానో కాంగ్రెస్‌లో ఉంటానో, బీఎస్పీ లేదా ఎస్‌డీపీఐలో చేరుతానో అనేది వేచిచూద్దామని మూడిగెరె కాంగ్రెస్ ఎమ్మెల్యే నయన మోటమ్మ అన్నారు. బుధవారం మూడిగెరెలో హిందూమహాసభ ఆధ్వర్యంలో గణపతి సమితి సమావేశంలో లోగో విడుదల చేశారు. బెంగళూరు: హిందువుగా దళిత సమాజంలో మూడగెరెలో జన్మించానని, భవిష్యత్తులో బీజేపీకి వెళ్తానో కాంగ్రెస్‌లో ఉంటానో, బీఎస్పీ లేదా ఎస్‌డీపీఐలో చేరుతానో అనేది వేచిచూద్దామని మూడిగెరె కాంగ్రెస్ ఎమ్మెల్యే నయన మోటమ్మ(%వీబఎఅస్త్రవతీవ జశీఅస్త్రతీవం మీూ చీుఖుఖు వీశ్మీుఎమ్ఖు%) అన్నారు. బుధవారం మూడిగెరెలో హిందూమహాసభ ఆధ్వర్యంలో గణపతి సమితి సమావేశంలో లోగో విడుదల చేశారు. శ్రీరామసేన వ్యవస్థాపకులు ప్రమోద్ ముతాలిక్‌తో కలసి వేదిక పంచుకున్న వేళ ఆమె కాషాయం శాలువా ధరించారు. ఇదే సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాను గణపతికోసం ధర్మంకోసం వచ్చానని, ఎమ్మెల్యేగా పార్టీ ప్రతినిధిగా వ్యవహరించేది ఆ తర్వాత అన్నారు. గణపతి సమితి కార్యాధ్యక్షురాలిగా హాజరయ్యానన్నారు. ఏ పార్టీవారు అనేది ఇక్కడ ముఖ్యం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నానని, దాంతోపాటు పలు అస్థిత్వాలతో కలిపి నయన మోటమ్మ అయ్యానన్నారు. పుట్టుక తర్వాతనే కులం, మతం, ఆడ, మగగా నిర్ధారణ అవుతుందని అంతమాత్రాన అన్నింటికీ విమర్శలు సరికాదన్నారు.

## భారత్‌లో కొత్త రకం బ్లడ్ గ్రూప్..: బెంగళూరు మహిళలో గుర్తింపు



ప్రపంచ వైద్య చరిత్రలో భారత్ కీలక మైలురాయిని అధిగమించింది. బెంగళూరుకు చెందిన ఒక మహిళలో అత్యంత అరుదైన, ఇంతవరకు గుర్తించబడని కొత్త రక్త వర్గం 'క్రిబ్' ను భారతీయ వైద్య నిపుణులు కనుగొన్నారు. ఈ అద్భుత ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. 'క్రిబ్' రక్త వర్గాన్ని కలిగి ఉన్న వ్యక్తులు ప్రపంచంలో కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని అంచనా వేస్తుండగా.. అందులో ఒకరు భారత్‌లోనే ఉండడం గమనార్హంగా నిలుస్తోంది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన 36 ఏళ్ల మహిళలో ఈ అరుదైన రక్తవర్గాన్ని గుర్తించారు. ఆమె రక్తాన్ని విశ్లేషించినప్పుడు.. సాధారణంగా కనిపించే పాజిటివ్/నెగటివ్ వర్గీకరణలకు భిన్నంగా.. ప్రత్యేకమైన యాంటీజెన్‌లు, యాంటీబాడీలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కానీ అది ఏ వర్గానికి చెందినదో తెలియక తెగ ఇబ్బంది పడిపోయారు. ఈక్రమంలోనే ఆమె కుటుంబ సభ్యులను కూడా ఆస్పత్రికి పిలిపించారు. మొత్తంగా 20 మందికి రక్త పరీక్షలు చ వారందరి వర్గాల సాధారణమైనవే కావడంతో.. ఏం చేయాలో పాలుపోక సదరు మహిళ రక్తాన్ని లోతైన పరిశోధనలు నిమిత్తం బ్రిటన్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న ఇంటర్నేషనల్ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ 10 నెలల పాటు ఆమె రక్తంపై అధ్యయనం చేసింది. క్రోమర్ సిస్టమ్‌లో ఓ కొత్త యాంటీ జెన్ పదార్థం ఉన్నట్లు గుర్తించింది. ఈక్రమంలోనే క్రోమర్, బెంగరూళురు పదాలను కలుపుతూ.. ఈ రక్తానికి నామకరణం చేశారు. అలాగే ఇందుకు సంబంధించిన అనేక విషయాల గురించి వివరించారు. 'క్రిబ్' రక్త వర్గాన్ని కలిగి ఉన్న వ్యక్తులలో కొన్ని ప్రత్యేక రకాల యాంటీబాడీలు ఉంటాయని నిపుణులు తెలిపారు. ఇవి ఇతర సాధారణ రక్త వర్గాలకు చెందిన రక్తాన్ని స్వీకరించడానికి అడ్డుపడతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త మార్పిడి అవసరమైనప్పుడు ఇది పెద్ద సవాలును విసిరే అవకాశం ఉందన్నారు. ఈ కొత్త రక్తవర్గం ఆవిష్కరణ రక్తం యొక్క జన్యుశాస్త్రం, వివిధ రక్తవర్గాల మధ్య సంబంధాలపై మరింత లోతైన అధ్యయనాలకు దారి తీస్తోందని పేర్కొన్నారు.

ఈ ఆవిష్కరణకు ముందు ప్రపంచంలో అత్యంత అరుదైన రక్త వర్గాలలో 'బొంబాయి బ్లడ్ గ్రూప్' ఒకటిగా పరిగణించబడేది. ఇప్పుడు 'క్రిబ్' కూడా ఆ జాబితాలో చేరింది. ఇలాంటి అరుదైన రక్తవర్గాలను గుర్తించడం వల్ల రక్త మార్పిడి ప్రక్రియలను మెరుగు పరచడానికి, నిర్దిష్ట ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వ్యక్తులకు సరైన చికిత్స అందించడానికి వీలు కల్గుతుంది. ఈ ఆవిష్కరణ భారత వైద్య పరిశోధనల సామర్థ్యాన్ని మరోసారి చాటింది. బెంగళూరులోని ఆసుపత్రి వైద్య బృందం, రక్త శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైంది.

## మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సహా ఆ ఏడుగురూ నిర్దోషులే..
### మాలేగావ్ పేలుడు కేసులో ముంబయి కోర్టు సంచలనం



**న్యూఢిల్లీ-నవభూమి:** 2008 మలేగావ్ పేలుళ్ల కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం సంచలన తీర్పు వెలువడింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురిని ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 17 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసు విచారణ.. అనేక మలుపులు తిరిగి, చివరికి నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించడం విశేషం. అసలేమిటీ కేసు..?

2008 సెప్టెంబర్ 29న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని మలేగావ్‌లోని ఒక మసీదు పేలుడు సంభవించింది. ముఖ్యంగా మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో.. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికిపైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. మొదట్లో ఈ కేసును మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం విచారించింది. ఈక్రమంలోనే మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేష్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను ప్రధాన నిందితులుగా చేర్చుస్తూ కేసు నమోదు చేశారు. పలువురి నుంచి వాంగ్మూలాలను కూడా సేకరించింది. ఆ తర్వాత జాతీయ దర్యాప్తు సంస్థ ఈ కేసును చేపట్టి.. దర్యాప్తును ముందుకు తీసుకెళ్లింది. ఎన్‌ఐఏ దర్యాప్తులో అనేక మంది సాక్షులను విచారించారు. మొత్తంగా 220 మంది సాక్షులను విచారించగా.. అందులో 15 మంది అంతకు ముందు తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మాట్లాడడం ప్రారంభించారు. ఇలా 17 ఏళ్లుగా ఈ కేసు విచారణ జరుగుతూనే వస్తోంది. అయితే ఎట్టకేలకు విచారణ జరిపిన ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. ముఖ్యంగా ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లో చాలు లోటుపాట్లు ఉన్నాయని తెలిపింది. అంతేకాకుండా ఈ కేసుకు ఉపా చట్టం వర్తించదని వివరించింది. ఈ పేలుడుకు వినియోగించిన మోటార్ బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది.


అలాగే బైకుకు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఎలాంటి ఆధారాల్లేవని గుర్తించింది. ఉగ్రవాదానికి మతం లేదని.. ఎందుకంటే మతం కూడా హింసను సహించని చెప్పింది. కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవని.. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవని చెప్పింది. అందుకే ఈ కేసులో ప్రధాని నిందితులుగా ఉన్న వారందరినీ నిర్దోషులుగా తేలుస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా బాంబు పేలుడు వల్ల ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం చేయాలని సూచించింది. మరోవైపు నిర్దోషులుగా తేలిన ఏడుగురూ తీవ్ర ఆదేవన వ్యక్తం చేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్లుగా తమ జీవితాలు నాశనం అయ్యాయని.. తమను బాధ పెట్టిన వారిని దేదువి శిక్షిస్తాడని చెప్పారు. అలాగే బాధిత కుటుంబాలు మాట్లాడుతూ.. ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## 2008 మాలేగావ్ బాంబు పేలుడు కేసు..
### ఏడుగురు నిర్దోషులుగా విడుదల



**ముంబై-నవభూమి:** 2008లో మహారాష్ట్ర మాలేగావ్ పట్టణంలో సంచలనం రేపిన ఘోర బాంబు పేలుడు కేసులో (2008 ముంబై ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దాదాపు 17 ఏళ్ల విచారణ తరువాత గురువారం (జూలై 31, 2025) ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురినీ కోర్టు నిర్దోషులుగా ప్రకటించి, విడుదల చేసింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. మాజీ బీజేపీ ఎంపీ ప్రగ్యా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్‌తో సహ రమేష్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరంతా అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం భారతీయ శిక్షా స్మృతి (%ఖూజ%) కింద అభియోగాలను ఎదుర్కొన్నారు. ప్రత్యేక న్యాయమూర్తి ఏకే లాహోటి తీర్పు వెలువరిస్తూ, ప్రాసిక్యూషన్ అనేక కీలక అంశాలను నిరూపించడంలో విఫలమైందని స్పష్టం చేశారు. బాంబు మోటార్‌సైకిల్‌పై ఉంచబడిందని నిర్ధారించే ఆధారాలు లేవని, పేలుడు పరికరం వేరే చోట ఉంచి ఉండవచ్చని కోర్టు పేర్కొంది. ఆర్‌డీఎక్స్‌ను కాశ్మీర్ నుంచి తీసుకొచ్చినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదు. మోటార్‌సైకిల్‌ను ఎవరు పార్క్ చేశారు, అది అక్కడికి ఎలా వచ్చింది అనే విషయంపై కూడా స్పష్టత లేదు. ప్రాసిక్యూషన్ ఏదైనా కుట్ర సమావేశాలు జరిగాయని కూడా నిరూపించలేకపోయింది. యూఏపీఏ చట్టం కింద అభియోగాలు విధించడానికి ఇచ్చిన అనుమతి కూడా తప్పుగా ఉందని కోర్టు తెలిపింది. సాక్షుల వాంగ్మూలాలు అస్పష్టంగా, వైరుధ్యంగా ఉన్నాయి. ఏ మతం ఉగ్రవాదాన్ని సమర్థించదని న్యాయమూర్తి తెలిపారు. కల్నల్ పురోహిత్ బాంబును తయారు చేశాడని లేదా సాధ్వీ ప్రగ్యా బైక్ పేలుడులో ఉపయోగించబడిందని నిరూపించే ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. తగినంత నమ్మదగిన ఆధారాలు లేనందున, నిందితులందరికీ ప్రయోజనం ఇస్తూ కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పు దర్యాప్తు సంస్థలపై మరిన్ని ప్రశ్నలను లేవనెత్తింది. ఎన్‌ఐఏ తీవ్రమైన శిక్షను కోరినప్పటికీ, ఆధారాల లోపం వల్ల నిందితులు విడుదలయ్యారు. ఈ తీర్పు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు ప్రక్రియలో కచ్చితత్వం, ఆధారాల సేకరణ ఈ కేసు ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది.

## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేసిన అధికారులు.. కారణమిదే



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా శివుడిని కొలిచే భక్తులు అమర్‌నాథ్ యాత్రను ఎంతో పవిత్రంగా భావిస్తారు. అయితే, భారీ వర్షాల కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల భద్రత దృష్ట్యా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది యాత్రలో దాదాపు 3.93 లక్షల మంది మంచు లింగాన్ని దర్శించుకున్నారు. యాత్రకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మరి యాత్ర ఎప్పుడు తిరిగి ప్రారంభమవుతుందో వేచి చూడాలి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ..మన దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా హిందూ మతాన్ని విశ్వసించే వారంతా పరమ శివుడిని ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ఇక పరమేశ్వరుడిని నమ్మే భక్తులు మాత్రమే కాక ప్రతి హిందువు కూడా జీవితంలో ఒక్కసారైనా అమర్‌నాథ్ యాత్ర చేయాలని కోరుకుంటారు. ఈ యాత్ర పూర్తి చేస్తే జన్మ జన్మల పాపాలు నశిస్తాయని కొందరు విశ్వసిస్తుంటారు. అందుకే జమ్మూ కశ్మీర్ హిమాలయాల్లోని అమరనాథ్ గుహల్లో మంచు రూపంలో కొలువైన భోళా శంకరుడిని దర్శించుకోవడానికి ప్రతి ఏటా వేలాది మంది భక్తులు.. ప్రాణాలను పణంగా పెట్టి మరీ యాత్రకు వస్తుంటారు. ఇక ఈ ఏడాది జులై 3న అమర్‌నాథ్ యాత్రం ప్రారంభం అయ్యింది. ఆగస్టు 9 వరకు కొనసాగనుంది. తాజాగా అమర్‌నాథ్ యాత్రకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. యాత్రను నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఆ వివరాలు. అమర్‌నాథ్ యాత్ర నిలిచిపోయింది. కారణం.. కశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు. కుండపోత వాన కురుస్తుండటంతో.. బుధవారం పహల్గాం , బల్తాల్ బేస్ క్యాంపుల నుంచి యాత్రను నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. జమ్మూలోని భగవతీ నగర్ శిబిరం నుంచి వాహనాల్లో వచ్చే భక్తుల రాకను కూడా గురువారం నాడు ఆపేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్ అంతటా గ్యాప్ లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయిని.. అందుకే ముందు జాగ్రత్త చర్యగా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

## మరీ ఇంత దారుణమా.. ఈఎంఐ కట్టనందుకు వ్యక్తి భార్యను..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఝాన్సీలో ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది దారుణానికి ఒడిగట్టారు. ఈఎంఐ చెల్లించలేదని రవీంద్ర వర్మ అనే వ్యక్తి భార్యను బ్యాంకులో బంధించి డబ్బులు చెల్లిస్తేనే విడుదల చేస్తామని బెదిరించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు జోక్యం చేసుకుని మహిళను విడిపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు బ్యాంకు సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ఇప్పటివరకు 11 వాయిదాలు చెల్లించినా బ్యాంకు రికార్డుల్లో 8 మాత్రమే ఉన్నాయని ఆరోపించాడు.

ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకుల వద్ద లోన్ తీసుకోవడం అంటే స్వయంగా మనల్ని అవమానించడానికి.. ఆఖరికి ప్రాణాలు తీసుకోవడానికి వారికి అవకాశం కల్పించిన వారం అవుతాం. లోన్ యాప్‌లు, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు ఈఎంఐ ల వసూలు విషయంలో ఎంత కఠినంగా ఉంటాయో.. సమయానికి డబ్బులు చెల్లించకపోతే.. ఎంత దారుణంగా ప్రవర్తిస్తాయో చూస్తూనే ఉన్నాం. సదరు సిబ్బంది మనల్ని ఆత్మహత్య చేసుకోవడానికి సైతం ప్రేరేపించేంత అమానుషంగా వ్యవహరిస్తారు. తాజాగా దేశంలో మరో ప్రైవేటు బ్యాంక్ అఘాయిత్యం వెలుగులోకి వచ్చింది. ఆర్థిక పరిస్థితి అనుకూలించక ఓ వ్యక్తి ఈఎంఐ కట్టలేదు. దీంతో సదరు ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు అతడి భార్యను బందించారు. డబ్బులిస్తేనే ఆ వ్యక్తి భార్యను విడిచిపెడతామని స్పష్టం చేశారు. ఈ అమానుష ఘటన వివరాలు..ఈ దారుణ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో వెలుగు చూసింది. ఈఎంఐ చెల్లించలేదనే కారణంతో ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగులు ఓ వ్యక్తి భార్యను బందించారు. ఈఎంఐ కడితేనే అతడి భార్యను వదిలేస్తామని తేల్చి చెప్పారు. ఏం చేయాలో పాలుపోని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ప్రైవేటు బ్యాంక్ సిబ్బంది చేసిన దారుణం గురించి వెల్లడించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంకు వద్దకు వెళ్లి.. ఉద్యోగుల వద్ద బందీగా ఉన్న బాధితుడి భార్యను విడిపించారు. సదరు బ్యాంకు సిబ్బందిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపడమే కాక.. మరీ ఇంత అమానుషంగా వ్యవహరిస్తారా.. అంటూ జనాలు మండిపడుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూంచ్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన రవీంద్ర వర్మ అనే వ్యక్తి బమ్రౌలి గ్రామంలోని ఆజాద్ నగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు బ్యాంక్ వద్ద 40 వేల రూపాయలు పర్సనల్ లోన్ తీసుకున్నాడు. ఇందుకు గాను ప్రతి నెలా రూ.2,120 ఈఎంఐ చెల్లించేవాడు. అయితే గత కొంత కాలంగా అతడి ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడం వల్ల కొన్ని నెలలుగా ఈఎంఐ చెల్లించడంలేదు. దీంతో గత సోమవారం బ్యాంకు సిబ్బంది రవీంద్రకు కాల్ చేసి బ్యాంకు వద్దకు రమ్మని పిలిచారు. తన భార్య పూజ వర్మతో కలిసి రవీంద్ర బ్యాంకు వద్దకు వెళ్లాడు. ఇదే అవకాశంగా భావించిన సదరు ప్రైవేటు బ్యాంకు సిబ్బంది రవీంద్ర భార్యను బలవంతంగా బ్యాంకు లోపల కూర్చోబెట్టారు. బాకీ మొత్తాన్ని డిపాజిట్ చేసే వరకు ఆమెను విడిచిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. డబ్బులు కట్టి భార్యను విడిపించుకుని వెళ్లమని చెప్పారు. దీంతో రవీంద్ర తప్పకుండా వారి బాకీ చెల్లిస్తానని.. తన భార్యను విడిచిపెట్టాల్సిందిగా వేడుకున్నాడు. పైగా ఇప్పటికిప్పుడు డబ్బులు కట్టమంటే తన దగ్గర లేవని.. కాస్త సమయం ఇస్తే అప్పు మొత్తం తీర్చేస్తానని వెల్లడించాడు. అయినా సరే ఆ బ్యాంకు సిబ్బంది మనసు కరగలేదు. డబ్బులు ఇస్తేనే అతడి భార్యను వదిలిపెడతామని చెప్పారు. ఇక చేసేదేం లేక చివరకు రవీంద్ర డయల్ 112 నంబర్‌కు కాల్ చేసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. బాధితుడు రవీంద్ర సమస్య తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. అతడి భార్యను విడిపించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ.. తన భార్యను దాదాపు 4 గంటల పాటు బందీగా ఉంచారని వెల్లడించాడు. పైగా తాను ఇప్పటి వరకు 11 వాయిదాలు కట్టానని.. కానీ బ్యాంకులో కేవలం 8 వాయిదాలు మాత్రమే చూపించారని వాపోయాడు.

## ఉత్తరాదిని వణికిస్తున్న వానలు..



**బళ్లారి (బెంగళూరు): -నవభూమి:** ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వానలు కురుస్తున్నాయి. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, బాగల్‌కోట, బెళగావి జిల్లాల్లో నదులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నదుల సమీపంలో ఉన్న గ్రామాలు నీట మునిగాయి. జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వంతెనలపై నీరు పారుతున్నాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. కొన్నిచోట్ల దేవాలయాల్లోకి నీరు చేరాయి. ఘటప్రభ నదిలో వరద నీరు విపరీతంగా పెరిగింది. బాగల్‌కోట జిల్లాలోని ముథోల్ తాలూకాలో నదిపై నిర్మించిన 8 వంతెనలు, అలాగే బ్యారేజీలు మునిగిపోయాయి. వరద కారణంగా ముథోల్ పరిసరాల్లోని మిర్జి, మలాలి, ఒంటిగోడ, మాచేనూర్ ఇతర గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి. మాచనూర్ గ్రామంలోని హొళేబసవేశ్వర ఆలయం నీట మునిగింది. భక్తులు ఆలయంలోకి వెళ్లడం కష్టంగా మారడంతో ఒడ్డునే దర్శనం చేసుకుని వెళుతున్నారు. బళ్లారి జిల్లా కంప్లి, కొప్పళ జిల్లా గంగావతి మధ్య తుంగభద్ర( నది పొంగి ప్రవహిస్తోంది. నదిలో 1.10 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయి. గంగావతి, కంప్లి ప్రాంతాల్లో మూడు రోజులుగా వంతెనలు నీటిలోనే ఉన్నాయి. రాకపోకలు నిల్చిపోయాయి. కంప్లి నుంచి గంగావతి వైపు వెళ్లే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం లేదు. గర్భిణులు, రోగులు వైద్యం కోసం గంగావతికి కాకుండా బళ్లారికి వెళుతున్నారు. కంప్లి, సిరుగుప్ప రహదారిపై నారిహళ్లి వంతెన నీటమునిగింది. వరద కాస్త తగ్గుముఖం పట్టినట్టే పట్టి తిరిగి పెరుగుతుండడంతో జనజీవనం అతలాకుతలం అయింది. రైతులు ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. ఇక నది ఆధారంగా జీవనం సాగించే వారు కూడా నదివైపు వెళ్లరాదని అధికారులు ఆదేశించారు. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో నుంచి వివిధ ప్రాంతాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.

## అందరూ నన్నే తప్పుబట్టడం న్యాయమా..

**చెన్నై:-నవభూమి:** ఇంటి నుండి కాయగూరలు కొనటానికి, కారుకు పెట్రోలు వేయడానికి వెళ్లలేకపోతున్నానని, అందరూ తనను మాత్రమే తప్పుబట్టేలా ప్రవర్తిస్తున్నారని ప్రొఫెసర్ నిఖితా ఆరోపించారు. అజిత్‌కుమార్ లాకప్ డెత్ కేసుపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు నిఖిత, ఆమె తల్లి శివకామిని రెండోసారి విచారణ జరిపారు. విచారణ అనంతరం నిఖిత మీడియాతో మాట్లాడుతూ ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌పై తాను ఫిర్యాదు మాత్రమే చేశానని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. పోలీస్ కస్టడీలో అజిత్‌కుమార్ మృతి చెందినట్లు తెలుసుకుని బాధపడ్డానని, అందరూ ఏకపక్షంగా తననే తప్పుబడుతుండగా ఇంటి నుండి బయటకెళ్ళి కాయగూరలు కొనేందుకు, పెట్రోలు వేసుకునేందుకు కూడా వెళ్లలేకపోతున్నానని, నిఖిత ఆందోళన వ్యక్తం చేశారు.





## సినీనటి ఖుష్బుకు కీలక పదవి..

**చెన్నై- నవభూమి:** ప్రముఖ సినీనటి ఖుష్బు రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైనట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు. టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో బుధవారం సాయంత్రం నటి ఖుష్బుతో పాటు ఉపాధ్యక్షులుగా నియమితులైన 14 మంది జాబితా విడుదల చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అనుమతితో రాష్ట్ర విభాగానికి నూతన నిర్వాహకులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.రామలింగం, కరునాగరాజన్, శశికళ పుష్ప, కనక సభాపతి, డాల్ఫిన్ శ్రీధర్, ఏజీ సంపత్, జయప్రకాశ్, ఎం.వెంకటేశన్, గోపాల్‌స్వామి, ఖుష్బు, ఎన్.సుందర్ పాల్ కనకరాజ్‌లను పార్టీ రాష్ట్ర ఉపాధ్యాక్షులుగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కేశవ వినాయగం, బాలగణపతి, రామ శ్రీనివాసన్, ఎం.మురుగానందం, కాత్యాయణి, ఏబీ మురుగానందం నియమితులయ్యారు.కాగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శులుగా కరాటే త్యాగరాజన్, అమర్‌ప్రసాద్ రెడ్డిలతో పాటు 15 మంది నియిమితులయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా ఎస్ఆర్.శేఖర్, పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఎం.చంద్రన్, ప్రధాన కార్యాలయ ప్రచారకర్తగా నారాయణన్ తిరుపతిలతో పాటు పార్టీ అధిష్టానం అనుమతించిన వారిని పార్టీ పదవులకు ఎంపిక చేసినట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

## గాజా ఆకలిచావుల యుద్ధం

ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య వున్న సుదీర్ఘ రాజకీయ, భౌగోళిక, సామాజిక విభేదాలు దశాబ్దాలుగా హింసా రూపంలో విస్ఫోటనమవుతూనే ఉన్నాయి. కానీ 2023లో హమాస్ దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రారంభించిన "ప్రతిచర్య" యుద్ధం ఇప్పటికి 22 నెలలు గడిచినా ముగిసిన దాఖలాలు లేవు. ఈ యుద్ధానికి ఉన్న వాస్తవ రాజకీయ లక్ష్యాలు ఏమిటో అనుమానాస్పదమైనప్పటికీ, గాజాలో నివసిస్తున్న నిరుపరాధ జనాభా ముఖ్యంగా మహిళలు, పిల్లలు -మాత్రం దానివల్ల రోజూ చావును ఎదుర్కొంటున్నారు. గాజాలో ఆకలిచావులుగా వెలసిన ఈ యుద్ధం, మానవతను మింగేస్తున్న మృగయుద్ధంగా మారిపోయింది.

గాజా భూభాగం దాదాపు 365 చ.కి.మీ. విస్తీర్ణంతో, దాదాపు 20 లక్షల మంది జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత గల ప్రాంతాల్లో ఒకటి. ఇది గత పది ఏళ్లుగా ఇజ్రాయెల్, ఈజిప్ట్ ద్వారాల బందీల్లో చిక్కుకుపోయింది. ఈ కాలంలో అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోయాయి. విద్య, ఆరోగ్యం, ఉపాధి, ప్రాథమిక అవసరాలన్నీ తక్కువైపోయాయి. కానీ 2023 అక్టోబర్ తరువాత మొదలైన ఈ తాజా యుద్ధం, ఆ వాస్తవాల్ని శతచక్కెరలుగా మార్చింది.ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించిన ప్రకారం, హమాస్ దళాలపై దాడులు జరపడం, వారి భద్రతా మౌలికసదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఉంది. కానీ ఆ దాడుల్లో ఎక్కువగా పౌరులే ప్రాణాలు కోల్పోతున్నారు. గాజాలోని నివాస ప్రాంతాలపై జరిపిన వైమానిక దాడులు, ఆసుపత్రుల పైనా జరిగిన బాంబు దాడులు, బహిరంగ ప్రదేశాల్లో జరిపిన శత్రుసమూహ వ్యతిరేక చర్యలన్నీ మానవ హక్కుల ఉల్లంఘనల శ్రేణిలోకి వచ్చాయి.జూలై 2025 నాటికి, మరణించిన గాజా పౌరుల సంఖ్య 60 వేలు దాటిందని, వీరిలో మూడింట రెండు వంతులు చిన్నపిల్లలు, మహిళలేనని యునైటెడ్ నేషన్స్ నివేదిక పేర్కొంది. ఇది ఏ యుద్ధకైనా మించిన మానవ విలయం.

యుద్ధాలంటే బాంబులు, తుపాకులు మాత్రమే కాదు. ఆహారం, నీరు, ఔషధాలు లేని పరిస్థితి మరింత నిశితంగా ప్రజల ప్రాణాలు తీస్తుంది. గాజాలో ఇదే జరుగుతున్నది. ఇజ్రాయెల్ ఆహార సరఫరాను పూర్తిగా అడ్డుకుంటున్నది. జాతీయ, అంతర్జాతీయ సహాయ సంస్థలు పంపుతున్న తినుబండారాలు, పోషక పదార్థాలు సరిహద్దుల్లోనే నిలిపివేస్తున్నారు. ఇందులో ఐరాస, రెడ్‌క్రాస్, డబ్ల్యూహెచ్‌ఓ సహాయ యత్నాలు కూడా అడ్డంకులకు గురవుతున్నాయి. ఫలితంగా గాజాలో పశువులవంటి స్థితిలో మానవులు ఆకలితో మృత్యువాత పడుతున్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఈ ఏడాది ఇప్పటివరకు 74 మంది ఆకలితో చనిపోతే, అందులో 63 మంది జూలై నెలలోనే ప్రాణాలు కోల్పోయారు. ఇది తీవ్రమైన మానవీయ సంక్షోభం. ఐదేళ్లలోపు చిన్నపిల్లలే ఇందులో ఎక్కువగా ఉన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య కేవలం రెండు నెలల్లో మూడింతలు పెరగడం అత్యంత కలచివేసే దృశ్యం.ఈ యుద్ధం కేవలం ఒక సైనిక చర్య కాదు. ఇది ఆహారాన్ని ఆయుధంగా మార్చిన నూతన మానవహింస. ఆకలితో చావడమే ఇప్పుడు గాజాలో నిత్య జీవన భాగంగా మారిపోయింది. దీనిని ఐరాస సీనియర్ సహాయ విభాగ అధికారి కీత్ ఫ్లెచర్ "కృత్రిమంగా కలిగించబడిన క్షామం" అని వర్ణించడం గమనార్హం.ఇజ్రాయెల్ మొండివైఖరి, హమాస్ పాలనను నిలువరించాలనే సాకుతో వ్యవహరిస్తున్న విధానం ద్వారా ఆకలిని ఆయుధంగా వాడుతున్నది. ఇది జెనీవా ఒప్పందం ప్రకారం మానవతా నేరంగా పరిగణించబడుతుంది. ఐరాస దీనిపై సుదీర్ఘ చర్చలు జరుపుతున్నప్పటికీ, ఇప్పటికీ గాజాలో అధికారికంగా క్షామాన్ని ప్రకటించలేదు. కానీ ఆ దిశగా ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

గాజాలోని పసివాళ్లు పాలను పీల్చే వయస్సున్నవారు పాలసీసాల్లో శుద్ధి చేయని నీరు తాగుతున్న దృశ్యాలు ప్రపంచ మీడియాలో వైరల్ అయ్యాయి. కనీస పోషకాహారం దొరక్క భూమిమీదే విరిగి పడుతున్న బాలబాలికల తాలూకు చిత్రాలు మానవతను ప్రశ్నిస్తున్నాయి. ఐదుగురు పిల్లల్లో ఒకరు తీవ్రమైన పోషక లోపంతో బాధపడుతున్నారని డబ్ల్యూహెచ్‌ఓ తాజా అధ్యయనంలో తేలింది. కేవలం ఆహారం ఇవ్వలేనన్న కారణంతో పసికందులు ప్రాణాలు కోల్పోవడం, 21వ శతాబ్దంలో అత్యంత సిగ్గుపడాల్సిన అంశం.అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌కు బలమైన మద్దతును కొనసాగిస్తుండడం, యుద్ధాన్ని అంతకంతకూ వేడెక్కించడంలో భాగంగా మారింది. గాజాలోని పరిస్థితిని చూసి స్పందించే బదులు, హమాస్ ఉనికి తాలూకు భయాన్ని ప్రస్తావిస్తూ మౌనంగా ఉంటున్నాయి. యూరోపియన్ యూనియన్ మాత్రం కొన్ని సహాయ చర్యలు చేపట్టే ప్రయత్నాలు చేసినా, అవి గాజా ప్రజలకు పూర్తిగా అందలేకపోతున్నాయి. అటు అరబ్ దేశాలు కూడా పదే పదే "శబ్ద ప్రకటనలు" చేస్తున్నప్పటికీ, వ్యవహార శైలిలో ప్రభావం చూపే స్థాయిలో ఏ ప్రయత్నాలు చేయడం లేదు.ఇజ్రాయెల్ ఆధునిక సాంకేతికతలో ప్రపంచంలోనే అగ్రగామి. అమెరికాతో బలమైన వ్యూహాత్మక సంబంధాలు కలిగి ఉంది. మధ్యప్రాచ్య ఇంధన రాజకీయాల్లో కీలకంగా ముద్ర వేసుకున్నది. కానీ ఈ వాస్తవాలన్నీ మానవతను బలిగా మార్చే పరిణామాలకు బీజం వేసాయి. గాజా ప్రజల ఆకలిని, భయాన్ని ప్రపంచ వ్యాపార రాజకీయాల్లో ఒక "కంపెన్సేటరీ అంశంగా" వినియోగిస్తున్న దుర్మార్గాన్ని మరిచిపోవడం మనిషితనాన్ని మంటల్లో వేసే ప్రక్రియ.ఈ పరిస్థితులకు బాధ్యత ఎవరిది? హమాస్‌దా? ఇజ్రాయెల్‌దా? ప్రపంచ దేశాలదా? సమిష్టిగా చూసినప్పుడు, మౌనంగా నినాదాలకే పరిమితమైన ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల సంస్థలు, అంతర్జాతీయ న్యాయవ్యవస్థలంతా కూడా ఈ సంక్షోభానికి ప్రత్యక్ష/పరోక్ష బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. గాజాలో నిత్యం గర్జిస్తున్న బాంబులు కాక, పశ్చిమ దేశాల మౌనం, తటస్థత అనే మాటల వెనుక దాగిన నిర్లక్ష్యమే ఎక్కువమంది చావుకు కారణం అవుతున్నది.ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించిన "రోజువారీ విరామం" నిర్ణయం, శాశ్వత ceasefire దిశగా అడుగు వేస్తుందా? అనే ప్రశ్నలే ఇప్పుడు కీలకం. విరామంగా ప్రకటించిన రోజుల్లో కూడా సహాయబృందాలపై దాడులు జరగడం, ఈ ప్రకటనల విశ్వసనీయతపై గుసగుసలు పెంచుతున్నాయి. కానీ ప్రపంచం మాత్రం "సంపూర్ణ విరామం" ఎప్పుడవుతుంది? ఆకలిచావులకు తెర పడే రోజు ఎప్పుడు రాబోతుంది? అనే ప్రశ్నలతో వేచి చూస్తోంది.గాజాలో నడుస్తున్నది యుద్ధం కాదు. అది మానవతపై నడుస్తున్న తాలూకు వ్యాపారం. ఆకలిని ఆయుధంగా మార్చే ఈ క్రూరత ఇప్పుడు అంతర్జాతీయ సమాజానికి పట్టిన నల్ల మచ్చ. దీనిని శాశ్వతంగా నివారించాలంటే, రాజకీయ లాభనష్టాల కన్నా మానవతకు పెద్దపీట వేయాలి. బాధిత ప్రజలకు తక్షణ సహాయం అందించాలి. "ఆత్మరక్షణ" పేరుతో నేరాలను సరిపెట్టే ధోరణిని అంతర్జాతీయ న్యాయవ్యవస్థ నిలదీయాలి. గాజా ఆకలిచావులు ఇప్పటికైనా ప్రపంచ మానవతను మేల్కొల్పాలి. లేదంటే మనం ఒక విలీనానికైనా, ఓ చారిత్రక తప్పిదానికైనా కారకులమవుతాం.

# మన జీవన విధానాలను మార్చేసిన 'వెబ్'



ఇంటర్నెట్ అంటే కేవలం సమాచారం ఇచ్చిపుచ్చుకునే ఒక సాధనం మాత్రమే కాదు, అది మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, వ్యక్తిగత జీవితాలను నిరంతరం ప్రభావితం చేస్తున్న ఒక శక్తివంతమైన వేదిక. ఇది మొదట సమాచారం పంచుకోవడానికి మాత్రమే ఉద్దేశించబడింది. కానీ ఇప్పుడు ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో చేసే ప్రతి పని, ప్రతి కదలిక సమాజంలో పెద్ద మార్పులకు కారణమవుతున్నాయి. కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ , ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి కొత్త టెక్నాలజీలు వెబ్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఇది కేవలం సమాచార మార్పిడికి మించిన ఒక అనుభవంగా మారుతోంది

**కనిపించని మలుపులు:**

ప్రపంచ వెబ్‌కు సర్ టిమ్ బెర్నర్స్-లీ పునాది వేశారు. ఇది నిజంగా అద్భుతమైన ఆవిష్కరణ. కానీ వెబ్ చరిత్రను పరిశీలిస్తే అది ఇప్పుడు ఉన్న రూపంలోనే ఉండాలనేది అనివార్యం కాదని అర్థమవుతుంది. హెచ్.టి.టి.పి, హెచ్.టి.ఎమ్.ఎల్ లాంటి టెక్నాలజీలు రాకముందు సమాచారం పంచుకోవడానికి అనేక ఇతర మార్గాలు ఉండేవి. ఉదాహరణకు, ప్రాజెక్ట్ జనాదు అనే ఒక పాత ప్రాజెక్ట్ గురించి చాలామందికి తెలీదు. దీని రూపకర్త టెడ్ నెల్సన్. ఆయన సమాచారాన్ని ద్వి-దిశాత్మకంగా లింక్ చేయగల ఒక వ్యవస్థను ఊహించారు. అంటే ఒక డాక్యుమెంట్ నుండి ఇంకో డాక్యుమెంట్‌కు లింక్ ఇస్తే తిరిగి ఆ రెండో డాక్యుమెంట్ నుండి మొదటి దానికి కూడా ఒక లింక్ ఆటోమేటిక్‌గా ఏర్పడుతుంది. ఈ పద్ధతిలో సమాచారం ఎవరు సృష్టించారు, ఎక్కడి నుండి వచ్చిందో స్పష్టంగా తెలిసేది. కానీ వెబ్ సామాన్య ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి, బెర్నర్స్-లీ సరళమైన ఒకే దిశలో లింక్ చేసే పద్ధతిని ఎంచుకున్నారు. ఇది తక్కువ ఖర్చుతో, సులభంగా ఉపయోగించుకోగలిగేలా చేసింది. అయితే, దీని వల్ల "లింక్ రాట్" వంటి సమస్యలు వచ్చాయి. అంటే వెబ్‌లోని పాత లింకులు పనిచేయకుండా పోవడం, సమాచారం ఎవరు రాశారో తెలియకపోవడం వంటివి జరిగాయి. ఒకవేళ ఆ ప్రాజెక్ట్ జనాదు లాంటి వ్యవస్థలు వచ్చి ఉంటే మన వెబ్ ప్రపంచం చాలా భిన్నంగా ఉండేది. సమాచారానికి మరింత నిలకడ, సృష్టికర్తలకు సరైన గుర్తింపు లభించేవి.




**డిజిటల్ సార్వభౌమత్వం - ప్రపంచ గ్రామం విడిపోతోంది:**

మొదట్లో వెబ్‌ను "సరిహద్దులు లేని ప్రపంచ గ్రామం"గా ఊహించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు స్వేచ్ఛగా కనెక్ట్ అవ్వగలరని నమ్మారు. కొంతవరకు అది నిజమే. కానీ ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. దేశాలు తమ డేటాపై తమ ప్రజల ఆన్‌లైన్ కార్యకలాపాలపై మరింత నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నాయి. "డిజిటల్ సార్వభౌమత్వం" అనే భావన పెరుగుతోంది. అంటే, దేశాలు తమ సరిహద్దుల్లోని ప్రజల డేటాను తమ దేశంలోనే నిల్వ చేయాలని, అక్కడే ప్రాసెస్ చేయాలని పట్టుబడుతున్నాయి. యూరోప్‌లోని జీడీపీఆర్ లాంటి కఠినమైన డేటా గోప్యతా చట్టాలు దీనికి ఉదాహరణ. ఈ ధోరణి వెనుక జాతీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, సమాచార ప్రవాహాలపై ప్రభుత్వాల నియంత్రణ వంటి కారణాలు ఉన్నాయి. ఇది పౌరుల డేటాను రక్షిస్తుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుందని కొందరు వాదిస్తున్నారు. అయితే, ఇది వెబ్‌ను విచ్ఛిన్నం చేసి, "స్ప్లింటర్‌నెట్"గా మారుస్తుందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంటే ప్రపంచ వెబ్ ఒకే నెట్‌వర్క్‌గా కాకుండా, దేశాల సరిహద్దులకు పరిమితమైన చిన్న చిన్న నెట్‌వర్క్‌లుగా విడిపోవచ్చు. ఇది సమాచార ప్రవాహాన్ని అడ్డుకుంటుంది, ఆవిష్కరణలను తగ్గిస్తుంది. వెబ్ విశ్వవ్యాప్త స్వభావాన్ని దెబ్బతీస్తుంది. రాబోయే కాలంలో, దేశాల ప్రయోజనాలకు, వెబ్ ప్రపంచవ్యాప్త స్వభావానికి మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనేది ఒక పెద్ద సవాలు.

**పర్యావరణానికి తెలియని మూల్యం:**

వెబ్ మన జీవితాలను సులభతరం చేస్తుంది. కానీ దీనికి పర్యావరణపరమైన మూల్యం ఉందని చాలామందికి తెలియదు. ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు అంటే, పెద్దపెద్ద డేటా సెంటర్లు, సముద్రం అడుగున వేసిన కేబుళ్లు, వైర్‌లెస్ టవర్లు, భారీ మొత్తంలో విద్యుత్‌ను వినియోగిస్తాయి. మన డిజిటల్ ప్రపంచానికి వెన్నెముక వంటి ఈ డేటా సెంటర్లు ఒక్కోటి చిన్నపాటి నగరాలంత విద్యుత్‌ను ఉపయోగిస్తాయి. ఇవి ప్రధానంగా జాతీయ విద్యుత్ గ్రిడ్‌లపై ఆధారపడతాయి. పునరుత్పాదక ఇంధన వనరులు తక్కువగా ఉన్న చోట్ల, ఇవి భారీగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు కారణమవుతాయి.

అంతేకాకుండా ఈ డేటా సెంటర్లు వేడెక్కకుండా చూసేందుకు భారీ మొత్తంలో నీరు అవసరం. ఇది నీటి కొరత ఉన్న ప్రాంతాలలో స్థానిక నీటి సరఫరాపై తీవ్ర ఒత్తిడిని పెడుతుంది. మనం క్లౌడ్ కంప్యూటింగ్, స్ట్రీమింగ్, కృత్రిమ లమేధ వంటి డేటా ఇంటెన్సివ్ సేవలను ఎక్కువగా ఉపయోగిస్తున్న కొద్దీ వెబ్ పర్యావరణ భారం పెరుగుతోంది. వెబ్ దీర్ఘకాలం మనుగడ సాగించాలంటే సుస్థిర వెబ్ డిజైన్, తక్కువ శక్తిని వినియోగించే అల్గారిథమ్‌లు, డిజిటల్ మౌలిక సదుపాయాల కోసం పునరుత్పాదక ఇంధనం వైపు మారడం అత్యవసరం. ఇది కేవలం సాంకేతిక సమస్య కాదు. మన పర్యావరణ భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశం.

**వెబ్ ముఖచిత్రాన్ని మారుస్తున్న కృత్రిమ మేధస్సు:**

కృత్రిమ మేధస్సు కేవలం వెబ్‌లోని ఒక సాధనం కాదు. అది వెబ్ నిర్మాణంలోనే అంతర్భాగంగా మారిపోయింది. మనం కంటెంట్‌ను ఎలా సృష్టిస్తాం, కనుగొంటాం, ఉపయోగిస్తాం అనే విధానాన్ని కృత్రిమ మేధస్సు పూర్తిగా మారుస్తోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత అల్గారిథమ్‌లు ఇప్పటికే మన సోషల్ మీడియా ఫీడ్‌లు, సెర్చ్ ఫలితాలను నియంత్రిస్తున్నాయి, మనకు నచ్చిన విధంగా సమాచారాన్ని అందిస్తున్నాయి. అయితే దీనివల్ల కొత్త సవాళ్లు కూడా పుట్టుకొస్తున్నాయి. దీనివలన "ఫిల్టర్ బబుల్స్" ను సృష్టించే అవకాశం ఉంది. అంటే ఒక వ్యక్తికి నచ్చిన సమాచారాన్ని మాత్రమే చూపిస్తూ, వారి ఆలోచనలను మరింత బలోపేతం చేస్తుంది. అలాగే తప్పుడు సమాచారాన్ని భారీ స్థాయిలో వ్యాప్తి చేసే ప్రమాదం ఉంది. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి కంటెంట్ నియంత్రణ, డిజిటల్ అక్షరాస్యత, వెబ్‌లో నిజమైన సమాచారం అంటే ఏమిటి అనే దానిపై కొత్త ఆలోచనలు అవసరం. దీని ప్రభావం మనం వెబ్‌లో "యూజర్"గా, "సృష్టికర్త"గా ఎలా ఉండాలి అనే దానిపైనే తిరిగి ఆలోచించేలా చేస్తోంది. వెబ్ 3 డీసెంట్రలైజేషన్: వెబ్ భవిష్యత్తుకు కొత్త అడుగులు ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న వెబ్‌ను వెబ్ 2 అంటారు. ఇది కొన్ని పెద్ద కంపెనీల నియంత్రణలో కేంద్రీకృతమై ఉంది. అయితే, ఇప్పుడు వెబ్ 3 అని పిలువబడే ఒక కొత్త తరహా వెబ్ గురించి చర్చ జరుగుతోంది. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారంగా పనిచేసే దీనిని వెబ్‌ను డీసెంట్రలైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంటే, సమాచారం, డేటా ఒకే చోట కాకుండా, అనేక కంప్యూటర్‌లలో వికేంద్రీకృతంగా నిల్వ చేయబడతాయి. దీనివల్ల వినియోగదారులకు తమ డేటాపై ఎక్కువ నియంత్రణ వస్తుంది.మధ్యవర్తులు లేకుండానే ఆర్థిక లావాదేవీలు చేయవచ్చు. (డీసెంట్రలైజ్డ్ ఫైనాన్స్ - డేఫి). ఎన్ఎఫ్‌టీలు, డీఏఓలు (వంటి కొత్త భావనలు వెబ్3 లో భాగం. ఎన్ఎఫ్‌టీలు డిజిటల్ ఆస్తులకు యాజమాన్యాన్ని ఇస్తాయి. డీఏఓలు అనేవి బ్లాక్‌చెయిన్ ద్వారా నడిచే సంస్థలు. ఇక్కడ నిర్ణయాలు సభ్యులందరి ఓటింగ్‌తో జరుగుతాయి. అయితే వెబ్ 3 లో కూడా సవాళ్లు ఉన్నాయి. టెక్నాలజీ ఇంకా అభివృద్ధి దశలో ఉంది. వినియోగించడం చాలామందికి కష్టం. భద్రతా సమస్యలు, నియంత్రణ లేకపోవడం వంటివి కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. అయినప్పటికీ, వెబ్‌ను మరింత ప్రజాస్వామ్యీకరించే సామర్థ్యం దీనికి ఉంది.

**రేపటి వెబ్‌ను మనం ఎలా తీర్చిదిద్దాలి?**

వెబ్ కేవలం ఒక టెక్నాలజీ కాదని, అది నిరంతరం పరిణామం చెందుతున్న ఒక లైవ్ వ్యవస్థ అని గుర్తుంచుకోవాలి. దాని చరిత్రలో వదిలేసిన మార్గాల నుండి, ప్రస్తుత డిజిటల్ సార్వభౌమత్వం, పర్యావరణ భారం, కృత్రిమ మేధ విస్తరణ, వెబ్ 3 ఆవిర్భావం వంటి సవాళ్ల వరకు, వెబ్ భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. మనం వినియోగదారులుగా, డెవలపర్‌లుగా, ప్రభుత్వాలుగా, పౌరులుగా తీసుకునే నిర్ణయాలు వెబ్ కనెక్టివిటీకి, జ్ఞానానికి, అవకాశాలకు ఒక శక్తిగా కొనసాగుతుందా లేదా అది విచ్ఛిన్నమై, తక్కువ బహిరంగ, తక్కువ సమానమైన డిజిటల్ భవిష్యత్తును మిగిల్చిపోతుందా అని నిర్ణయిస్తాయి. వెబ్ అందించిన అద్భుతమైన మార్పులను మనం గౌరవిస్తూ అదే సమయంలో మరింత బాధ్యతాయుతమైన, స్థిరమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ ప్రపంచాన్ని నిర్మించడానికి మనం ఎలాంటి అడుగులు వేయాలి అనే దానిపై ఆలోచిద్దాం.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# పోడు హక్కుల గోడు తీరేదెన్నడు?



వానాకాలం మొదలయితే చాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు మళ్ళీ అదే గాథ. వర్షాలతో కలిసి వారి భూముల మీద అధికారం చాటాలన్న అటవీశాఖ ఉత్సాహం కూడా మొదలవుతుంది. వందలేళ్లుగా అడవిని స్వంత మాతృభూమిలా భావించి జీవించిన గిరిజనులకు ఇప్పుడు స్వయంగా అడవిలో ప్రవేశించే హక్కు కూడా వివాదాస్పదమైంది. పోడు భూములపై హక్కులు చెల్లించాలి అనే నినాదాలు, సమరాలు, ప్రదర్శనలు ఎంతకాలంగా నడుస్తున్నా గిరిజనులకు శాశ్వత న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.భూమిపై వారి హక్కు చట్టబద్ధమైనదే. 2006లో అమలులోకి వచ్చిన లిఅటవీ హక్కుల చట్టంలి స్పష్టంగా పేర్కొంది. 2005 నాటికి కనీసం మూడు తరాలుగా (సుమారు 75 ఏళ్లు) పోడు సాగు చేస్తున్న గిరిజనులకు భూమిపై హక్కు పత్రాలు ఇవ్వాలని పేర్కొంది. కానీ ఆ చట్టానికి అన్వయమేనని తేల్చేందుకు కావాల్సిన రికార్డులు వారికి ఎక్కడ ఉన్నాయి? వంశపారంపర్యంగా సాగు చేస్తున్నప్పటికీ ఆధారాలు లేకపోవడమే శాపంగా మారింది. వాస్తవానికి వారి హక్కులను ప్రభుత్వమే గుర్తించాల్సి ఉంది. కానీ వారి మాట వినడమేమిటి... పక్కాగా నివసిస్తున్న గుడిసెలను కూడా అక్రమ నిర్మాణాలుగా పరిగణించి కూల్చేయడం వరకూ వెళ్లింది.ములుగు జిల్లా రొయ్యూరులో గిరిజనుల గుడిసెల తొలగింపు, భద్రాద్రిలో పోడు భూములపై దాడులు... ఇవన్నీ ఒక్కొక్క ఘటన కాదు. ఇది ఒక నిబద్ధతా, ఒక విధానమా అనే అనుమానాలు నెలకొంటున్నాయి. కేసులు పెడుతూ, భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటూ, మొక్కలు నాటి గ్రీన్ ఎకనామీ పేరుతో వాళ్ల జీవనాధారాన్ని తొలగించడం ఈ వ్యవస్థలో మానవత్వానికి మిగిలిన స్థాయి ఏమిటి? చట్టం ఏమంటుంది అనే ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు ఆ చట్టాన్ని అమలు చేయాలన్న ప్రభుత్వ సంకల్పం ఉందా అనే ప్రశ్న ముందుగా రావాలి. చాలామంది గిరిజనులు తమ పోడు భూములకు క్లెయిమ్ నెంబర్లు పొందారు. కానీ హక్కు పత్రాలివ్వలేదు. కొందరికి ఇచ్చిన పత్రాల్ని మరోసారి తిరిగి స్వాధీనం చేసుకున్నారు %-% టైగర్ రిజర్వులు, ప్రాజెక్టుల కోసం. ప్రభుత్వమే ఇచ్చిన హక్కునే ప్రభుత్వం తిరిగి తీసుకోవడమంటే అదే కక్షసాధింపు.ఎక్కడ భూమి ఉంటే అక్కడే సర్వే చేయాలి. కానీ ఉన్న భూమి ఒకచోట - కాగితాల్లో మాత్రం మరోచోట. ఇదే గందరగోళం పోడు రైతులను న్యాయం నుండి దూరంగా ఉంచుతోంది. సరైన రికార్డులు లేవని, పట్టాలు లేవని చెప్పి నష్టపరిహారాలు కూడా ఇవ్వకుండా కేసులు పెడుతున్నారు. ఇది సరైన పాలననా?ఇంకా కేసుల భయం, లాఠీబలంతో నానాటికీ పేదరైతుల హక్కులను తొలగించే స్థితిలో, బ్యాంకులు కూడా రుణాలివ్వడాన్ని నిరాకరిస్తున్నాయి. పోడు భూములపై పక్కా హక్కులు లేకపోవడంతో తాము సాగు చేస్తున్న భూమిలో తాము లేనే లేను అనే నిరాశ గిరిజనులను మిగిల్చింది. గిరిజనులకు భూమిపై వారసత్వ హక్కు ఉందని కేంద్ర చట్టం చెబుతున్నా, రాష్ట్ర పాలనలో అది అమలుకాకపోవడం ఆవేదనకరం.

ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులను నియమించాలి. న్యాయమైన దృష్టితో సర్వే జరగాలి. భూమిని నిర్ధారించిన తర్వాత క్లెయిమ్ నెంబర్లు ఇచ్చి చేతబట్టేలా చేయాలి. హక్కు పత్రాలపై ఆధారంగా బ్యాంకులు రుణాలు ఇవ్వాలి. ఇప్పటికే ఇచ్చిన హక్కులను కాలరాయకుండా చూడాలి. ముఖ్యంగా %-% ఏదో ఒక కొత్త ప్రాజెక్టు పేరుతో తామే ఇచ్చిన భూమిని తిరిగి తీసుకోవడం రద్దు చేయాలి. ఈ చర్యలన్నీ జరిగితేనే గిరిజనులకు భూమిపై హక్కులంటే శబ్దపూరిత హామీ కాక, స్థిరమైన భరోసా అవుతుంది.పోడు హక్కుల సమస్య చట్టపరమైనది మాత్రమే కాదు. అది ఒక సామాజిక న్యాయ అంశం. గిరిజనులు అడవిని తాము సంపదగా కాదు, అమ్మగా చూశారు. ఇప్పుడు ఆ అమ్మను వారి నుండి దూరం చేయాలన్నా, కనీసం అక్కున చేర్చాలన్నా %-% సరైన నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే.అంతవరకు... పోడు గోడు తీరదేమో.

### శవాల శిలాఫలకం"

పెద్దగాలిలో కాదు
పాత శవాల శ్వాసలో దాగుంది నిజం.
ధర్మస్థల గర్భగుహాలలో
ధర్మమే శవాల వలె శాశ్వత నిద్రలో
పడకున్నది!

తపస్సుతో తలవంచిన దేవాలయం
పాదాల కింద పాతిన మానవత్వం.
130 శవాలు కాదు
అవి 130 ప్రశ్నలు-
మన సమాజ పునాదులపై వెల్లాడుతున్న కత్తి

వారు దేవుణ్ణి నమ్మారు
దేవాలయాన్ని నమ్మారు
కానీ,చిత్తశుద్ధికి నిలయమై
ఉండాల్సిన ప్రాంగణం
చీకటి చరిత్రల ఖననం కావడం,
మన నిశ్చలతకి నిదర్శనం.

ఆమె వస్త్రాలు రక్తంతో తడిచిపోయాయి
ఆ చిన్నారి శబ్దం శూన్యంలో కలిసిపోయింది
కర్మకాండల మధ్య, ధర్మం శవపెట్టెలోనూ,
శిలామయ దేవుడి కళ్లముందే
మూసివేయబడ్డది.

ఈ కవనం ఎవరి చేతి రాత?
ఎవరి అధికారాన్ని ముట్టిన రక్తపు ముద్ర?
ఎన్ని యాతనల గాథలు నేలచాటు
దాగున్నాయి?
ఎంతకాలం మౌనంగా వుండాలి?

ఇది కేవలం ఒక ఆలయపు భూమి కాదు
ఇది న్యాయాన్ని గౌరవించని మన
చైతన్యానికి శ్మశానం.
శవాలను భూమిలో దాచిపెట్టగలరేమో
కానీ,నిజాన్ని ఎప్పటికీ దాచిపెట్టలేరు

-షహనాజ్

భక్తి

## శ్రావణ మాసంలో ఏమి తినాలి? ఏం తినకూడదో తెలుసా?




శ్రావణ మాసం హిందూ మతంలో చాలా ప్రాముఖ్యత కలిగిన మాసం. ఈ మాసంలో భక్తులు ఎక్కువగా శివుడిని, విష్ణువుని, లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. మహిళలు ప్రత్యేకంగా వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరి వ్రతం వంటి నోములు, వ్రతాలు ఆచరిస్తారు. ముఖ్యంగా వరలక్ష్మీ వ్రతం అఖండ సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆనందాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారు.శ్రావణ మాసంలో వచ్చే సోమవారాలు, శనివారాలు కూడా ప్రత్యేక పూజలకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. శ్రావణ మాసంలో ఉపవాసాలు పాటించడం, ఆచారాలు చేయడం వల్ల మనస్సు, శరీరం శుద్ధి అవుతాయని భక్తులు నమ్ముతారు. భక్తులు ఆధ్యాత్మికంగా ఉండేందుకు ఆహారపు నియమాలను పాటిస్తారు. అదే సమయంలో వర్షాకాలం కాబట్టి శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ముఖ్యం. కాబట్టి, శ్రావణ మాసంలో ఏమి తినాలో, ఏం తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం..

ఏం తినకూడదు?

శ్రావణ మాసంలో మాంసాహారం, ఉల్లిపాయ, వెల్లుల్లి, ఆకుకూరలు, పాలు, పెరుగు వంటివి తినకూడదని చెబుతారు. ముఖ్యంగా ఉపవాసం చేసే రోజుల్లో సాత్విక ఆహారం తీసుకోవాలి. కొన్ని చోట్ల బంగాళాదుంపలు, చిలగడదుంపలు కూడా తినకూడదని చెబుతారు. అలాగే, ఈ మాసంలో మద్యం సేవించడం, పొగ తాగడం వంటివి చేయకూడదని అంటారు. ఇలా చేయడం వల్ల అశుభ ఫలితాలు వచ్చే అవకాశం ఎకువగా ఉంటుందని చెబుతారు.

శ్రావణ మాసంలో ఈ ఆహార పదార్థాలను ఎందుకు తినకూడదు అనేదానికి కొన్ని శాస్త్రీయ కారణాలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో కొన్ని ఆహార పదార్థాలు సులభంగా కలుషితమయ్యే అవకాశం ఉంది. కాబట్టి, వాటిని తినడం వల్ల అజీర్ణం, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

హిందూ శాస్త్రాల ప్రకారం.. శ్రావణ మాసంలో ప్రతి ఒక్కరూ సూర్యోదయానికి ముందే నిద్ర లేచి, ప్రతిరోజూ పూజా గదిని శుభ్రం చేయాలి. ఏదైనా శివాలయాన్ని సందర్శించి శివునికి అభిషేకం చేయాలి. ఈ కాలంలో సాత్విక ఆహారమే తీసుకోవాలి. సాత్విక ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు తీసుకోవాలి. తేలికపాటి, పోషకమైన భోజనం తినాలి.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ శుక్రవారం 01 । ఆగస్టు ।

## దారుణం.. చేతిరాత సరిగా లేదని క్యాండిల్‌తో బాలుడి చేయి కాల్చిన టీచర్



**న్యూఢిల్లీ-నవభూమి:** చేతిరాత సరిగా లేదనే కారణంతో ఓ టీచర్ ఎనిమిదేళ్ల బాలుడిపట్ల క్రూరంగా ప్రవర్తించింది. క్యాండిల్ వెలిగించి దానిపై బాలుడి కుడి అరిచేయి పెట్టించింది. బాలుడు ఇంట్లో ఆ విషయం చెప్పడంతో.. అతడి పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబై లోని మలాద్ ఏరియా లో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఈస్ట్ మలాద్‌లోని జేపీ డెక్స్ బిల్డింగులో రాజశ్రీ రాథోడ్ అనే యువడి ట్యూషన్స్ చెబుతుంటుంది. అదే ఏరియాలకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు మహమ్మద్ హమ్జా ఖాన్ స్థానిక లక్షధామ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. రోజూ సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు రాజశ్రీరాథోడ్ ఇంటికి ట్యూషన్‌కు వెళ్తాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కూడా హమ్జా ఖాన్‌ను అతడి సోదరి ట్యూషన్‌కు పంపి వెళ్లింది. అయితే చేతిరాత సరిగా లేదని రాజశ్రీ ఆ బాలుడిపట్ల క్రూరంగా ప్రవర్తించింది. క్యాండిల్ వెలిగించి దానిపై బాలుడి కుడిచేయి పెట్టించింది. మంటలకు తాళలేక బాలుడు గుక్కతిప్పుకోకుండా ఏడవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో హమ్జా ఖాన్ బాగా ఏడుస్తున్నాడని, వెంటనే వచ్చి ఇంటికి తీసుకెళ్లాలని టీచర్ రాజశ్రీ రాథోడ్ బాలుడి తండ్రి ముస్తకీన్ ఖాన్‌కు ఫోన్ చేసింది. దాంతో ముస్తకీన్ వచ్చి బాలుడిని ఇంటికి తీసుకెళ్లాడు. అయితే ఇంటికి తీసుకెళ్లిన తర్వాత బాలుడు విషయం చెప్పడంతో అతడి పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## గుజరాత్‌ను వణికించిన భూకంపం..



**అహ్మదాబాద్-నవభూమి:** గుజరాత్‌లోని కచ్ జిల్లాలో గురువారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.3గా నమోదైనట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మాలాజికల్ రీసెర్చ్ ) ప్రకటించింది. భూకంపం ఉదయం 9.52 గంటలకు సంభవించిందని పేర్కొంది. కచ్ జిల్లాలోని బేలాకు నైరుతి దిశలో 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు ఐఎస్ఆర్ తెలిపింది. ఈ స్వల్ప భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా విపత్తుల నిర్వహణ అధికారి వెల్లడించారు. కచ్ జిల్లా భూకంపానికి వెరీ హై రిస్క్ జోన్ అని పేర్కొన్నారు. తక్కువ ప్రకంపనలతో ఇక్కడ తరుచుగా భూంకపాలు సంభవిస్తాయన్నారు. 2001లో సంభవించిన భూకంపం వల్ల కచ్‌లో 13,800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 1.67 లక్షల మంది గాయపడ్డారు.

## ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా హెూంగార్డ్స్ డీజీకి అదనపు బాధ్యతలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ పోలీస్ కమిషనర్ గా హెూం గార్డ్స్ డీజీ , ఏజీఎంయూటీ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఎస్బీకే సింగ్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సంజయ్ అరోరా పదవీకాలం జూలై 31 తో ముగిసింది. దాంతో ఆయన స్థానంలో కొత్త పోలీస్ కమిషనర్‌గా సింగ్‌ను నియమించారు. అవుట్ గోయింగ్ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా నుంచి ఎస్‌బీకే సింగ్ బాధ్యతలు స్వీకరించారు. సంజయ్ అరోరా తర్వాత ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా ఎవరిని నియమించాలనే విషయంలో తీవ్ర తర్జనభర్జనలు జరిగాయి. వేరే రాష్ట్ర క్యాడర్‌కు చెందిన వ్యక్తిని నియమించాలా లేదంటే ఢిల్లీ-యూటీ క్యాడర్‌కు చెందిన వ్యక్తిని నియమించాలా..? అనే విషయంలో తీవ్ర మంతనాలు జరిపారు. చివరకు 'అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం, యూనియన్ టెరిటరీస్ క్యాడర్‌కు చెందిన ఎస్బీకే సింగ్‌ను ఢిల్లీ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా నియమించారు.

## వర్షంలోనూ వృద్ధుడి యోగాసనాలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** సోషల్ మీడియా పుణ్యమా అని ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో మనకు తెలిసిపోతోంది. ఎన్నో వింతలు, వినోదాలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. అదే సమయంలో కొన్ని స్ఫూర్తినిచ్చే వీడియోలు కూడా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఓ వృద్ధుడు వర్షంలో కూడా రైల్వే ప్లాట్‌ఫామ్ పై యోగా సనాలు చేస్తున్న వీడియోని ఇండియన్ రైల్వేస్ రెడ్డిట్ లో పోస్టు చేయగా ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. ఓ వృద్ధుడు రద్దీగా ఉండే రైల్వే ప్లాట్‌ఫామ్‌పై యోగాసనాలు చేశాడు. అనేక భంగిమలను ప్రదర్శిస్తూ అక్కడున్న వారిని ఆకట్టుకున్నాడు. వర్షం కురుస్తున్నప్పటికీ ఓ బెంచ్‌పై యోగాసనాలు వేస్తూ కనిపించాడు. తలకిందలుగా యోగా చేస్తూ అందరి చూపును ఆకర్షించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. ప్రస్తుతం ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. వర్షంలోనూ యోగాను ఎంజాయ్ చేస్తున్న ఆ వృద్ధుడిని చూసిన నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఈ మేరకు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

## పుట్టినరోజు నాడే కత్తులతో పొడిచి యువకుడి దారుణ హత్య..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పుట్టిన రోజు కావడంతో ఓ యువకుడు బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నాడు. ఈ సందర్భంగా మరో యువకుడు బైక్‌పై వచ్చి వారి కారును గుద్దడంతో గొడవ జరిగింది. గొడవ పెద్దదిగా మారడంతో బైకర్, అతని స్నేహితులు బర్త్‌డే జరుపుకుంటున్న యువకుడిని కత్తులతో పొడిచి చంపారు. దేశ రాధాని ఢిల్లీ లోని ఘాజీపూర్ లోగల పేపర్ మార్కెట్ ఏరియా లో ఈ హత్య జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వికాస్ అనే యువకుడు ఓ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి ఇటీవలే పెళ్లి కూడా నిశ్చయమైంది. పైగా బుధవారం అతడి పుట్టినరోజు కూడా. దాంతో బుధవారం విధులు ముగియగానే స్నేహితులకు పార్టీ ఇచ్చాడు. పార్టీ అనంతరం తన క్లోజ్ ఫ్రెండ్ అయిన సుమిత్‌తో కలిసి మరోసారి లిక్కర్ షాపుకు వెళ్లారు. ఆ లిక్కర్ షాపులో మద్యం తీసుకుని షాపు ముందే రోడ్డు పక్కన కారులో మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో మద్యం కోసం వచ్చిన మరో యువకుడు వారి కారును గుద్దుకుంటూ వెళ్లాడు. కారుకు గీతలు పడటంతో వికాస్ అతడితో గొడవకు దిగాడు. ఆ గొడవ ఇద్దరూ బూతులు తిట్టుకునే వరకు వెళ్లింది. దాంతో అవతలి వ్యక్తి తన మిత్రులకు ఫోన్ చేశాడు. దాదాపు ఆరుగురు వ్యక్తులు వచ్చి.. వచ్చీరావడంతోనే వికాస్, సుమిత్‌లపై ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగక వికాస్‌ను కత్తులతో పొడిచారు. దాంతో వికాస్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన సుమిత్‌ను ఘాజీపూర్‌లోని లాల్ బహదూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వికాస్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేశారు.

## దేశ ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు.. ట్రంప్ సుంకాలపై స్పందించిన కేంద్రం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌పై 25 సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఓ ప్రకటన వెలువరించింది. “25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు అమెరికా చేసిన ప్రకటనపై పూర్తిగా అధ్యయనం చేసి.. జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం’ అని పేర్కొంది. ట్రంప్ టారిఫ్‌లపై భారత్ ఆచితూచి స్పందించింది. వాస్తవానికి అమెరికా అధ్యక్షుడు ఏప్రిల్ 2న లిబరేషన్ డే పేరుతో వాణిజ్య భాగస్వామ్య దేశాలపై సుంకాలను ప్రకటించిన వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. ఈ సమయంలో భారత్‌పై కూడా డొనాల్డ్ ట్రంప్ భారీగా ప్రతీకార సుంకాలు విధించారు.

‘అమెరికా అధ్యక్షుడి ద్వైపాక్షిక వాణిజ్యంపై చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం గమనించింది. దాని ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని అధ్యయనం చేస్తోంది.. గత కొన్ని నెలలుగా భారత్ - అమెరికా మధ్య ఆమోదయోగ్యమైన, పరస్పర ప్రయోజకరమైన వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. భారత్ దానికి కట్టుబడి ఉంది’ అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాదు, రైతులు, ఔత్సాహి పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టంగా పేర్కొంది. అదేసమయంలో ఇటీవల బ్రిటన్‌తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్నికూడా ప్రస్తావించింది. “ఇతర వాణిజ్య ఒప్పందాల సమయంలో జరిగినట్లుగానే, ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది” నొక్కిచెప్పింది.

భారత్%-%రష్యా మధ్య సంబంధాలు, ముఖ్యంగా రష్యా నుంచి చమురు, ఆయుధాల కొనుగోలుపై అమెరికా అసంతృప్తికి ఇది నిదర్శనం. భారత్‌పై 25 శాతం సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని తన సొంత సామాజిక మాధ్యమం ‘ట్రూత్ సోషల్’ ద్వారా ట్రంప్ వెల్లడించారు. “ప్రపంచంలోనే అత్యంత దారుణమైన వాణిజ్య విధానాలు అవలంభిస్తోన్న దేశాల్లో భారత్ ఒకటి. ఎక్కువగా ఆర్థికేతర నిర్బంధాలు, అడ్డంకులు భారత్ అమలు చేస్తోంది.. ఇది మంచిది కాదు!’ అంటూ విమర్శలు గుప్పించారు. రష్యాతో ఉన్న వ్యాపార సంబంధాలను దృష్టిలో ఉంచుకుని తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు. అయితే, టారిఫ్‌లపై ప్రకటనకు ముందు అమెరికా ప్రతినిధుల బృందం ఆగస్టు 25న న్యూఢిల్లీలో వాణిజ్య ఒప్పందంపై ఆరో విడత చర్చలకు రానున్నట్టు అధికారికంగా ప్రకటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యను ఒత్తిడికి ఒక వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు పరిగణిస్తున్నారు. ఇక, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా నుంచి భారత్ చమురు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. యుద్ధానికి ముందు 0.2% ఉండగా.. ఇప్పుడు సుమారు 35-40% వరకు పెరిగాయి. ఈ విషయంలో చైనా తర్వాత రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటోన్న రెండో అతిపెద్ద దేశగా భారత్ నిలిచింది. అమెరికా, పశ్చిమ దేశాలు రష్యాపై ఒత్తిడి తేవాలని యత్నిస్తున్న సమయంలో, భారత్ వ్యవహారం తప్పుడు సంకేతాలు పంపుతోందని ట్రంప్ మండిపడుతున్నారు.

## దెయ్యం పట్టిందని 12 ఏళ్లలో 300 సెలవులు పెట్టిన పోలీసు..



**న్యూఢిల్లీ-నవభూమి:** విధులకు సుదీర్ఘ కాలం గైర్హాజరైన ఒక హర్యానా పోలీసు కానిస్టేబుల్ తొలగింపును పంజాబ్, హర్యానా హైకోర్టు సమర్థించింది. ముఖ్యంగా అతడు తనకు దెయ్యం పట్టిందని.. అందుకే మంత్రగాడితో చికిత్స చేయించుకున్నానని సెలవుకు కారణం తెలిపాడు. ఈ వాదనను న్యాయస్థానం తప్పుబట్టింది. క్రమశిక్షణ లేని సభ్యులను.. క్రమశిక్షణ కలిగిన దళం కొనసాగించలేదని న్యాయమూర్తి జగ్మోహన్ బన్స్ స్పష్టం చేశారు. మిమ్మల్ని ఉద్యోగంలోంచి తొలగించడమే మంచిదని పేర్కొన్నారు. 2023 జనవరి 12 నుంచి విధుల్లోకి హాజరుకాని అర్షద్ హర్యానాకు చెందిన అర్షద్.. 2012 ఏప్రిల్ 6వ తేదీన పోలీసు దళంలో చేరాడు. అయితే 2023 జనవరి 12వ తేదీన సెలవు తీసుకున్న తర్వాత విధుల్లో తిరిగి చేరలేదు. తదనంతరం జరిగిన విచారణలో కూడా అతను పాల్గొనలేదు. దీంతో 2024 జూన్ 20న అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ తొలగింపును సవాలు చేస్తూ అర్షద్ హైకోర్టును ఆశ్రయించారు. తన న్యాయవాది వాదన ప్రకారం.. విధులకు గైర్హాజరు కావడాన్ని ‘అత్యంత తీవ్రమైన దుష్ప్రవర్తన’గా పరిగణించలేమని.. పంజాబ్ పోలీసు నిబంధనల ప్రకారం తొలగింపుకు ఇది కారణం కాదని పేర్కొన్నారు. అయితే న్యాయమూర్తి జగ్మోహన్ బన్స్ ఈ వాదనను తోసిపుచ్చారు. ఒక క్రమశిక్షణ కలిగిన సంస్థలో విధులకు నిరంతరం గైర్హాజరు కావడం ఆమోదయోగ్యం కాదని, అది విధులకు ఆటంకం కలిగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పోలీసు దళం ప్రజల భద్రతకు బాధ్యత వహిస్తుందని, అలాంటి కీలకమైన విభాగంలో క్రమశిక్షణా రాహిత్యం ఏ మాత్రం సహించరానిదని కోర్టు అభిప్రాయ పడింది. అంతేకాకుండా అర్షద్ తన 12 ఏళ్ల సర్వీసులో 42 సందర్భాల్లో దాదాపు 300 రోజులు విధులకు గైర్హాజరు అయినట్లు గుర్తించామని పేర్కొంది. అయితే అతడు సెలవుకు కారణంగా.. తనకు దెయ్యం పట్టిందని, అందుకు ఓ మంత్రగాడి వద్ద చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారని స్పష్టం చేసింది. ప్రతి 97 నిమిషాలకు ఒకసారి భూమిని చుట్టేసి..

గతంలోనూ అనేకసార్లు క్రమశిక్షణా ఉల్లంఘనలు.. ఈ వాదనను తాము ఏమాత్రం అంగీకరించడం లేదని వివరించింది. అర్షద్ గతంలో కూడా అనేకసార్లు క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడి, పలుమార్లు శిక్షలు అనుభవించినట్లు కోర్టు తన పరిశీలనలో పేర్కొంది. అతను అలవాటుగా నేరాలకు పాల్పడేవాడని.. అతని తీరు క్రమశిక్షణకు విరుద్ధమని స్పష్టం చేసింది. అందుకు అతడిని విధుల్లోంచి తొలగించడమే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ తీర్పుతో రాష్ట్ర ప్రజలంతా ఆశ్చర్యపోతున్నారు. మంచి నిర్ణయం తీసుకుని.. పోలీసులపై ప్రజలకు నమ్మకం కల్గేలా చేశారని కామెంట్లు చేస్తున్నారు.

## ఆగస్టు 7 నుంచి ఆయుష్మాన్ భారత్ పథకం వైద్య సేవలు నిలిపివేత




**న్యూఢిల్లీ-నవభూమి:** మన దేశంలో వైద్యం ఎంత ఖరీదైన వ్యవహారమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మెరుగైన, నాణ్యమైన వైద్యం అందాలంటే.. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. ఒక్కసారి ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లామంటే జేబుకు చిల్లు తప్పదు. కొన్ని సందర్భాల్లో అప్పులపాలవుతాం కూడా. ఈ సమస్య పరిష్కారం కోసం తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. దీని ద్వారా పేదలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం దేశం అంతా వర్తించేలా ఇలాంటి పథకాన్నే తీసుకు వచ్చింది. అదే ఆయుష్మాన్ భారత్ పథకం. దీని ద్వారా పేద వారికి ప్రైవేటు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు అవకాశం కల్పించింది. అయితే ఆగస్టు 7 నుంచి ఆయుష్మాన్ భారత్ కింద వైద్య సేవలు అందిచబోమని ప్రైవేటు ఆస్పత్రులు స్పష్టం చేస్తున్నాయి. ఆ వివరాలు..ఆగస్టు 7 నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రైవేటు ఆస్పత్రులు ప్రకటించాయి. అయితే ఈ నిర్ణయం తీసుకుంది హరియాణాలో. వచ్చే నెల అనగా ఆగస్టు 7నుంచి హర్యాయాణాలోని సుమారు 650 ప్రైవేటు ఆస్పత్రులు.. ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు నిలిపివేయబోతున్నట్లు ప్రకటించాయి. కారణం... ఆయా ఆస్పత్రులకు ఈ పథకం కింద దాదాపు రూ.500 కోట్ల బకాయిలు చెల్లించలేదని.. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. హరియాణా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)యూనిట్ దీనిపై ప్రకటన చేసింది. దీంతో వారం రోజుల తర్వాత అనగా ఆగస్టు 7 నుంచి హరియాణాలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి ఆయుష్మామాన్ భారత్ పథకం కింద ఆస్పత్రులకు చెల్లించాల్సిన మొత్తంలో కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే రీయింబర్స్‌మెంట్లు చెల్లించినట్లు ఐఎంఏ తెలిపింది. దీని వల్ల హరియాణాలోని ఆస్పత్రులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ పథకం కింద రావాల్సిన నిధులు సకాలంలో అందకపోవడంతో చాలా ఆస్పత్రులు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాట్లు వెల్లడించింది. ఇప్పటికే కొన్ని ఆసుపత్రులు రోగులను వెనక్కి పంపడం చేస్తున్నాయి. లేదంటే సొంత డబ్బులు పెట్టుకుని వైద్యం చేయించుకోమని సూచిస్తున్నాయి. అయితే ఐఎంఏ ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడం ఇదే తొలిసారి కాదు. గతేడాది జనవరిలో కూడా ఐఎంఏ ఇలాంటి హెచ్చరికనే జారీ చేసింది. అయితే ప్రభుత్వం హామీ ఇవ్వడంతో దానిని ఉపసంహరించుకుంది. ఈసారి మాత్రం తాము ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. రీయింబర్స్‌మెంట్‌ను ఆలస్యంగా చెల్లించడమే కాక ఎటువంటి వివరణ లేకుండానే ఈ మొత్తంలో కోతలు విధిస్తున్నాయని ఆస్పత్రులు ఆరోపిస్తున్నాయి. కొత్త పోర్టల్‌లో తిరిగి నమోదు చేసుకోవాలనే సాకు చూపి.. అనేక ఆస్పత్రుల ఎన్ఏబీహెచ్ ప్రోత్సాహకాలు కూడా తగ్గించారని ఆరోపింస్తున్నారు. హరియానాణాలో సుమారు 1300 ఆస్పత్రులు ఆయుష్మాన్ భారత్ పథకం కింద నమోదు అయ్యాయి. వాటిలో 650 ప్రైవేట్ ఆసుపత్రులే. ఇప్పుడు ఇవన్ని వైద్య సేవలు నిలిపివేస్తే పేద, మధ్యతరగతి రోగులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## నా భర్తను వెంటనే భారత్‌కు పంపేయండి.. భార్య వినతి




**న్యూఢిల్లీ-నవభూమి:** వరైనా భర్త అమెరికాలో ఉంటే భార్య కూడా అక్కడకు వెళ్లి సెటిల్ అవ్వాలని అనుకుంటుంది. కానీ.. ఇక్కడొక భార్య భర్తను వెంటనే ఇండ ియాకి పంపించాలని రోదిస్తోంది. సమన్‌ప్రీత్ కౌర్ అనే భారతీయ మహిళా తన భర్తను అమెరికా నుంచి వెనక్కి పంపించేయాలని అమెరి కా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను వేడుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ఆమె తన పెళ్లి ఫోటోలను కూడా షేర్ చేస్తూ, తనకు, తన ఏడేళ్ల కుమార్తెకు న్యాయం కావాలని డిమాండ్ చేసింది.

సమన్‌ప్రీత్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆమె భర్త 2022లో అమెరికాకు వెళ్లాడు. అక్కడ అతడి ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకపోయినా, “శరణార్థి” (%శాంఎశ్రీవవ%) అని అబద్ధం చెప్పి అక్రమంగా అమెరికాలో ప్రవేశించాడని ఆమె ఆరోపిస్తోంది. మొదట్లో భర్త అమెరికాకు అక్రమంగా వెళ్లాడని తెలిసినా, తనను, తమ కూతురిని కూడా త్వరలోనే తీసుకువస్తాడని నమ్మబలచడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయలేదట. కానీ, ఇప్పుడు అతడక కాలిఫోర్నియాలో ఉంటున్నాడని,, అక్కడ ఎవరినైనా పెళ్లి చేసుకున్నాడా? లేక సహజీవనం చేస్తున్నాడా? అనే విషయం తెలియదని చెప్పింది. కానీ తాను మాత్రం ఇప్పటికీ అతడికి చట్టబద్ధంగా భార్యనేనని సమన్‌ప్రీత్ అంటోంది. అయితే ఇన్నేళ్లు లేనిది. ఇప్పుడే ఎందుకు?

తన భర్త కేవలం సంపాదన, అమెరికా పౌరసత్వం పొందడం కోసమే తమను వదిలేసి అక్రమంగా అమెరికాకు వెళ్ళాడని సమన్‌ప్రీత్ స్పష్టం చేసింది. అంతేకాదు, ఇప్పుడు అతడు మరో పెళ్లి చేసుకోవాలని చూస్తున్నాడని ఆమెకు తెలిసిందట. అందుకే ఈ నిర్ణయం తీసుకుంది. అతని కుటుంబం కూడా తనను బెదిరించిందని, తమ కోరికను అడ్డుకోవద్దని హెచ్చరించారని సమన్‌ప్రీత్ వెల్లడించింది. తన భర్త అక్రమంగా శరణార్థిగా ఆశ్రయం పొందాడని తన దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయని ఆమె పేర్కొంది. సిక్కు కుటుంబానికి చెందిన తాను ఒకే వివాహాన్ని నమ్ముతానని, అందుకే తమకు న్యాయం జరగాలని కోరుతోంది. తన భర్త అమెరికా సరిహద్దుకు అక్రమంగా చేరుకున్నట్లు చూపే ఒక వీడియోను కూడా ఆమె షేర్ చేసింది. కేవలం సోషల్ మీడియా పోస్ట్‌కే కాకుండా, సమన్‌ప్రీత్ తన భర్తను అక్రమంగా నివసిస్తున్నాడని ఇమ్మిగ్రేషన్ అధికారులకు నివేదించే అవకాశం ఉంది. అమెరికా చట్టాల ప్రకారం, ఆశ్రయం కోసం అబద్ధపు దావాలు చేయడం తీవ్రమైన నేరం. ఒకవేళ అతడు శరణార్థి దావా అబద్ధమని రుజువైతే, అమెరికా నుంచి వెనక్కి పంపించే అవకాశం ఉంటుంది. అలాగే, భారత్ చట్టాల ప్రకారం, మొదటి భార్య ఉండగా మరొకరిని వివాహం చేసుకోవడం నేరం. ఇది “బిగమి” (రెండు పెళ్లిళ్లు) కిందకు వస్తుంది, ఇది భారత్‌తో పాటు అమెరికాలో కూడా నేరమే. ఈ విషయాలన్నింటినీ సమన్‌ప్రీత్ తన పోస్ట్‌లో ప్రస్తావించింది. డబ్బు సంపాదించాలనే ఆశతో, మంచి జీవితం కోసమని చాలా మంది యువత అక్రమ మార్గాల్లో విదేశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మానవ అక్రమ రవాణా ముఠాల వలలో పడి, అబద్ధపు ఆశ్రయం దరఖాస్తులతో దేశాల్లోకి ప్రవేశిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో, భారత్‌లో వారికి చట్టబద్ధమైన కుటుంబాలు ఉన్నా, వాటిని వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇది కేవలం కుటుంబాలను విచ్ఛిన్నం చేయడమే కాకుండా, సదరు వ్యక్తులను విదేశీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడేలా చేస్తోంది. అక్రమంగా ప్రవేశించినప్పుడు పట్టుబడటం, డిపోర్టేషన్ వంటి పరిణామాలు కూడా ఉంటాయి.

## భారత్‌లో మరిన్ని టెక్ లేఆఫ్‌లు..

### ఏఐ, సిబ్బంది క్రమబద్ధీకరణ ముప్పుపై నాస్కామ్ సంకేతం




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ఐటీ సెక్టార్‌లో సిబ్బంది క్రమబద్ధీకరణ వల్ల మరిన్ని ఉద్యోగాల కోతలు ఉండొచ్చని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్(నాస్కామ్) సంకేతమిచ్చింది. ఏఐ, ఆటోమేషన్ ఆధారిత ఆపరేషన్ల వైపు కంపెనీలు మళ్లడమే ఇందుకు కారణమని చెప్పింది. టీసీఎస్ తన సిబ్బందిలో 12 వేల మందిని తొలగించనున్నట్టు ఇటీవల ప్రకటించిన తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. స్వల్ప కాలిక కోతలు(మార్పులు) కొనసాగుతున్నప్పటికీ ఇది దీర్ఘకాలిక అవకాశాలను సృష్టించవచ్చని నాస్కామ్ ఆశాజనకంగా ఉంది.

టీసీఎస్‌కు కార్మిక శాఖ సమన్లు

కేంద్ర కార్మిక శాఖ గత శుక్రవారం టాటా కన్సల్టెన్సీ సర్వీస్(టీసీఎస్)కు సమన్లు జారీ చేసింది. 2 శాతం మంది ఉద్యోగుల తొలగింపు ప్రకటన, 600 ఖాళీల భర్తీలో ఆలస్యంపై నసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనెట్(నైట్స్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకుంది. ఈ రెండు అంశాలపై సమగ్ర నివేదికను ఇవ్వాలని టీసీఎస్‌ను ఆదేశించింది. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఉద్యోగాల కోత గురించి టీసీఎస్ తన ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపిందని నైట్స్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా తెలిపారు. ఇది చట్ట విరుద్ధం, అనైతికం, అమానుషమని విమర్శించారు. అయితే ఉద్యోగాల కోతలపై దయతో వ్యవహరిస్తామని టీసీఎస్ సీఈవో కృతివాసన్ తెలిపారు. కొందరిని ఇతర విభాగాల్లో నియమించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కంపెనీ మార్గదర్శకాల ప్రకారం ప్రభావిత ఉద్యోగులు పలు ప్రయోజనాలు పొందుతారన్నారు.

## రెస్టారెంట్ మెనూలో సాల్ట్ వార్నింగ్!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉప్పు వాడకంపై అవగాహన ద్వారా గుండె, మూత్రపిండాల వ్యాధులపై పోరాటంలో సత్ఫలితాలు సాధించవచ్చు. అందుకే రెస్టారెంట్ల మెనూలలో సాల్ట్ వార్నింగ్ లేబుల్స్‌ను జత చేయాలి. దీనివల్ల ప్రజలు అధిక ఉప్పు ఉండే ఆహారాన్ని తినడం వల్ల జరగబోయే హానిని అర్థం చేసుకుని, తమ ఆరోగ్యానికి క్షేమకరమైన దానిని ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. బ్రిటన్‌లోని లివర్‌పూల్ విశ్వవిద్యాలయ పరిశోధక బృందం నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. సాల్ట్ వార్నింగ్ గురించి తెలుసుకున్నవారు, దాని గురించి తెలియనివారు ఆర్డర్ ఇచ్చే తీరును ఈ అధ్యయనంలో పరిశీలించారు. సాల్ట్ వార్నింగ్ లేబుల్‌ను చూసినవారు అధిక ఉప్పు ఉండే పదార్థాలను ఆర్డర్ చేయడంలో వెనుకంజ వేసినట్లు తెలిసింది. ఈ లేబుల్స్ వల్ల ఆర్డర్ ఇచ్చే సమయంలో సాల్ట్ కంటెంట్ గురించి ప్రజలకు గొప్ప అవగాహన కలుగుతున్నట్లు, ఆర్డర్ చేసే ఉప్పు మోతాదు తగ్గినట్లు వెల్లడైంది.

## 4 నుంచి భారత్‌లో ఫిలిప్పైన్స్ అధ్యక్షుడి పర్యటన



**ఫిలిప్పైన్స్-నవభూమి:** ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్ ఆగస్టు 4 నుంచి భారత్‌లో పర్యటించనున్నారు. ఆగస్టు 4 నుంచి 8 వరకు పర్యటన కొనసాగనుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత్‌కు వస్తున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు మార్కోస్‌తోపాటు ఆయన సతీమణి మడామే లూయిస్ ఆరనేటా మార్కోస్ కూడా భారత్‌కు రానున్నారు. వారితోపాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, ఉన్నతాధికారులు, వ్యాపార ప్రతినిధులతో కూడిన ఉన్నతస్థాయి బృందం కూడా వారితోపాటు భారత్‌కు రానుంది. ఆగస్టు 8న బెంగళూరులో పర్యటించి ఫిలిప్పైన్స్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.

కాగా మార్కోస్ ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు అయిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా మార్కోస్ ఆగస్టు 5న ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యి పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో కూడా మార్కోస్ భేటీ కానున్నారు. కాగా భారత్, ఫిలిప్పైన్స్ మధ్య 1949 నవంబర్ నుంచి దౌత్య సంబంధాలు మొదలయ్యాయి.

అప్పటి నుంచి రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సముద్ర సహకార, వ్యవసాయ, ఆరోగ్య, ఫార్మా, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పరస్పర సంబంధాలు బలపడుతూ వస్తున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
శుక్రవారం
01 । ఆగస్టు । 2025





## సబ్జా గింజలతో అందం ఆరోగ్యం

: సబ్జా గింజలతో అందం ఆరోగ్యం
సబ్జా గింజలు శరీరంలో వేడిని తగ్గిస్తాయని తెలిసిందే. అయితే వాటి వలన మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, అందానికి వన్నెలద్దడంతోనూ అవి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు
సబ్జా గింజలోని యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చర్మ ఇన్ఫెక్షన్లను దరి చేరనీయవు.
డీటాక్స్ గుణాలు చర్మంలోని టాక్సిన్లకు బయటకు పంపుతాయి. దాంతో చర్మం మెరుస్తుంది.
ఈ గింజల్లో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి.
సబ్జా గింజల్లోని ప్రోటీన్లు, బీటా కెరోటిన్, విటమిన్ కె- కురులకు పోషణ అందించి దృఢంగా మార్చుతాయి.
ఆరోగ్యం కూడా
సబ్జా గింజల్లోని అధిక పీచు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.
సబ్జా గింజలు ఎడిడిటిని దరిచేరనీయవు. శరీరంలోని వేడిని తగ్గిస్తాయి.
రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి.



# వందేళ్లలో ఒక్కరే!



అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)... దేశంలోని అతి పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటి.
వందేళ్లు దాటిన ఈ వర్సిటీ చరిత్రలో తొలిసారి ఒక మహిళ వైస్‌చాన్సలర్ అయ్యారు.
ఏఎంయూలో విభిన్న హోదాల్లో సేవలందించిన ఆమె...
నేడు అదే విద్యాలయం అత్యున్నత పదవిని అలంకరించారు.ప్రొఫెసర్ నయీమా ఖాతూన్ విజయవంతమైన ప్రయాణం ఇది...
వైస్ ఛాన్సలర్ నియమితులు కావడానికి ముందు నయీమా ఖాతూన్... అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. పొలిటికల్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందిన ఆమె... ఢిల్లీలోని 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్', ఏఎంయూల్లో పని చేశారు. ఏడాదిపాటు రువాండాలోని 'నేషనల్ యూనివర్సిటీ'లో బోధించారు. అమెరికాలోని 'లూయిస్ విల్లే యూనివర్సిటీ', రొమానియా 'అల్బా లూలియా', బ్యాంగ్‌కాక్ 'చులాలాంగ్‌కోర్న్ యూనివర్సిటీ' తదితర విద్యాలయాలను సందర్శించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగించారు. ప్రముఖ జర్నల్స్‌లో ఆమె పరిశోధనా పత్రాలు ఎన్నో ప్రచురితమయ్యాయి. ఒడిశాలో పుట్టి పెరిగిన నయీమా... విద్యార్థి దశ నుంచీ చదువులో ముందుండేవారు. పట్టుదలగా ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. పీహెచ్‌డీ తరువాత ఏఎంయూలోని అదే విభాగం(1988)లో లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించారు. పదేళ్లకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2014లో మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యే సమయానికి ఆమె సైకాలజీ విభాగానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దాంతోపాటు వర్సిటీ 'సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్లానింగ్'కు డైరెక్టర్‌గా సేవలు అందించారు.

ఆచార్యులుగానే కాకుండా రచయితగా, పరిశోధకురాలిగా నయీమా ఖాతూన్ సుపరిచితురాలు. ఆమె రచనలు పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆరు పుస్తకాలు రాశారు. క్లినికల్, హెల్త్, అప్లైడ్ సోషల్, స్పిరుట్యువల్ సైకాలజీల్లో స్పెషలైజేషన్ చేశారు. నైమా నిరుపమాన సేవలకు గానూ 'పాపా మియా పద్మభూషణ్ బెస్ట్ గర్ల్ అవార్డ్'ను అందుకున్నారు.
1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు. 1920లో బేగమ్ సుల్తాన్ జహాన్ ఏఎంయూ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఆమె తరువాత ఏ మహిళా ఆ హోదాను అలంకరించలేదు.
ఇదిలావుంటే... నయీమా ఖాతూన్ భర్త ప్రొఫెసర్ మొహమ్మద్ గుల్రెజ్ మొన్నటివరకు వర్సిటీ తాత్కాలిక వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. యూపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గత వీసీ తారిక్ మన్సూర్ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు భర్తీ కోసం రూపొందించిన ఐదుగురి జాబితాలో నయీమా ఖాతూన్ కూడా ఉన్నారు. మొత్తం 36 మంది దరఖాస్తు చేసుకోగా... అందులో వడపోసి ఐదుగురిని ఎంపిక చేసింది వర్సిటీ పాలక మండలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అధికారిక ముద్ర రాగానే కేంద్ర విద్యా శాఖ నయీమా ఖాతూన్‌ను వీసీగా ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి కోసం ఈసీకి లేఖ రాసింది. ఇందులో రాజకీయ ప్రయోజనాలు లేవని భావించిన ఈసీ... వర్సిటీ వీసీ నియామకానికి ఆమోద ముద్ర వేసింది. అలా శతాబ్దానికి పైగా చరిత్ర గలిగిన విశ్వవిద్యాలయానికి నయీమా మొట్టమొదటి మహిళా వైస్‌చాన్స్‌లర్ అయ్యారు. నవ అధ్యాయానికి నాంది పలికారు.
1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు.

### ఇవి పాటించండి

రోజూ వంట చేసేటప్పుడు కొన్ని పొరబాట్ల వల్ల సమయం, గ్యాస్ వృథా అవుతూ ఉంటాయి. అలాకాకుండా వంటచేసేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...%ఱఙఎవ జుటటఱఎఱవత్ జశీశీఐఱఅస్త్ర%: ఇవి పాటించండిరోజూ వంట చేసేటప్పుడు కొన్ని పొరబాట్ల వల్ల సమయం, గ్యాస్ వృథా అవుతూ ఉంటాయి. అలాకాకుండా వంటచేసేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...కూరగాయలు, ఆకుకూరలు ఉడికించేటప్పుడు పాత్రల మీద మూతలు పెట్టాలి. చిన్న లేదా మధ్య స్థాయి మంట ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వాటిలోని పోషకాలు నశించిపోకుండా ఉంటాయి. చాలా వరకు గ్యాస్ ఆదా అవుతుంది.తాలింపు కోసం కరివేపాకు, ఉల్లిపాయలు, వెల్లుల్లి రెబ్బలు తదితరాలతోపాటు అవసరమైన వాటిని సిద్ధం చేసుకున్న తరవాతనే స్టవ్‌ను వెలిగించడం మంచిది. అలాగే కూరగాయలను కూడా ముందుగానే తరిగి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల గ్యాస్ వృథా కాకుండా ఉంటుంది.వండిన ఆహారాన్ని పదేపదే వేడిచేయకూడదు.



## నీళ్లు తాగితే మంచిదని ఎడాపెడా తాగేస్తున్నారా..



పిల్లలు మాట విననప్పుడు, తప్పు చేసినప్పుడు పెద్దలు గట్టిగా అరుస్తూ ఉంటారు. ఇది పిల్లల అభివృద్ధిలో దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం చూపుతుందట. అయ్యిందానికీ, కానిదానికీ బిగ్గరగా అరవడం వల్ల పిల్లల్లో ఒత్తిడి స్థాయిలు అమాంతం పెరిగిపోతాయట. వారిలో ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. పెద్దలు నిరంతరం అరుస్తూ ఉండటం వల్ల పిల్లలు తమ భావాలను ఎలా వ్యక్తీకరించాలో తెలియక తల్లడిల్లుతారు.
దీంతో ఒక్కసారిగా తమ భావోద్వేగాలను వారు బయటపెట్టేస్తారు. అంతేకాదు పిల్లల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా లోపిస్తాయి. దురుసు స్వభావం పెరుగుతుంది. మెదడు అభివృద్ధిపైనా దుష్ప్రభావం పడుతుంది. కుటుంబసభ్యులు తమమీద అరవడం కారణంగా పిల్లలు పెద్దలపట్ల తిరస్కార భావం అలవర్చుకుంటారు. అలా సంబంధాలు దెబ్బతింటాయి. కాబట్టి, పిల్లలతో సౌమ్యంగా, ప్రశాంతంగా మెలగాలి అంటున్నారు నిపుణులు.


**ఆనంద సూత్రాలు**

మనల్ని ఏది ఆనందంగా ఉంచుతుందనే దానిపై ఎన్నో అపోహలు ఉంటాయి. అయితే ఆనందం అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. అది ఒక స్థితి. కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా ఎప్పుడూ ఆనందంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జాగరూకత, ఇతరులతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవడం, ప్రతిరోజు చిన్నచిన్న లక్ష్యాలను సాధించడం, ఎదుటివారి పట్ల దయతో మెలగడం, క్రమం తప్పకుండా చేసే వ్యాయామం మనల్ని ఎప్పటికప్పుడు ఆనందంగా ఉంచుతాయని మానసిక నిపుణులు సలహా ఇస్తున్నారు.

**ఎన్ని నీళ్లు తాగాలి?**

మన శరీరం సరిగ్గా పనిచేయాలంటే తగినన్ని నీళ్లు తాగాలనే విషయం తెలిసిందే. అయితే నీళ్లు మోతాదుకు మించి తాగితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయంటున్నారు వైద్యులు. నీళ్లు మితిమీరి తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ ఇంబాలెన్స్ ఏర్పడుతుంది. ఇది గుండె సమస్యలకు కారణమవుతుంది. రెండున్నర లీటర్ల నుంచి నాలుగు లీటర్ల వరకు ఫర్వాలేదు కానీ, అంతకుమించొద్దని సూచిస్తున్నారు.
వేడి వాతావరణంలో శరీర శ్రమ చేసేవాళ్లు మూడు నుంచి మూడున్నర లీటర్ల నీళ్లు తాగొచ్చట. అదే గుండె వైఫల్యం, కిడ్నీ వ్యాధులు ఉన్నవాళ్లు మాత్రం ఒకటిన్నర లీటర్ల వరకు పరిమితం చేసుకోవాలట. ఇంకోమాట శరీర బరువు నీళ్లు తాగే నిష్పత్తిని 0.03 రెట్లు ఉండేలా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అంటే 70 కిలోల బరువుండే వ్యక్తి 2.1 లీటర్ల నీళ్లు తీసుకోవాలన్నమాట! ఈ లెక్కలు అలా ఉంచితే అన్నిటికీ మించి దాహం వేయడమే నీళ్లు తాగడానికి సంకేతంగా భావించాలి. అంతేతప్ప అదేపనిగా నీళ్లు మాత్రం తాగేయవద్దు.

# బహుళ బాధ్యతల్లో మహిళలదేపై చేయి




వెనువెంటనే ఒకటి రెండు రకాల బాధ్యతల్ని నిర్వహించాల్సి వస్తే పురుషులు విపరీతంగా అలసిపోతుంటారు. అదే స్త్రీలు నాలుగైదు రకాల పనుల్ని వెంటవెంటనే చేపట్టినా, అలసటకు గానీ, ఆయాసానికి గానీ గురికారు. ఈ రహస్యమేమిటో కనుగొనడానికి రష్యాలోని నేషనల్ రీసెర్చ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు రెండేళ్ల క్రితం సిద్ధమయ్యారు. ఒకేసారి ఎక్కువ పనుల మీద మనసు లగ్నం చేయాల్సి వచ్చినప్పుడు సహజంగానే మెదడులోని కొన్ని అదనపు విభాగాలకు పని చెప్పాల్సి ఉంటుంది. అందుకు చాలా ఎక్కువ శక్తే ఖర్చవుతుంది. అయితే స్త్రీలతో పోలిస్తే పురుషుల్లోని శక్తి ఎన్నో రెట్లు అదనంగా ఖర్చవుతుందని పురుషులు తీవ్రంగా అసహనానికీ, అలసటకూ గురికావడానికి ఇదే కారణమని పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఎక్కువ విషయాల్లో మనసును లగ్నం చేయాల్సి వచ్చినప్పుడు పురుషుల్లోని డార్సోలేటరల్ ప్రీఫ్రంటల్ విభాగాల్లోని కొన్ని వ్యవస్థలు విపరీతంగా పనిచేయడం మొదలవుతుంది. అయితే స్త్రీలలో ఈ పరిస్థితి కనిపించదు. 20, 45 ఏళ్ల స్త్రీ, పురుషుల్లో ఈ వ్యత్యాసాలు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. లింగభేదం, వయసు వంటి విషయాల్ని అలా ఉంచితే, ఎక్కువ పనుల మీద మనసు పెట్టినప్పుడు స్త్రీ, పురుషులు ఇరువురిలోనూ మెదడుకు సంబంధించిన డార్సోలేటరల్ ప్రీఫ్రంటల్, ఇసోరియర్ పేరియేటల్ లోబ్స్, ఇన్‌ఫీరియర్ ఆక్సిపీటల్ జీరస్ విభాగాలు బాగా పనిచేస్తుంటాయి. అయితే పురుషుల్లో వీటికి అదనంగా, సప్లిమెంటరీ మోటార్ విభాగాలు, ఇన్సులా కూడా పనిచేయడం మొదలెడతాయి. స్త్రీలలో ఈ స్థితి ఉండదు. పురుషుల్లో మాత్రమే ఈ అదనపు విభాగాలు పని చేయాల్సి రావడం వల్లే పురుషులు స్త్రీలకన్నా ఎక్కువగా, త్వరగా అలసిపోతుంటారని పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఈ అలసట లేనందువల్లే స్త్రీలు ఒక విషయం నుంచి మరో విషయంలోకి అవలీలగా ప్రవేశించగలుగుతారని కూడా పరిశోధకులు చెబుతున్నారు. ఎం.ఆర్. ఐ., కొన్ని రకాల న్యూరోసైకలాజికల్ పరీక్షలతో పాటు డీ- కెఈఎఫఎస్ (ట్రయల్ మేకింగ్ టెస్ట్), వెస్లర్ మెమొరీ స్కేల్ వంటి పరీక్షల ఆధారంగా ఈ వ్యత్యాసాల్ని పరిశోధకులు కనుగొన్నారు. ఈ వివరాలు ఇటీవలి హ్యూమన్ ఫిజియాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## అభిరుచులకూ ఇవ్వాలి సమయం



మనందరికీ పుస్తక పఠనం, సంగీతం, రచనా వ్యాసాంగం, ఆటలు... ఇలా ఏదో ఒక అభిరుచి ఉండే ఉంటుంది. కానీ సమయాభావం అంటూ వాటిని పక్కన పెట్టేస్తూ ఉంటాం. అలాకాకుండా రోజూ కొన్ని చిట్కాలు పాటించి కొంత సమయాన్ని అభిరుచులకోసం కేటాయించుకోవచ్చు.
ముందుగా అవసరం లేని పనులు చేయకూడదు. ఉదాహరణకు ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడడం, తరచూ షాంపింగ్ కోసమని వెళ్లడం, ఎక్కువగా టీవీ చూడడం లాంటివి. దీనివల్ల రోజూ కొంత సమయం మిగులుతుంది.
బొమ్మలు గీయడం, నృత్యం చేయడం, సంగీత పరికరాలు వాయించడం ఇలా ఆసక్తి ఉన్న అంశం మీద రోజూ అరగంట సాధన చేయాలి. అవసరమైతే శిక్షణ కూడా తీసుకోవచ్చు. ఇలా చేస్తూ ఉంటే క్రమంగా ఒకప్పుడు అనుకున్న లక్ష్యం సాధించవచ్చు.
రోజూ చేయాల్సిన పనులను పక్కన పెట్టడం, వాయిదా వేయడం లాంటివి చేయకూడదు. దీనివల్ల వాటికి సంబంధించిన ఆలోచనలతో ఏకాగ్రత కుదరదు. సమయానుసారం పనులు పూర్తిచేసిన తరవాత మాత్రమే మీకిష్టమైన అంశాలమీద దృష్టి నిలపాలి.
ఒకేసారి గంటల సమయం కాకుండా పావుగంటతో మొదలుపెట్టి క్రమంగా సమయాన్ని పెంచుకోవాలి. వారాంతాల్లో కనీసం రెండు గంటలు అభిరుచులకోసం కేటాయించుకోవాలి.
అన్ని పనులనూ ఒక్కరమే చేయాలన్న భావనతో ఉండకుండా కుటుంబసభ్యుల సహాయం తీసుకుంటూ ఉండాలి. అప్పుడే రోజూ కొంత సమయం దొరుకుతుంది.

## కనుబొమలకూ మర్దన!



కనుబొమలు తీరైన ఆకృతిలోకి రావాలంటే పార్లర్‌కు వెళ్లి త్రెడింగ్ చేయించుకుంటాం. ఇంట్లో అప్పుడప్పుడూ ప్లక్కర్‌తో అవాంఛితంగా పెరిగిన వాటిని తీసేస్తాం. ఏది చేసినా కొద్దిగా నొప్పి, అక్కడి చర్మం ఎర్రగా కందిపోవడం వంటి సమస్యలు మామూలే. ఇలాంటివేవీ లేకుండా ఇప్పుడు కొత్త పద్ధతి అందుబాటులోకి వచ్చిందట. అదే ఐబ్రో పిన్చింగ్. అంటే కనుబొమలను నొక్కినట్లు చేయడం. లండన్, న్యూయార్క్‌లోని ఓ ప్రముఖ బ్యూటీపార్లర్ తన శాఖలన్నింట్లో దీన్ని ప్రవేశపెట్టడంతో ఇప్పుడు ఇది అంతర్జాలంలో హల్‌చల్ చేస్తోంది. కనుబొమలను సున్నితంగా నొక్కుతూ, వాటికి మర్దన చేస్తూనే అవి సరైన ఆకృతిలో వచ్చేలా చూస్తారు. దీనివల్ల ఆ భాగంలో రక్తప్రసరణ సజావుగా సాగుతుందట. ఇది బొటాక్స్ కంటే మెరుగైందని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. కనుబొమలు షేప్ చేయించునేటప్పుడు వచ్చే వాపూ తగ్గుతుందని, ఆ భాగంలో గీతలు, ముడతలు లాంటివి పడవని అంటున్నారు. ఈ చికిత్స మూలాలు ఆయుర్వేదంలో ఉన్నాయని అంటున్నారు కొందరు వైద్యులు. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో కొన్ని ప్రదేశాల్లో ఒత్తిడి పెంచడం ద్వారా మిగతా భాగాలకు సాంత్వన చేకూరుతుంది. ఇదీ అలాంటిదేనని అంటున్నారు. సాధారణంగా కంటి చుట్టూ ఉండే కణజాలం వదులవడం వల్ల ఆ ప్రాంతంలో వాపు కనిపిస్తుంది. మృదువుగా మర్దనా చేస్తే ఆ సమస్య అదుపులో ఉంటుంది. కళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి. దీనికోసం నిపుణుల దగ్గరకే వెళ్లాలని లేదు. ఇంట్లోనూ ప్రయత్నించొచ్చు. ఎలాగంటే... చల్లటి ఐసు ముక్క లేదా వస్త్రాన్ని ఆ ప్రాంతంలో అద్దినట్లు చేసినా చాలు. షేపింగ్, ఫేషియల్స్ తరువాత దీన్ని చేయడం వల్ల హాయిగా అనిపిస్తుంది.

## గదులకు సరికొత్త నగిషీలు!

గదిలో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవటానికి 'లాఫ్టెడ్ డిజైన్' ఒక చక్కని మార్గం. దీనివల్ల గదులు ఆధునికంగా కనిపించటమే కాదు.. ఇంట్లోని ఖాళీ ప్రదేశాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి, గదిలో ఆహ్లాదాన్ని సృష్టించటానికి పలు మార్గాలను చూపుతుంది.
గదులకు విలాసవంతమైన డిజైనింగ్ చేయటంలో గోడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఫ్యాబ్రిక్, త్రీడీ బోర్డ్, రకరకాల చిత్రాలతోనూ లేదా మెటల్, మార్బుల్ పలకలతోనూ గోడల ఉపరితలాన్ని కవర్ చేయటం ద్వారా విలాసవంతంగా కనిపిస్తాయి.గదిలో ఉండే స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే వివిధ రకాల ఆకృతులు, ఫీచర్లతో ఉండే వస్తువులను ఉపయోగించుకోవాలి. దీనికి అలమరాలు చక్కగా ఉపయోగపడతాయి. వాడటం సులభం. శుభ్రంగా ఉంచితే గదికి కొత్త అందాల్ని అద్దుతాయి.సాధారణంగా లైట్లు అనగానే కాంతికోసం అనే దృష్టితో చూస్తారు కానీ, గది వాతావరణానికి వీటితో లగ్జరీ లుక్ తీసుకురావొచ్చు. రకరకాల లైట్లను వాడటం ద్వారా గదిలో రకరకాల వేరియంట్స్‌ను సృష్టించొచ్చు.గోడలకు ఎక్కువ సంఖ్యలో అద్దాలు అమర్చటం ద్వారా గది విశాలంగా కనిపిస్తుంది. గదిని బట్టి కూడా అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. చేంజింగ్ రూమ్ అయితే హృదయాకారం, నక్షత్రాల ఆకారంలో ఉండే అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల ఆ గది అందం రెట్టింపు అవుతుంది.వాల్‌పేపర్లు గదిలో ఉండే స్థలానికి మంచి లుక్‌ను తెస్తాయి. మీకు బాగా ఇష్టమైన డిజైన్‌ను ఎంచుకోండి. గదిని చూడగానే కలిగే ఫీల్‌పై బ్యాగ్రౌండ్ కలర్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. బెడ్‌రూమ్ కోసం లేత తేలికపాటి రంగులు ఎంచుకోవటం వల్ల ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటుంది.ఉల్లాసపరిచే లగ్జరీ లుక్ కోసం గదుల్లో ఫర్నిచర్‌ను వాడొచ్చు.

# డయాలసిస్ మానకండి!

**మూత్ర పిండాల సమస్య ఉన్న రోగులకు లాక్‌డౌన్ క్లిష్టంగా మారింది. ప్రయాణ సాధనాల కొరత ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా డయాలసిస్ చేయుంచుకోవడం ఆలస్యం చేయకూడదు అంటున్నారు వైద్యులు!**




మూత్రపిండాలు ఫెయిల్ అయిన వారిలో రోగనిరోధకశక్తి తక్కువ. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ డిస్టెన్సింగ్ వీరు కచ్చితంగా పాటించాలి.
చికిత్స కోసం బయటకు వెళ్లడం కోసం సొంత వాహనం వాడడం మేలు. డయాలసిస్ సెంటర్‌లో కూడా సోషల్ డిస్టెన్సింగ్ పాటిస్తూ, శానిటైజర్లను వాడుకోవాలి.
సమయానికి డయాలసిస్ చేయించుకోకపోతే, కార్డియాక్ అరెస్ట్ అనే గుండె ఆగిపోయే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.
డయాలసిస్ సెంటర్లకు ప్రయాణించడం ఇబ్బందిగా మారిన ప్రస్తుత సమయంలో, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం తగ్గించాలి. అలాగే తీసుకునే ఆహారం పట్ల కూడా జాగ్రత్తలు పాటించాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11
హైదరాబాద్
శుక్రవారం
01 । ఆగస్టు । 2025



## నవ బిజినెస్

# అమెరికా పన్నుల ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు..



**ముంబై-నవభూమి:**ఆగస్ట్ ఒకటో తేదీ నుంచి భారత దిగుమతులపై 25 శాతం పన్నులతో పాటు జరిమానా కూడా విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో దేశీయ సూచీలు నష్టాలను చవిచూశాయి. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు కూడా నష్టాల బాట పట్టాయి. మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకుని లాభాల్లోకి వచ్చినప్పటికీ తిరిగి నష్టాల్లోకి జారిపోయింది. చివరకు సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో రోజును ముగించాయి .బుధవారం ముగింపు (81, 481)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 700 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ మధ్యాహ్నం వరకు లాభనష్టాలతో దోబూచులాడింది. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి ప్రవేశించింది. ఇంట్రాడే కనిష్టం అయిన 80, 695 నుంచి ఒక దశలో ఏకంగా 1100 పాయింట్లకు పైగా లాభపడి 81, 803 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరి గంటల్లో మళ్లీ నష్టాల బాట పట్టింది. చివరకు సెన్సెక్స్ 296 పాయింట్ల నష్టంతో 81, 185 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే నడించింది. చివరకు 86 పాయింట్ల నష్టంతో 24, 768 వద్ద రోజును ముగించింది. సెన్సెక్స్‌లో కేన్స్ టెక్నాలజీస్, డెలివరీ, గోద్రేజ్ కన్స్యూమర్, హెచ్‌యూఎల్, ఏబీ క్యాపిటల్ షేర్లు లాభాలు ఆర్జించాయి. హిందుస్థాన్ కాపర్, ఆర్తి ఇండస్ట్రీస్, బిర్లాసాఫ్ట్, ఇండస్ టవర్స్, ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 541 పాయింట్లు నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ 188 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.59గా ఉంది.

## ఈ పోస్ట్ ఆఫీస్ స్కీంలో ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తే..

### 10 ఏళ్లలో రూ.12 లక్షల రిటర్న్స్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**నేటి కాలంలో పెట్టుబడికి మెరుగైన మార్గంగా పరిగణిస్తారు. అయినప్పటికీ ఇప్పటికీ చాలా మంది ప్రజలు మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇష్టపడరు. కాస్త తక్కువ లాభం వచ్చినా రిస్క్ లేకుండా కచ్చితమైన రిటర్న్స్ రావాలని కోరుకుంటారు. అలాంటి వారి కోసమే ఈ పోస్ట్ ఆఫీస్ స్కీం. ప్రభుత్వ సంస్థ కావడంతో పెట్టుబడి సురక్షితంగా ఉంటుంది. అనుకున్న సమయానికి అనుకున్న సంపాదన చేతికొస్తుంది. మీరు కూడా మీరు కూడా అలాంటి పెట్టుబడిదారులలో ఒకరైతే పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇందులో మీరు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టవలసిన అవసరం లేదు. ప్రతి నెలా స్థిర మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం ద్వారా మంచి రాబడిని పొందవచ్చు. పోస్ట్ ఆఫీస్ పథకానికి 5 సంవత్సరాల కాలవ్యవధి ఉంటుంది. ఈ స్కీం కింద పెట్టుబడిదారులకు 6.7 శాతం వడ్డీ లభిస్తుంది. దీనిని త్రైమాసిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఈ విధంగా మంచి మొత్తాన్ని ఆదా చేయవచ్చు. పోస్ట్ ఆఫీస్‌లో ప్రతి నెలా రూ.7000 పెట్టుబడి పెడితే.. 5 సంవత్సరాలలో రూ. 5 లక్షలు, 10 సంవత్సరాలలో దాదాపు రూ.12 లక్షలు ఆదా చేయవచ్చు.మీరు ఈ %=ఱ% స్కీంని మరో 5 సంవత్సరాలు పొడిగిస్తే దాదాపు 12 లక్షల రూపాయల ఆదాయం లభిస్తుంది. ఇందులో మీ మొత్తం పెట్టుబడి 8,40,000 అవుతుంది. దీనిపై 6.7 శాతం వడ్డీ రేటుతో వడ్డీగా రూ. 3,55,982 మాత్రమే లభిస్తుంది. మెచ్యూరిటీ పీరియడ్ పూర్తయ్యాక రూ. 11,95,982 అంటే దాదాపు 12 లక్షల రూపాయలు చేతికొస్తుంది.పోస్ట్ ఆఫీస్ %=ఱ% ని రూ. 100 తో తెరవవచ్చు. ఇది ఎవరైనా సులభంగా ఆదా చేయగల మొత్తం. దీనిలో పెట్టుబడికి గరిష్ఠ పరిమితి లేదు. దీనిపై కాంపౌండ్ వడ్డీ ప్రయోజనాన్ని పొందుతారు. 5 సంవత్సరాలలో వడ్డీగా మంచి లాభం పొందుతారు. ఈ పథకంలో ఒక వ్యక్తి ఎన్ని ఖాతాలనైనా తెరవవచ్చు. సింగిల్ కాకుండా ముగ్గురు వ్యక్తులకు ఉమ్మడి ఖాతా తెరవవచ్చు. పిల్లల పేరుతో ఖాతా తెరిచే సౌకర్యం కూడా ఉంది. %=ఱ% ఖాతా మెచ్యూరిటీ వ్యవధి 5 సంవత్సరాలు. కానీ 3 సంవత్సరాల తర్వాత ప్రీ-మెచ్యూర్ క్లోజర్ చేయవచ్చు. ఇందులో నామినేషన్ సౌకర్యం కూడా ఉంది. మెచ్యూరిటీ తర్వాత %=ఱ% ఖాతాను మరో 5 సంవత్సరాలు కొనసాగించవచ్చు.

## తగ్గిన ధరలకు బ్రేక్.. మళ్లీ లక్షదాటేసిన పసిడి ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం, వెండి ధరలు మళ్లీ సామాన్యులకు షాక్ ఇచ్చాయి. గత మూడు నాలుగు రోజులుగా తగ్గిన ధరలకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో జూలై 31న ఉదయం 6:10 గంటల సమయంలో, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు నిన్నటి రేట్లతో పోలిస్తే మళ్లీ పెరిగాయి.

24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.680 పెరిగి రూ.1,00,490కి చేరుకోగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.92,110 స్థాయికి చేరింది. వెండి ధర కూడా కిలోగ్రాముకు రూ.1,200 పెరిగి రూ.1,17,100కి చేరుకుంది. ఈ ధరల పెరుగుదల భారతదేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా కనిపించింది.

**ఇతర నగరాల్లో బంగారం, వెండి ధరలు**

ఢిల్లీ: 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,00,640, 22 క్యారెట్ల బంగారం రూ.92,260, వెండి కిలోగ్రాముకు రూ.1,17,100.

చెన్నై: 24 క్యారెట్ల బంగారం రూ.1,00,490, 22 క్యారెట్ల బంగారం రూ.92,110, వెండి రూ.1,27,100.

ముంబై: 24 క్యారెట్ల బంగారం రూ.1,00,490, 22 క్యారెట్ల బంగారం రూ.92,110, వెండి రూ.1,27,100.

విజయవాడ: 24 క్యారెట్ల బంగారం రూ.1,00,490, 22 క్యారెట్ల బంగారం రూ.92,110, వెండి రూ.1,27,100.

విశాఖపట్నం: 24 క్యారెట్ల బంగారం రూ.1,00,490, 22 క్యారెట్ల బంగారం రూ.92,110, వెండి రూ.1,17,100.

బెంగళూరు: 24 క్యారెట్ల బంగారం రూ.1,00,490, 22 క్యారెట్ల బంగారం రూ.92,110, వెండి రూ.1,17,100.

ఈ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే సమయంలో వీటి ధరల గురించి మళ్లీ తెలుసుకోవడం ఉత్తమం.

**ధరల పెరుగుదలకు కారణాలు**

బంగారం, వెండి ధరల పెరుగుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక అనిశ్చితిని సృష్టిస్తున్నాయి. ఈ సమయంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులైన బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల డిమాండ్ పెరుగుతుంది. బంగారం ధరలు సాధారణంగా డాలర్ బలహీనపడినప్పుడు పెరుగుతాయి. బంగారం ఉత్పత్తి స్థిరంగా ఉండటం, కొత్త గనుల అన్వేషణ తగ్గడం వల్ల సరఫరా పరిమితమవుతోంది. ఇది కూడా ధరల పెరుగుదలకు దోహదం చేస్తుంది.

**భవిష్యత్తులో ఎంతకు చేరుతుంది**

నిపుణుల అంచనాల ప్రకారం, 2025 చివరి నాటికి 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1.25 లక్షలకు చేరుకోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లకు చేరే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. వెండి ధరలు కూడా దీపావళి నాటికి రూ.1,20,000కి చేరుకోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# మహిళల కోసం ఎల్ఐసీ పథకం.. ప్రతి నెలా చేతికి డబ్బులు




**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారి కోసం అద్భుతమైన పథకాల్ని ఎప్పటికప్పుడు తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. వీటిల్లో పోస్టాఫీస్ ద్వారా ఉంటాయి. ఆర్బీఐ ద్వారా ఉంటాయి. ఇంకా ఇలా ఎన్నో మార్గాల ద్వారా ప్రజల్లో పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రోత్సహిస్తూనే ఉంటుందని చెప్పొచ్చు. ఇందులో మహిళల కోసం కూడా చాలానే పథకాలు ఉన్నాయని చెప్పొచ్చు. వీటిల్లోనే ఒకటి ఎల్ఐసీ ఆఫర్ చేస్తున్న ఎల్ఐసీ బీమా సఖి యోజన. మహిళల్లో సాధికారత పెంపొందించేందుకు సహా ఇంకా వీరికి నెలనెలా స్థిరమైన ఆదాయం అందించేందుకు తీసుకొచ్చిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో జనాల్లో ఇన్సూరెన్స్‌పై అవగాహన పెంపొందించాలని చూస్తోంది. ఈ స్కీమ్ విషయానికి వస్తే ఇక్కడ మహిళలను ఎల్ఐసీ ఏజెంట్లుగా తీర్చిదిద్దడమే ప్రధాన ఉద్దేశం. ఇక్కడ ముందుగా మహిళల్ని నియమించుకొని ట్రైనింగ్ కూడా ఇస్తారన్నమాట. వారి వారి కమ్యూనిటీల్లో బీమాపై అవగాహన పెంపొందించడం ద్వారా నెలనెలా సంపాదించేలా కృషి చేస్తారు. వారినే బీమా సఖీలు అని పిలుస్తారు. వీరికి ముందుగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగానే ఇన్సెంటివ్‌లు, ఇంకా భవిష్యత్తులో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రమోషనల్ సపోర్ట్ కూడా ఇస్తారు. ట్రంప్ దెబ్బకు.. బంగారం ధరల్లో ఊహించని మార్పు ఎల్ఐసీ బీమా సఖి యోజన కింద ఎంపికైన మహిళలు.. అదే ఏజెంట్లు.. మొదటి 3 సంవత్సరాల్లో నెలనెలా స్టైపెండ్ అందుకుంటారు. ఇది వారి పనితీరుపైనా ఆధారపడి ఉంటుంది. మొదటి సంవత్సరం మాత్రం నెలకు రూ. 7 వేలు అందిస్తారు. రెండో సంవత్సరం ఇది నెలకు రూ. 6 వేలుగా ఉంది. ఇక్కడ మొదటి సంవత్సరంలో పూర్తి చేసిన పాలసీల్లో కనీసం 65 శాతం రెండో సంవత్సరం చేస్తే అప్పుడు పూర్తి మొత్తం అందుకోవచ్చు. ఇక్కడే 65 శాతం కంటే తక్కువ ఉంటే మాత్రం ఆ మొత్తం అందుకోలేరు. మూడో సంవత్సరంలో ఇది నెలకు రూ. 5 వేలుగా ఉంది.ప్రస్తుతం ఎల్ఐసీ ఏజెంట్లు లేదా ఉద్యోగులుగా ఉన్న వారి బంధువులు ఈ పథకం కోసం అప్లై చేసుకునేందుకు వీల్లేదు. ఈ బంధువుల్లో జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, సిబ్లింగ్స్, ఇన్-లాస్ అంతా వర్తిస్తారు. ఇంకా రిటైర్డ్ కార్పొరేషన్ ఉద్యోగులు, మాజీ ఏజెంట్లు కూడా ఈ పథకం కోసం అప్లై చేసుకోరాదు. ప్రస్తుతం ఏజెంట్లుగా పనిచేస్తున్న వారు కూడా అనర్హులే.

## గ్యాస్ ధరల నుంచి యూపీఐ వరకు.. రేపటి నుంచే కొత్త రూల్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**జూలై నెల ముగించుకుని ఆగస్టు నెలలోకి అడుగుపెడుతున్నాం. సాధారణంగా కొత్త నెల ప్రారంభ అవుతుంటే కొన్ని కొత్త నిబంధనలు అమలులోకి వస్తుంటాయి. ముఖ్యంగా ఆర్థిక అంశాలకు సంబంధించిన మార్పులు సామాన్యులపై భారం పెంచవచ్చు. చిన్న చిన్న మార్పులే మీ జెబుకు చిల్లు పెట్టవచ్చు. ఈ కొత్త మార్పుల్లో ప్రధానంగా తెలుసుకోవాల్సింది ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు. వీటితో పాటు ఈసారి క్రెడిట్ కార్డు, యూపీఐ, బ్యాంకింగ్ సహా చాలా మార్పులు అమలులోకి వస్తున్నాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి అమలులోకి వస్తున్న ఫైనాన్షియల్ రూల్స్ గురించి తెలుసుకుందాం.

**గ్యాస్ సిలిండర్ ధరలు..**

వంట గ్యాస్ సిలిండర్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రతి నెల 1వ తేదీన సమీక్షిస్తుంటాయి. గత కొన్ని నెలలుగా వాణిజ్య సిలిండర్ ధరల్లో మార్పు చేస్తూ వచ్చాయి. ఈసారి సబ్సిడీ లిసిండర్ ధరల్లో మార్పు ఉండవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆగస్టు 1 నుంచి గ్యాస్ ధరలు తగ్గవచ్చని పలు నివేదికలు చెబుతున్నాయి. మరి ఎలాంటి నిర్ణయం వెలువడుతుందో వేచి చూడాల్సిందే.

యూపీఐ యాప్స్ ఉపయోగిస్తున్న వారు ఆగస్టు 1 నుంచి వస్తోన్న కొత్త రూల్స్ తెలుసుకోవాలి. ఒక రోజులో 50 సార్లు మాత్రమే బ్యాలెన్స్ చెక్ చేసుకునేందుకు వీలుంటుంది. ఫోన్ నంబర్‌కు లింక్ చేసిన బ్యాంక్ ఖాతాలను కేవలం 25 సార్లు చెక్ చేయవచ్చు. ఆటో పే వంటి సర్వీసుల ట్రాన్సాక్షన్లు మూడు స్థిర స్లాట్లలో మాత్రమే ప్రాసెస్ కానున్నాయి. ఉదయం 10 గంటలకు ముందు, మధ్యాహ్నం 1-5 గంటల మధ్య, రాత్రి 9.30 గంటల తర్వాత మాత్రే ప్రాసెస్ అవుతాయి. ఇక ఫెయిల్ అయిన లావాదేవీల స్టేటస్ రోజుకు మూడు సార్లు చెక్ చేయవచ్చు. రెండు ట్రాన్సాక్షన్ల మధ్య 90 సెకన్ల గ్యాప్ ఉండాలి.

**క్రెడిట్ కార్డులకు కొత్త రూల్స్**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ క్రెడిట్ కార్డు యూజర్లకు షాకిచ్చింది. క్రెడిట్ కార్డులకు అందిస్తున్న కాంప్లిమెంటరీ ఎయిర్ యాక్సిడెంట్ ఇన్సూరెన్సును తొలగించింది. ఆగస్టు 11వ తేదీ నుంచి ఈ రూల్స్ అమలులోకి వస్తాయి. పలు కార్డులపై ప్రస్తుతం అందిస్తున్న రూ.50 లక్షలు, రూ.1 కోటి వరకు ఉచిత విమాన ప్రమాద బీమా పాలసీలను ఆపేస్తోంది.

**ట్రేడింగ్ సమయం పెంపు..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. కాల్ మనీ, మార్కెట్ రెపో, ట్రై పార్టీ రెపో మార్కెట్స్ వంటి వాటిల్లో ట్రేడింగ్ సమయాన్ని పెంచింది. ఆగస్టు 1 నుంచి రెండు దశల్లో ఈ మార్పు ఉండనుంది.

**ఆర్‌బీఐ ఎంపీసీ మీటింగ్**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ ద్వైమాసిక సమీక్షా సమావేశం ఆగస్టు 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు కొనసాగనుంది. ఈసారి కూడా రెపో రేటును భారీగా తగ్గిస్తారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే రుణాలపై వడ్డీ రేట్లు భారీగా తగ్గనున్నాయి.

చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరలను సమీక్షిస్తుంటాయి. అయితే ఏప్రిల్ 9 నుంచి వాటి ధరల్లో ఎటువంటి మార్పు చేయలేదు. ముంబైలో సీఎన్‌జీ ధర కిలోకు రూ. 79.50, పీఎన్‌జీ ధర యూనిట్‌కు రూ.49గా ఉంది. అయితే కొత్త నెలలో ధరలు మారే అవకాశం ఉంది. ఇది ప్రజా రవాణా, ఇంటి ఖర్చులను ప్రభావితం చేయనుంది.

## పెళ్లి కోసం పర్సనల్ లోన్.. లాభాలే కాదు ఈ నష్టాలూ ఉంటాయి.. చూసుకోండి మరి




**న్యూఢిల్లీ-నవభూమి:**మన దేశంలో పెళ్లిళ్ల సీజన్ మొదలైపోయింది. లక్షల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. జీవితంలో పెళ్లి అనేది ఒక మధుర ఘట్టం. తమ వివాహం కలకాలం గుర్తుండిపోవాలని చాలా మంది అనుకుంటారు. అంగరంగ వైభవంగా ఎన్నో ఆడంబరాలతో వివాహ వేడుక చేసుకుంటారు. డెస్టినేషన్ వెడ్డింగ్, థీమ్స్, గిఫ్ట్స్ అంటూ పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుంటారు. కొందరు పెళ్లి విందు కోసమే లక్షల్లో ఖర్చు చేస్తుంటారు. వైభవంగా పెళ్లి చేసుకోవాలంటే చేతిలో పెద్ద మొత్తంలో డబ్బు ఉండాలి. ఇలాంటి వారిని బ్యాంకులు సైతం ప్రోత్సహిస్తున్నాయి. వివాహ ఖర్చులకు రుణాలు ఇస్తున్నాయి. చాలా మంది తమ పెళ్లి ఖర్చులు కోసం బ్యాంకుల్లో అప్పు చేస్తున్నారు. మరి ఇలా వివాహం కోసం పర్సనల్ లోన్ తీసుకోవడం మంచిదేనా? ఎలాంటి లాభాలు, నష్టాలు ఉంటాయి?

ప్రయోజనాలివే..పెళ్లి చేసుకునేందుకు సిద్ధమవుతున్న వారు పర్సనల్ లోన్ చాలా ఈజీగానే పొందవచ్చు. చాలా బ్యాంకులు తక్కువ డాక్యుమెంటేషన్‌తో 24-72 గంటల వ్యవధిలోనే లోన్ ఇస్తున్నాయి. అలాగే ఈ లోన్ పొందేందుకు ఎలాంటి ఆస్తి, బంగారం వంటివి బ్యాంకులో తనఖాపెట్టాల్సిన అవసరం ఉండదు. మీకు వచ్చే ఆదాయం, క్రెడిట్ స్కోర్ ఆధారంగా లోన్ ఎంత ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. అలాగే మీరు తిరిగి చెల్లించే సామర్థ్యం, ఆర్థి సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈఎంఐ టెన్యూర్ ఎంచుకోవచ్చు. 12-60 నెలల వరకు గడువు ఉంటుంది. దీర్ఘకాలిక పొదుపు, ఇన్వెస్ట్‌మెంట్ కోసం ఉపయోగించే నిధులను వాడకుండా ఇలా లోన్ తీసుకుని అవసరాలు తీసుకోవచ్చు.

వివాహ వేడుక ఒక వారంలో పూర్తవుతుంది. కానీ అందుకోసం తీసుకున్న లోన్ ఈఎంఐలు నెలల తరబడి కట్టాల్సి వస్తుంది. అనవసరపు ఖర్చులకు పోయి ఆర్థికంగా ఒత్తిడి ఎదుర్కోవలసి వస్తుంది. పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటాయి. క్రెడిట్ స్కోర్ బట్టి 10-24 శాతం వరకు వడ్డీ ఉంటుంది. ఇంత ఎక్కువ వడ్డీ అంటే తిరిగి చెల్లించే ఈఎంఐ సైతం భారీగానే ఉంటుందని గ్రహించాలి. ఒక్కోసారి లోన్ ఈఎంఐ చెల్లించడంలో ఆస్యమవుతుంది. అలా జరిగితే అది మీ క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. క్రెడిట్ స్కోర్ తగ్గితే భవిష్యత్తులో లోన్ తీసుకునేందుకు అవకాశాలు తగ్గిపోతాయి. అలాగే ఈజీగా లోన్ వస్తుంది కదా అని పెళ్లి కోసం బడ్జెట్‌కు మించి ఖర్చు చేయవచ్చు. అలా తెలియకుండానే ఆర్థికపరమైన ఒత్తిడిలో కూరుకుపోవచ్చు.

అయితే, లోన్ కోసం అప్లై చేసే ముందే అన్ని బ్యాంకుల్లో వెడ్డింగ్ లోన్ వడ్డీ రేట్లు తెలుసుకోవాలి. ఎందులో తక్కువ ఉంటే అందులో తీసుకోవడం ద్వారా భారం తగ్గించుకోవచ్చు. మీ అవసరం, తిరిగి చెల్లించే సామర్థ్యం బట్టి లోన్ ఎంత తీసుకోవాలి అనేది నిర్ణయించుకోవాలి. అలాగే బ్యాంకుల్లో చాలా ఛార్జీలు ఉంటాయి. దరఖాస్తు సమయంలో అన్ని చెప్పరు. తీరా లోన్ మంజూరైన తర్వాత అధిక ఛార్జీలు ఉన్నాయని బాధపడాల్సి వస్తుంది. పూర్తి వివరాలు తెలుసుకున్నాకే లోన్ తీసుకోవడం మంచిది.

## రూ.600 కోట్ల కొత్త ఆర్డర్.. దూసుకెళ్తున్న డిఫెన్స్ స్టాక్




**న్యూఢిల్లీ-నవభూమి:**రక్షణ రంగంలోని స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ యాక్సిస్కేడ్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ స్టాక్ దూసుకెళ్తోంది. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో లాభాల్లో కొనసాగుతుండగా.. క్రితం రోజు ఏకంగా 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్లో లాక్ అయింది. ప్రముఖ డిఫెన్స్ ల్యాబొరేటరీస్ నుంచి రూ.600 కోట్లు విలువ వైమానిక, నావికా, రాడార్ ఆధారిత ప్లాట్ ఫారాల్లో ఆర్డర్లు అందుకున్నట్లు కంపెనీ ప్రకటించడగా ఈ షేర్ భారీ ర్యాలీ చేస్తోంది.ఈ కంపెనీ షేరు గత ఐదు సంవత్సరాల కాసంలో ఏకంగా 2374 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. ఐదేళ్ల క్రితం లక్ష రూపాయలు పెట్టి ఇందులో షేర్లు కొనుగోలు చేసి ఇప్పటి వరకు కొనసాగినట్లయితే ఇప్పుడు ఆ షేర్ల విలువ సుమారు రూ. 25 లక్షలు అవుతుంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలోనే పది రెట్లకు పైగా పెరిగి కాసులు కురిపించింది. అందుకే ఈ స్టాక్ కొనుగోలు చేసేందుకు మదుపరులు ఎగబడుతున్నట్లు తెలుస్తోంది.

కంపనీ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం.. కొత్త ఆర్డర్‌లో డీఆర్‌డీఓతో పాటు ప్రముఖ ప్రభుత్వ డిఫెన్స్ సంస్థలు డెవలప్ చేస్తోన్న అధునాతన దేశీయ ప్లాట్ ఫారాల కోసం ఆధునిక సబ్ సిస్టమ్స్ అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపింది. %హబ-30 వీఖ×% అప్డేట్ కోసం విరూపాక్ష రాడార్, %హ%-బ్యాండ్ సర్వైలెన్స్ రాడార్ల కోసం ట్రాన్స్ మిట్- రిసీవ్ మాడ్యూల్స్ అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అలాగే లాంగ్-రేంజ్ బ్యాటిల్ మ్యానేజ్మెంట్ రాడార్ల కోసం డిజిటల్ బీమ్ ఫార్మింగ్ యూనిట్స్ అభివృద్ధిలో భాగం కావాల్సి ఉందని తెలిపింది.


ఈ కంపెనీ షేరు పని తీరు పరిశీలిస్తే.. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో ఈ వార్త రాసే సమయానికి 2.35 శాతం లాభంతోరూ.1330 వద్ద ట్రేడవుతోంది. క్రితం రోజు యాక్సిస్కేడ్స్ టెక్నాలజీస్ షేరు 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ టచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 1506.50, కనిష్ఠ ధర రూ. 420.90 వద్ద ఉన్నాయి. గత వారం రోజుల్లో ఈ షేరు 3 శాతం నష్టపోయింది. గత నెల రోజులల్లో ఈ షేరు సుమారు 10 శాతం పడిపోయింది. గత ఆరు నెలల్లో ఈ షేరు సుమారు 96 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఏడాది కాలంలో 136 శాతం లాభాలు ఇచ్చింది. గత 5 సంవత్సరాల్లో ఏకంగా 2374 శాతం లాభాన్ని ఇచ్చింది. లక్ష పెడితే రూ.25 లక్షలు చేసింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ సుమారు రూ. 5600 కోట్లుగా ఉంది.

## యూపీఐ ట్రాన్సాక్షలపై ఛార్జీలు.. ఆగస్టు 1 నుంచే షురూ




**న్యూఢిల్లీ-నవభూమి:** మన దేశంలో డిజిటల్ పేమెంట్లలో యూపీఐ దూసుకెళ్తోంది. నిత్యం కోట్లాది లావాదేవీలు జరుగుతున్నాయి. రోజు రోజుకూ మరింత పెరుగుతున్నాయి. కూరగాయల కొనుగోలు నుంచి మాల్స్‌లో షాపింగ్ వరకు ప్రతి చోటా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే వంటి యాప్స్ ఉపయోగించి పేమెంట్లు చేస్తున్నారు. ప్రతి రోజు కోట్ల రూపాయల ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించేందుకు సిద్ధమైంది ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్ (%×జ×జ× ధీఅ౧%). యూపీఐ ట్రాన్సాక్షన్లు ప్రాసెస్ చేసే పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించేందుకు సిద్ధమైంది. ఆగస్టు 1, 2025వ తేదీ నుంచి ఈ ఛార్జీలు వసూలు చేయనున్నారని జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి.ఈ విషయంపై జూలై నెల ప్రారంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారం ఇచ్చినట్లు వార్తా కథనాల ద్వారా తెలుస్తోంది. ఐసీఐసీఐ ఎస్క్రో అకౌంట్లు నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి ట్రాన్సాక్షన్‌కు 2 బేసిస్ పాయింట్ల విధానంలో గరిష్ఠంగా రూ. 6 ఛార్జీలు విధించనున్నట్లు సమాచారం. అలాగే ఎస్క్రో అకౌంట్లు లేని అగ్రిగేటర్లకు అయితే ఈ ఛార్జీలు డబుల్ ఉండనున్నాయి. అంటే ప్రతి ట్రాన్సాక్షన్‌కి 4 బేసిస్ పాయింట్ల చొప్పున రూ. 10 వరకు ఛార్జీలు వసూలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్లకు అయితే, ఎలాంటి భారం ఉండదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలోని మర్చంట్ల కోసం డిజిటల్ పేమెంట్లు చేపట్టే పేమెంట్ అగ్రిగేటర్లకు మాత్రమే ఈ ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ నోటీసుల్లో పేర్కొందని వార్తలు వస్తున్నాయి. యూపీఐ ట్రాన్సాక్షన్ల నిర్వహణకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%చీూజ×%)కు చెల్లించే మొత్తాన్ని ఇప్పటి వరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తూ వస్తోంది. ఈ క్రమంలో ఖర్చుల తగ్గించుకునేందుకు పేమెంట్ అగ్రిగేటర్లపై ఈ ఛార్జీలు విధిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ విషయంపై ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. జాతీయ మీడియా కథనాల ద్వారా ఈ విషయం తెలిసింది.

## రొయ్యల ఎగుమతీ సమస్యే



**హైదరాబాద్/భీమవరం - నవభూమి:** ట్రంప్ సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడుల్లోని రొయ్యల ఎగుమతులపైనా పడనుంది. మన దేశం నుంచి ఏటా 11 లక్షల టన్నుల రొయ్యలు ఎగుమతి అవుతుంటే అందులో ఎనిమిది లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రం నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 70 శాతం అమెరికాకే వెళ్తాయి. ట్రంప్ తాజా సుంకాలతో రైతులతో పాటు, ఇటు ఎగుమతిదారులూ తీవ్రంగా నష్టపోతారని జగదీష్ మెరైన్ ప్రొడక్ట్స్ అధినేత జగదీశ్ చెప్పారు. అమెరికాతో ద్వైపాక్షి క వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదిరే వరకు ఈ తిప్పలు తప్పవన్నారు.

**సగం వాటా రొయ్యలదే:** మన దేశం నంచి ఏటా 480 కోట్ల డాలర్ల విలువైన మత్స్య ఎగుమతులు జరుగుతుంటే అందులో సగానికిపైగా వాటా రొయ్యలదే. ఇపుడు ట్రంప్ సర్కార్ మన దేశానికి చెందిన మత్స్య ఎగుమతులపైనా 25 శాతం దిగుమతి సుంకం విధించింది. దీనికి తోడు రష్యా నుంచి చమురు, ఆయుధాలు దిగుమతి చేసుకుంటే జరిమానాలూ తప్పవని ట్రంప్ ప్రకటించారు. ఇదే సమయంలో అమెరికాకు అతి సమీపంలో ఉన్న ఈక్వెడార్ నుంచి అతి తక్కువ సుంకాలతో రొయ్యలతో సహా అనేక మత్స్య దిగుమతులను అనుమతించనుంది. దీంతో భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా మార్కె ట్ దాదాపు మూసుకు పోయినట్టేనని భావిస్తున్నారు. ఈ ప్రభావం వ్యాపారులు రొయ్యల రైతులకు చెల్లించే ధరలపైనా పడుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

# జియో రూ.52000 కోట్ల ఐపీఓ

**న్యూఢిల్లీ-నవభూమి:** ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా అన్ని డిజిటల్ సేవల విభాగమైన జియో ఇన్ఫోకామ్.. దలాల్‌స్ట్రీట్ చరిత్రలో అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌కు సిద్ధమవుతోంది. 5 శాతం వాటా విక్రయం ద్వారా 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.52,200 కోట్లు) వరకు సమీకరించాలని జియో ఇన్ఫోకామ్ భావిస్తున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్ చరిత్రలో అతిపెద్దదైన రూ.28,000 కోట్ల హ్యుండయ్ ఐపీఓతో పోలిస్తే జియో దాదాపు రెండింతల అధిక నిధులు సమీకరించనుందన్నమాట. ఐపీఓకు అనుమతి కోసం సెబీతో రిలయన్స్ ఇప్పటికే అనధికారిక చర్చలు కూడా ప్రారంభించినట్లు ఆ నివేదికలో తెలిపారు. సంస్థ వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఇష్యూకు రావచ్చని సమాచారం. ఈ ఆగస్టులో ఆర్‌ఐఎల్ నిర్వహించబోయే వాటాదారుల వార్షిక సమావేశంలో జియోతోపాటు రిలయన్స్ రిటైల్ ఐపీఓలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. జియో ఇన్ఫోకామ్‌లో 2020లో పెట్టుబడులు పెట్టిన మెటా ప్లాట్‌ఫామ్స్, గూగుల్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాలు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు ప్రతిపాదిత ఐపీఓ ద్వారా తమ వాటాలను కొంత మేర ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి.

# నాచారంలో యూకే సినీప్లెక్స్‌ని ప్రారంభించిన దిల్ రాజు, సునీల్ నారంగ్

హైదరాబాద్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్. మూవీ లవర్స్‌ని అలరించడానికి మరో కొత్త మల్టీప్లెక్స్ అందుబాటులోకి వచ్చింది. అత్యంత విలాసవంతమైన, అధునాతన సౌకర్యాలతో కూడిన యూకే సినీప్లెక్స్ నాచారంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్‌లతో పాటు శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఈ 4-స్క్రీన్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, యూకే సినీప్లెక్స్ థియేటర్ ఎంతో ఉన్నతంగా ఉందని ప్రశంసించారు. "సౌండ్ సిస్టమ్, స్క్రీన్, సీట్లు ఎంతో బాగున్నాయి. ఉప్పల్, హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో నివసించే వారికి ఈ మల్టీప్లెక్స్ వినోదాన్ని పంచడంలో సరికొత్త అనుభూతిని ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు" అని ఆయన అన్నారు.



ఈ ప్రారంభోత్సవ వేడుకలో శ్రీమతి ప్రతికా ఉదయ్, శ్రీ రుషిల్ ఉదయ్‌లతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. యూకే సినీప్లెక్స్ కేవలం ఒక సినిమా థియేటర్ మాత్రమే కాదని, ఇది ఒక పూర్తిస్థాయి వినోద అనుభూతి అని నిర్వాహకులు పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు, అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు, కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.



## మినీ స్కర్ట్‌లో అషు గ్లామర్ బ్లాస్ట్



టాలీవుడ్ గ్లామర్ వరల్డ్‌లో అడుగు పెట్టిన తర్వాత అషు రెడ్డి స్టైల్, స్వాగ్‌కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ షోలో తన ఉత్సాహభరితమైన బాడీ లాంగ్వేజ్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి నెట్టింట తెగ దూసుకుపోతోంది. షేర్ చేసిన ఫోటోషూట్‌లో అషు రెడ్డి రెడ్ కలర్ ఫ్లోరల్ టాప్, బ్లాక్ మినీ స్కర్ట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. ఈ లుక్‌లో ఆమె వేషధారణ మాత్రమే కాదు, హైహీల్స్, హెయిర్ ఫ్లిప్, ఎక్స్‌ప్రెషన్లు అన్నీ కలసి ఒక స్టైలిష్ స్టేట్మెంట్ లా మారాయి. "నా హీల్స్ నిన్ను ఎత్తుగా చేస్తాయని నాకు తెలుసు. అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్‌కి యూత్ నుంచి రెస్పాన్స్ జెట్ స్పీడ్‌లో వచ్చింది. వేలల్లో లైకులు, ఆకట్టుకునే కామెంట్లతో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూస్తే క్లాస్‌కు గ్లామర్ ఎలా జోడించాలో అషు తో నేర్చుకోవాలి అంటున్నారు నెటిజన్స్. ఇక అషు కెరీర్ విషయానికొస్తే, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీ, డబ్‌స్మాష్‌తో మొదలైన ప్రయాణం టీవీ నుంచి సినిమాల వరకు విస్తరించింది. బిగ్ బాస్ సీజన్ 3 ఆమెకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. ఆ షో ద్వారా ఆమె మాస్ ఆడియెన్స్‌లో తన ప్రత్యేకతను చూపించింది. ఆ తర్వాత కొన్ని స్పెషల్ షోలు, ఈవెంట్ హోస్టింగ్, గ్లామర్ ఫోటోషూట్లతో తనదైన గుర్తింపును క్రియేట్ చేసుకుంది. అషు రెడ్డి స్పష్టంగా తెలుసుకొని ప్రయాణిస్తున్న విషయమేమి టంటే గ్లామర్ ద్వారా క్రేజ్ తెచ్చుకుంటే దానిని మెయింటైన్ చేయడమే అసలైన ఆర్ట్. ఆమె ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ చూస్తేనే తెలుస్తుంది..


## మృణాల్‌ను ఇలా సర్‌ప్రైజ్ చేసిన హీరో




'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి బాలీవుడ్ సినిమాలు చేయడం మొదలు పెట్టి దాదాపుగా దశాబ్ద కాలం అవుతున్నా దక్కని గుర్తింపు టాలీవుడ్‌లో చేసిన సీతారామం సినిమాతో దక్కింది. తక్కువ సమయంలోనే మృణాల్ ఠాకూర్ టాలీవుడ్‌లో టాప్ స్టార్‌గా నిలిచింది. హాయ్ నాన్నతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. టాలీవుడ్‌లో ఇబ్బడి ముబ్బడిగా సినిమా ఆఫర్లు వస్తున్నప్పటికీ చాలా సెలక్టివ్‌గా సినిమాలను ఎంపిక చేసుకుంటూ ఉంది. ప్రస్తుతం తెలుగులో ఈమె అడవి శేష్ తో కలిసి 'డెకాయిట్' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ ఏడాది చివర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆ సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు చకచక జరుగుతున్నాయి. హ్యాపీ బర్త్‌డే మృణాల్ ఠాకూర్ మృణాల్ ఆగస్టు 1న పుట్టిన రోజు జరుపుకోనుంది. హీరో అడవి శేష్ 'డెకాయిట్' యూనిట్ సభ్యులతో కలిసి మృణాల్ ఠాకూర్‌ని సర్‌ప్రైజ్ చేశాడు. షూటింగ్ కాస్ట్యూమ్స్‌లోనే అందరూ ఉన్నారు. మృణాల్ సైతం ఆ సినిమాలోని పాత్ర లుక్‌లోనే ఉంది. ఆమెకు తెలియకుండా ఒక రూం లో యూనిట్ సభ్యులు అంతా బర్త్‌డేకి ప్లాన్ చేశారు. ఆమె తన బర్త్‌డేకి టైం ఉంది కదా అని కనీసం ఊహించలేదు. డోర్ తీసిన వెంటనే మృణాల్ కి ఒక్కసారిగా అంతా హ్యాపీబర్త్‌డే అంటూ గట్టిగా చెప్పడంతో పాటు, పెద్ద కేక్ ను ఏర్పాటు చేయడంతో మృణాల్ సర్‌ప్రైజ్ అయింది. ఆమె ఫేస్‌లో ఆనందం కనిపించింది. చాలా సంతోషంగా కేక్‌ను కట్ చేసింది. డెకాయిట్ నిర్మాత సుప్రియతో పాటు, హీరో అడవి శేష్ ఇతర యూనిట్ సభ్యులకు కేక్ ను షేర్ చేసింది. యూనిట్ సభ్యులు అంతా హ్యాపీ బర్త్‌డే అంటూ మృణాల్ కోసం పాట పాడుతున్న సమయంలో సరదాగా స్టెప్స్ వేసి చాలా ఉల్లాసంగా మృణాల్ ఠాకూర్ కనిపించింది. ఈ మొత్తం వీడియోను డెకాయిట్ సినిమాను నిర్మిస్తున్న అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ అఫిషియల్ ఎక్స్ పేజ్ లో షేర్ చేయడం జరిగింది.

## హిస్టరీ క్రియేట్ చేసిన మగధీరకి 16 ఏళ్లు.. ఊహించని రికార్డులతో రామ్ చరణ్ సెన్సేషన్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సినీ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిన చిత్రం "మగధీర", జూలై 31, 2009న ప్రేక్షకుల ముందుకు వచ్చి టాలీవుడ్ బాక్సాఫీస్ చరిత్రను తిరగరాసింది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి టేకింగ్, కథనం, విజువల్స్‌తో తెలుగు సినిమా స్థాయిని మరో లెవెల్‌కి తీసుకెళ్లాడు. 'చిరుత'తో మంచి ఆరంభం అందుకున్న రామ్ చరణ్, రెండో సినిమాతోనే ఇండస్ట్రీ హిట్ కొడతాడని ఎవరూ ఊహించలేకపోయారు. ఈ చిత్రానికి అల్లు అరవింద్ అప్పట్లో భారీగా, రూ. 40 కోట్లకుపైగా బడ్జెట్ ఖర్చు చేశారు. అప్పటి ట్రేడ్ వర్గాల్లో ఇది రిస్క్ అని భావించినా, ఆ నమ్మకాన్ని మగధీర అద్భుత విజయంగా నిలబెట్టింది. మొదట్లో సందేహించిన వారందరికీ షాక్ ఇచ్చేలా, మొదటి వారంలో నుంచే హవా కొనసాగింది. 1000 థియేటర్స్‌లో విడుదలైన మగధీర.. 77.60 కోట్లకు పైగా షేర్ వసూలు చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. అత్తారింటికి దారేది వచ్చే వరకు కూడా ఇండస్ట్రీ హిట్ ఇదే. థియేట్రికల్ బిజినెస్ చేసిన మొత్తము రూ.40.42 కోట్లు కాగా, ఫైనల్ గా బయ్యర్లకు రూ.37.54 కోట్ల లాభం రావడం అప్పటికి సినీ పరిశ్రమలో అరుదైన విజయంగా చరిత్రలో నిలిచింది. పోకిరి తర్వాత ఒక తెలుగు సినిమాకు భారీ స్థాయిలో షేర్ వసూలు చేయడం ఇదే. 16 ఏళ్ల తర్వాత కూడా ఈ చిత్రం సృష్టించిన ప్రభావం, రికార్డులు సినిమా ప్రియుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. మగధీర విజయంతో రామ్ చరణ్ హీరోగా నిలదొక్కుకోగా, రాజమౌళి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి మగధీరకి సంబంధించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నా కెరీర్ లో ఎక్కువ కష్టంగా అనిపించిన చిత్రం మగధీర. ఎందుకంటే అప్పటికి ఆ బడ్జెట్ చాలా ఎక్కువ. అదే విధంగా ఆ సినిమా చేసేటప్పుడు అంతే ఎంజాయ్ కూడా చేశాను అని చెప్పుకొచ్చారు. గ్రాఫిక్స్ విషయంలో నాకు అవగాహన కలిగింది ఆ చిత్రంతోనే అని రాజమౌళి స్పష్టం చేశారు. ఈ సినిమాలో, చరణ్ సరసన నాయికగా కాజల్ అగర్వాల్ అలరించింది. ఈ కథ అటు రాజుల కాలంలో .. ఇటు ప్రస్తుత కాలంలోను నడుస్తుంది. పైగా పునర్జన్మలతో ముడిపడి ఉంటుంది. తన కెరియర్లో తొలి అడుగులు వేస్తున్న చరణ్ ను ఈ సినిమా నిలబెట్టింది అని చెప్పాలి. కథాకథనాలతో పాటు, ఈ సినిమా కోసం కీరవాణి స్వరపరిచిన పాటలు కూడా సక్సెస్ కావడంతో మూవీ సూపర్ డూపర్ హిట్ అయింది. ఈ చిత్రం విడుదలై నేటితో 16 ఏళ్లు కావడంతో మూవీకి సంబంధించిన జ్ఞాపకాలని నెమరవేసుకుంటున్నారు.



## నటి జయసుధ భర్త ఆత్మహత్యకు కారణం?



సహజనటి జయసుధ ఎన్నో క్లాసిక్ హిట్ చిత్రాల్లో తనదైన సహజనటనతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. తెలుగు నాట అగ్ర హీరోల సరసన నటించిన జయసుధ ప్రముఖ హిందీ నిర్మాత, జీతేంద్ర కజిన్ నితిన్ కపూర్ ని రెండో వివాహం చేసుకున్నారు. అయితే నితిన్ కపూర్ కొన్ని సినిమాల నిర్మాణం కారణంగా ఆర్థికంగా నష్టాలను ఎదుర్కొన్నారని, దాని కారణంగా తీవ్ర ఒత్తిడి (డిప్రెషన్)ని ఎదుర్కొన్నారని మీడియాలో కథనాలొచ్చాయి. ఆయన అకస్మాత్తుగా ముంబైలో తన తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న సమయంలో ఏడు అంతస్తుల భవంతి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం సంచలనమైంది. ఈ వార్తను జీర్ణించుకోలేకపోయారు జయసుధ అభిమానులు. జయసుధ, ఆమె కుటుంబం దీని నుంచి తేరుకునేందుకు కొన్ని సంవత్సరాలు పట్టింది. ఆయన ఎక్కువగా ఆత్మహత్య ఆలోచనలతో ఉండటం కలవరపెట్టేదని జయసుధ గత ఇంటర్వ్యూలలో చెప్పారు. ఎన్నో ఒడిదుడుకులు ఒత్తిళ్లు: ఇప్పుడు జయసుధ - నితిన్ కపూర్ దంపతుల పెద్ద కుమారుడు నిహార్ కపూర్ తన తండ్రి ఆత్మహత్యకు గల కారణాలను వివరించారు. నితిన్ సహజంగానే ఫిట్ గా ఉండేవారు. జిమ్ కి వెళ్లేవారు. కానీ ఆయన చిన్న వయసు నుంచే సుగర్ (డయాబెటిస్) సహా పలు అనారోగ్యాలను ఎదుర్కొన్నారు. పదేళ్ల వయసు నుంచి వున్న సమస్య ఇది. జిమ్ కి వెళ్లి ఆరోగ్యం పరంగా జాగ్రత్తగా ఉండాల్సిన స్థితి. దానికి తోడు కెరీర్ పరంగా ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. సినీనిర్మాతగా ఏదీ కలిసి రాలేదు. చాలా ఏళ్లుగా సక్సెస్ కోసం ట్రై చేస్తున్నా సాధ్యపడలేదు. ఇది ఒక్కటే కాదు... ఆయన ఆరోగ్యం, కెరీర్, ఇతరత్రా చాలా విషయాలు కలిసి రాలేదు. ఒకసారి మొదలు పెట్టిన సినిమా ఆగిపోయింది. బాలీవుడ్ పెద్ద నిర్మాత ఒక సినిమాని కొట్టేసాడు. వాళ్లకు ఉన్న ఆర్థిక బలం, లాయర్ల అండ కారణంగా వారితో కోర్టు కేసు వేసి ఫైట్ చేయలేము. ఇలాంటి వాటి వల్ల డిప్రెషన్ మరింత పెరిగింది. ఒత్తిడిలో ఉన్న వ్యక్తులకు సహజంగానే, నా వల్ల కుటుంబం చాలా కష్టాల్లో పడింది.. వారంతా నావల్లనే నష్టపోయారు అనే ఆలోచన వచ్చేస్తుంది. ఇది మరింత డిప్రెషన్‌లోకి తీసుకుని వెళ్లింది. చాలా సంపాదించాలనే తపన: నేను- అమ్మ- తమ్ముడు .. మాలో ఎవరికీ మెటీరియలిస్టిక్ ఆలోచనలు లేవు. లగ్జరీ కార్ కావాలి.. పెద్ద భవంతి కావాలి. బంగారం కావాలి.. ఖరీదైన ఫ్యాన్సీ బట్టలు కావాలి.. వంటి ఆలోచనలు మాలో లేవు. కానీ ఆయన అలా కాదు. పేరు సంపాదించాలి.. ఇంకా చాలా సంపాదించాలి. నిర్మాతగా ఎదగాలి.. సక్సెస్ సాధించాలని అనుకునేవారు. కానీ స్ట్రగుల్ ని ఫేస్ చేసారు... అని నిహార్ తెలిపారు.

## నిత్యా మీనన్.. అక్కడ సినిమాలే ఎందుకు..?



సౌత్ లో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్స్ లో నిత్యా మీనన్ ఒకరు. ఆమె సినిమా సెలెక్ట్ చేసింది అంటే సంథింగ్ స్పెషల్ అన్నట్టే లెక్క. తెలుగులో స్టార్ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్న నిత్యా మీనన్ ఎందుకో ఇక్కడ కెరీర్ కొనసాగించలేకపోయింది. నిత్యా తో మంచి లవ్ స్టోరీస్ తీసిన వాళ్లు ఇప్పుడు మన దగ్గర ఆమెకు తగిన పాత్రలు ఇవ్వట్లేదు. మహానటి కోసం నాగ్ అశ్విన్ ముందు ఆప్షన్ నిత్యానే అయినా కొన్ని కారణాల వల్ల ఆమె ప్లేస్ లో కీర్తి సురేష్ వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో భీమ్లా నాయక్.. ఐతే తెలుగు మేకర్స్ నిత్యాని కన్విన్స్ చేసే కథలు రాయట్లేదు. 2022 లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో భీమ్లా నాయక్ సినిమా చేసింది నిత్యా మీనన్. ఆ సినిమాలో తన పాత్రకు న్యాయం చేసింది అమ్మడు. ఐతే తెలుగు మేకర్స్ పట్టించుకోకపోయినా కోలీవుడ్ లో మాత్రం నిత్యా మీనన్ అదరగొట్టేస్తుంది. అమ్మడు అక్కడ వరుస సినిమాలతో బిజీ అయ్యింది. కోలీవుడ్‌లో ఈమధ్యనే తలైవన్ తలైవి సినిమాతో మరో సక్సెస్ అందుకుంది నిత్యా మీనన్. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ సినిమా భార్య భర్తల మధ్య పెళ్లైన కొత్తలో ఆ తర్వాత వచ్చే గొడవల నేపథ్యంతో ఈ సినిమా వచ్చింది. పాండిరాజ్ ఈ సినిమాను డైరెక్ట్ చేశారు. నిత్యా మీనన్ తన సహజ నటనతో ఆకట్టుకుంది. నిత్యా మీనన్ తెలుగు ఫ్యాన్స్ .. తెలుగులో నిత్యాకు నచ్చే సినిమాలు రావట్లేదా లేదా ఆమే కావాలని గ్యాప్ తీసుకుంటుందా అన్నది తెలియదు కానీ నిత్యా మీనన్ తెలుగు ఫ్యాన్స్ ఆమెను చాలా మిస్ అవుతున్నారు. తలైవన్ తలైవి సినిమా తెలుగులో సార్ మేడం అంటూ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించాలని చూస్తున్నారు. టాలీవుడ్ నిత్యా మీనన్ ని దూరం చేసుకుంటుంది. ఆమెకు తగిన పాత్రలు రాస్తే.. నిత్యా తెలుగు సినిమాలు చేయడానికి ఎప్పుడూ రెడీ అంటుంది. నిత్యా మీనన్ ప్రస్తుతం ధనుష్ తో ఇడ్లీ కొట్టై సినిమా చేస్తుంది. ఇదే కాకుండా కాదలిక్క నెరుమల్లై సినిమా కూడా చేస్తుంది నిత్యా మీనన్. కోలీవుడ్‌లో తన ఫాం కొనసాగిస్తున్న నిత్యాని తెలుగు సినిమాల్లో కూడా చూడాలని కోరుతున్నారు ఆడియన్స్. కథ నచ్చాలే కానీ నిత్యా కచ్చితంగా ఏ భాషలో అయి నా సినిమాలు చేస్తుంది.

## రానా కూడా తండ్రి కానున్నాడా?

టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి లాక్ డౌన్ టైమ్‌లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. షీ సెడ్ ఎస్ అనే ప్రముఖ ఈవెంట్ సంస్థ మేనేజర్ మిహీకా బజాజ్ ను మనువాడనున్నట్లు ప్రకటించి అప్పట్లో అందరికీ చిన్నపాటి షాక్ ఇచ్చారు. ఆ తర్వాత కొద్ది రోజులకే పెళ్లి చేసుకున్నారు. 2020 ఆగస్టు 8వ తేదీన రానా- మిహీకా వివాబంధంతో ఒక్కటయ్యారు. అయితే మిహీకా బజాజ్.. విక్టరీ వెంకటేష్ కుమార్తె ఆశ్రిత క్లాస్మేట్ అని, ఆమె మ్యారేజ్ లో ఇద్దరూ క్లోజ్ అయ్యామని ఓ సారి తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి పెళ్లి చేసుకున్నామని చెప్పారు. మరోసారి కరోనా టైమ్ బోర్ కొట్టి కొత్త కొత్త వాళ్లను పరిచయం కోసమని హౌస్ పార్టీ అనే యాప్ ను డౌన్లోడ్ చేశానని రానా దగ్గుబాటి వెల్లడించారు. మృణాల్‌ను ఇలా సర్‌ప్రైజ్ చేసిన హీరో ఆ యాప్ లోనే మిహీకా పరిచయమైందని చెప్పారు. అలా పెళ్లి చేసుకున్న రానా- మిహీకా.. మ్యారేజ్ లైఫ్ ను ఫుల్ గా ఎంజాయ్ చేస్తున్నారు. ఇద్దరూ అటు ప్రొఫెషనల్ లైఫ్ ను.. ఇటు వివాహ జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నారనే చెప్పాలి. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ వార్త వైరలవుతోంది. త్వరలోనే పేరెంట్స్ గా వారిద్దరూ ప్రమోట్ అవ్వనున్నారని టాక్ వస్తోంది. రీసెంట్ గా మిహీకా.. క్రీమ్ కలర్ డ్రెస్ లో దిగిన పోస్ట్ చేశారు. ఆ ఫోటోకు క్యాప్షన్ గా జస్ట్ ఇప్పుడే అనిపించిందంటూ రాసుకొచ్చారు. దీంతో ఒక్కసారిగా అందరి దృష్టి పడింది. మిహీకా ప్రెగ్నెంట్ అంటూ రూమర్స్ స్టార్ట్ అయ్యాయి. అది నిజమో లేదా అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. కానీ అంతా విషెస్ మాత్రం చెప్పేస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం ఇలాంటి రూమర్సే స్ప్రెడ్ అయ్యాయి. ఆ సమయంలో తాను ప్రెగ్నెంట్ కాదని మిహీకా తెలిపారు. తాను పెళ్లి చేసుకుని చాలా సంతోషంగా ఉన్నానని, ఈ మధ్య బరువు పెరిగానని పేర్కొన్నారు. దీంతో అందరూ ప్రెగ్నెంట్ అనుకుంటున్నారంతేనని అన్నారు. ప్రెగ్నెంట్ అయినప్పుడు తప్పకుండా చెబుతానని వెల్లడించారు. అందుకే ఇప్పుడు క్రేజీ క్యాప్షన్ తో ప్రెగ్నెన్సీని అనౌన్స్ చేసినట్లు ఉన్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.



## భారత చివరి టెస్ట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం.. మనకు లాభమా, నష్టమా..



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్ జట్టుతో జరగనున్న భారత చివరి టెస్ట్ మ్యాచ్‌కు వర్షం ప్రభావం ఉంది. ఈ విషయాన్ని అక్యూ వెదర్ తెలిపింది. అయితే వర్షం అంతరాయం భారత జట్టుకు లాభమా లేక నష్టమా అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ఆండర్సన్-టెండుల్కర్ ట్రోఫీ 2025లో ఐదవ, చివరి టెస్ట్ మ్యాచ్ కోసం వేదిక సిద్ధమైంది. జూలై 31న మధ్యాహ్నం 3.30 గంటల నుంచి లండన్‌లోని ది ఓవల్‌లో ఇంగ్లండ్, భారత జట్లు తలపడనున్నాయి. ఇప్పటివరకు ఈ రెండు జట్లు నాలుగు టెస్ట్ మ్యాచ్‌లలో పోటీపడ్డాయి. ఇంగ్లండ్ మొదటి, మూడో టెస్ట్‌లలో విజయం సాధించగా, భారత్ రెండవ టెస్ట్‌లో గెలిచింది, నాల్గవ టెస్ట్ డ్రాగా ముగిసింది. ఈ నేపథ్యంలో సిరీస్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యంలో ఉండగా, చివరి టెస్ట్‌లో భారత్‌పై ఒత్తిడి ఉంది. ఈ మ్యాచ్‌లో ఇండియా ఓటమి ఇంగ్లాండ్‌కు సిరీస్ విజయాన్ని అందిస్తుంది. అందుకే భారత జట్టు పూర్తి శక్తితో ఆడి, 2-2 స్కోర్‌తో సిరీస్‌ను సమం చేయాలని లక్ష్యంతో ఉంది. కానీ మ్యాచ్ మొదటి రోజు వాతావరణం అభిమానులకు నిరాశ కలిగించేలా ఉంది. లండన్‌లో వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఎక్కువగా ఉందని అక్యూ వెదర్ సూచిస్తోంది. ఉదయం సమయంలో వర్షం ఎక్కువగా కురిసే అవకాశం ఉండగా, మధ్యాహ్నం సమయంలో కొద్దిపాటి మేఘావృతం ఉంటుందని తెలుస్తోంది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వర్షం కురిసే అవకాశం 50 శాతం ఉండగా, 85 శాతం మేఘావృతమై ఉంటుందని అంచనా. ఈ పరిస్థితుల్లో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

భారత్‌కు లాభమా, నష్టమా?..వర్షం ఆటంకం కలిగిస్తే, దాని ప్రభావం భారత జట్టుపై ఎలా ఉంటుంది. వర్షం వల్ల మ్యాచ్ డ్రాగా ముగిస్తే, ఇంగ్లాండ్ సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఇది భారత్‌కు నష్టం కలిగించే అంశమని చెప్పవచ్చు. మరోవైపు, వర్షం వల్ల ఆట సమయం తగ్గితే, భారత బ్యాట్స్‌మెన్‌లపై ఒత్తిడి పెరుగుతుంది.

## సమం చేస్తారా



**లండన్-నవభూమి:** మాంచెస్టర్ టెస్ట్‌లో అద్భుత పోరాటాన్ని ప్రదర్శించిన భారత జట్టు.. ఇంగ్లండ్ పర్యటనను విజయంతో ముగించాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీసలో 1-2తో వెనుకంజలో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీసను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. లార్డ్స్‌లో క్రాలేతో గిల్ వాగ్వాదం.. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో స్టోక్స్ డ్రా ప్రతిపాదనకు జడేజా నో చెప్పడం.. తాజాగా క్యూరేటర్ లీ ఫోర్టిసపై గంభీర్ ఆగ్రహం లాంటి ఘటనలతో సిరీస్ హాట్‌హాట్‌గా మారింది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ లాంటి స్టార్లు లేకుండా.. యువ ఆటగాడు గిల్ సారథ్యంలో ఇంగ్లండ్ వెళ్లిన భారత్ కొన్నిసార్లు తడబడినా.. ఓవరాల్‌గా ఢీ అంటే ఢీ అన్నట్టుగానే ఎదురు నిలిచింది. పైగా, స్టోక్స్ గైర్హాజరీలో డీలాపడ్డ ఇంగ్లండ్‌కు నాకౌట్ పంచ్ ఇచ్చేందుకు గిల్ సేనకు ఇదో సువర్ణావకాశం.

బ్యాటర్లు అదరహో..నాలుగో టెస్ట్‌లో చాలా భాగం ఆతిథ్య జట్టుదే ఆధిపత్యమే అయినా.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల అసాధారణ పోరాటంతో భారత్ డ్రాతో గట్టెక్కింది. ముఖ్యంగా కీలక బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉండడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. ఓపెనర్ రాహుల్ నిలకడగా రాణిస్తుండగా.. గిల్ మళ్లీ టచ్‌లోకి రావడం శుభపరిణామం. అయితే, మరో ఓపెనర్ జైస్వాల్ వరుస వైఫల్యాలు జట్టును దెబ్బ తీస్తున్నాయి. సాయి సుదర్శన్ క్రీజులో నిలిచేందుకు ప్రయత్నించాలి.

## గంభీర్‌కు ఆ హక్కుంది గిల్



**లండన్-నవభూమి:** ఓవల్ చీఫ్ క్యూరేటర్ ఫోర్టిసతో ఘర్షణ విషయంలో కోచ్ గంభీర్‌కు గిల్ మద్దతుగా నిలిచాడు. పిచ్‌ను పరిశీలించడానికి భారత కోచ్‌కు హక్కుందన్నాడు. ఇదో అనవసర వివాదమని అభిప్రాయపడ్డాడు. భారత సహాయ సిబ్బంది వికెట్‌ను పరిశీలించడానికి వెళ్లినప్పుడు.. దూరం నుంచే చూడాలని ఫోర్టిస్ చెప్పడంతో అతడిపై గౌతీ ఫైర్ అయ్యాడు. 'ఇలా దూరం నుంచే చూడాలని చెప్పడం ఇంతకుముందు ఎన్నడూ జరగలేదు. వికెట్‌ను పరిశీలించడం కెప్టెన్, కోచ్ బాధ్యత' అని గిల్ చెప్పాడు. ఇతర వేదికలపై ఎటువంటి ఆంక్షలు విధించలేదని తెలిపాడు. కాగా, ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్ ఒలీ పోప్, రూట్ బుధవారం పిచ్‌పై నిలుచొని షాడో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. దీంతో టీమిండియా పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఫ్యాన్స్ విమర్శిస్తున్నారు. మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ఇర్ఫాన్ పఠాన్ కూడా గంభీర్‌ను సమర్థించారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**